శుక్రవారం
9•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 271
• పేజీలు : 16 + (20/16)

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



## ఎంబీసీలకు సర్కారు బాసట

**ఎస్సీ, ఎస్టీల మాదిరి ఎంబీసీలకు సబ్సిడీ ▪ ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబీసీ)కు సర్కారు బాసటగా నిలుస్తున్నది. స్వయంఉపాధి పథకాలకు ఆర్థిక సహకారం అందించే విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చేవిధంగా ఎంబీసీలకు కూడా సబ్సిడీలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. ఎంబీసీల కోసం అమలు చేసే స్వయం ఉపాధి పథకాల సబ్సిడీ ఫైలుపై ముఖ్యమంత్రి గురువారం సంతకం చేశారు. సబ్సిడీల విషయంలో స్పష్టత వచ్చినందున ఎంబీసీల కోసం అమలు చేయాల్సిన పథకాలకు వెంటనే రూపకల్పన చేసి, సహాయం అందించడం ప్రారంభించాలని సీఎం కేసీఆర్ అధికారులను కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్లో రూ.వెయ్యికోట్లు కేటాయించామని, ఈసారి కూడా బడ్జెట్లో నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఆ నిధులతో ఎంబీసీ కులాల్లోని పేద యువతకు కావాల్సిన ఆర్థిక సహకారం అందించాలని సీఎం ఆదేశించారు. ఎంబీసీలకు గరిష్ఠస్థాయిలో సబ్సిడీ అందించాలని స్పష్టం చేశారు. బీసీలకు అమలుచేసే ఆర్థిక సహకార పథకానికి గతంలో రూ.లక్షకు

మిగతా 2వ పేజీలో



## పీజీ మెడికోలకు ఊరట

**సర్కారీ దవాఖానల్లో సేవ ఇక తప్పనిసరి కాదు ▪ సీఎం కేసీఆర్ సానుకూల స్పందన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పీజీ పూర్తిచేసిన మెడికల్ విద్యార్థులు ఖచ్చితంగా ఏడాదిపాటు ప్రభుత్వ దవాఖానల్లో పనిచేయాలన్న నిబంధన తొలగిస్తున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ప్రభుత్వ దవాఖానల్లో చాలినంత సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తున్నందున, మెడికల్ విద్యార్థులతో పనిచేయించాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశ పెట్టనున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేస్తామన్నారు. ఈ ఏడాది పీజీ పూర్తిచేసిన విద్యార్థులు ప్రభుత్వ దవాఖానల్లో పనిచేయకున్నా, వారి విద్యార్హతలను రిజిస్టర్ చేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు మెడికల్ పీజీ పూర్తిచేసినవారు విధిగా ఏడాదిపాటు ప్రభుత్వ దవాఖానల్లో పనిచేయాలనే నిబంధన ఉంది. ఇలా చేస్తేనే విద్యార్హతలను రిజిస్టర్ చేయాలన్న నిబంధన అమలవుతున్నది. ఈ నిబంధన తొలగించాలని విద్యార్థులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌ను ముఖ్యమంత్రి సానుభూతితో పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు.

# వీహబ్‌తో నవశకం!

### మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం

- ప్రోత్సాహంలేకే మరుగునపడుతున్న మహిళల ప్రతిభ
- మహిళలకు అండగా నిలిచేందుకే వీహబ్ ఏర్పాటు
- మహిళా ఆవిష్కర్తలకు ప్రభుత్వమే మొదటి వినియోగదారు
- వీహబ్‌ను ప్రారంభిస్తూ మంత్రి కే తారకరామారావు వ్యాఖ్యలు




గురువారం హోటల్ ర్యాడిసన్‌లో జరిగిన వీహబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటీ మంత్రి కే తారకరామారావు, డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ టెస్సీ థామస్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, సీఐఐ చైర్మన్ వీ రాజన్న, కలారీ క్యాపిటల్ సంస్థ ఎండీ వాణి కోలా, వీహబ్ సీఈవో దీప్తి రావుల తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మహిళలు కొత్తచరిత్ర లిఖించి ఆవిష్కర్తల రంగంలో ముందడుగు వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వీహబ్ మొదటిమెట్టు కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు కట్టుబడి భారతదేశంలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వమే ముందుకు వచ్చి వీహబ్ పేరుతో పరిశోధనలకు ఊతం ఇస్తున్నదని ఆయన ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లో వీహబ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మిస్సైల్ ఉమన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ టెస్సీ థామస్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఐఐ చైర్మన్ వీ రాజన్న, కలారీ క్యాపిటల్ సంస్థ ఎండీ వాణి కోలా, వీహబ్ సీఈవో దీప్తి రావుల, ఫిక్కి, ఫిక్కి మహిళా విభాగం, కోవె సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 'మానవ పరిణామక్రమంలో మహిళల్లో సృజనాత్మక శక్తి ఉన్నప్పటికీ వారికి ప్రోత్సాహం దక్కకపోవడం వల్ల వారి ప్రతిభ వెలుగులోకి రాలేదు. ఇటీవలికాలంలో కూడా అండదండలు లేకపోవడం వల్ల పలువురు ముందుకురాలేకపోయారు. అందుకే మహిళలకు అండగా నిలువాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. విజేతల్లో ఎక్కువశాతం ఎవరి ప్రోత్సాహం లేకుండానే ఎంతో శ్రమకోర్చి తమ సత్తాను చాటుకున్నవారే. అయితే అలాంటి వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆవిష్కరణల కేంద్రం టీహబ్ ప్రారంభించాం. స్వల్పకాలంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించాం. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో టీహబ్ స్టార్టప్ గెలిచింది. ఇదే స్ఫూర్తితో మహిళలకు ప్రత్యేక ఆవిష్కరణల కేంద్రం ఉండాలని వీహబ్ ఆలోచన చేశాం. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

మిగతా 2వ పేజీలో

- తెలంగాణకు మిస్సైల్ ఉమన్ టెస్సీ థామస్ సెల్యూట్
- టీహబ్, వీహబ్‌లపై ప్రశంసల జల్లు
- తెలంగాణ ప్రభుత్వంతో నీతి ఆయోగ్ 'నారీ శక్తి' తొలి ఒప్పందం
- వీహబ్‌తో జట్టుకట్టిన మరో ఆరు సంస్థలు



రిజర్వేషన్ కోటా పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్న టీఆర్‌ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పసునూరి దయాకర్, సీతారాం నాయక్, నగేశ్, మల్లారెడ్డి, బీబీ పాటిల్

## నాలుగో రోజూ ఆగని నిరసనలు

**పార్లమెంటు లోపలా బయటా టీఆర్‌ఎస్ ఆందోళనలు**

**రిజర్వేషన్లు పెంచుకొనే అధికారాన్ని రాష్ట్రాలకివ్వాల్సిందే: ఎంపీ వినోద్‌కుమార్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రిజర్వేషన్లు పెంచుకొనే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలంటూ పార్లమెంట్ లోపలా బయటా తెలంగాణ రాష్ట్ర సమితి తన ఆందోళనలను కొనసాగిస్తూనే ఉన్నది. వరుసగా నాలుగో రోజయిన గురువారం కూడా ఎంపీలు.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ గళం వినిపించారు. లోక్‌సభ ప్రారంభం కాగానే వెల్‌లోకి దూసుకెళ్లారు. నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు సీతారాంనాయక్, పసునూరి దయాకర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నగేశ్, బీబీపాటిల్ ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సభ రెండుసార్లు వాయిదాపడిన అనంతరం టీఆర్‌ఎస్ లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఉప నేత వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడు తూ.. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం తాత్సార వైఖరిని అవలంబిస్తున్నదని విమర్శించారు. పార్లమెంట్‌లో బిల్లు పెడితే

మిగతా 2వ పేజీలో

### రాష్ట్ర రైతు సమన్వయ సమితి
## అధ్యక్షుడిగా గుత్తా

**ఉత్తర్వులు జారీ.. 12న బాధ్యతల స్వీకరణ**

**ఎండీతోపాటు ముగ్గురు డైరెక్టర్ల నియామకం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారధి ఉత్తర్వులు జారీచేశారు. ఆయనతోపాటుగా సంస్థకు ఎండీని, మరో ముగ్గురు డైరెక్టర్లను నియమించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం జగన్‌మోహన్ తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఎండీగా వ్యవహరించనున్నారు. ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రాంరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జీ లక్ష్మీబాయి, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సీహెచ్‌వీ సాయిప్రసాద్‌లను డైరెక్టర్లుగా నియమించారు. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాన్-ప్రాఫిట్ కార్పొరేషన్‌గా ఈ సమితిని ఏర్పాటు చేశారు. 2013 కంపెనీ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన గుత్తా సుఖేందర్‌రెడ్డి మంచి రైతుగా గుర్తింపు పొందారు. మదర్ డైయిరీ చైర్మన్‌గా పనిచేశారు. దీంతోపాటుగా మూడుసార్లు

మిగతా 2వ పేజీలో

# ఏవియేషన్‌లోనూ తెలంగాణ లీడర్

### ఏవియేషన్ వర్సిటీని ఇక్కడ నెలకొల్పండి

- బేగంపేటలోని విమానాశ్రయం స్థలం అనువైనది
- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కేటీఆర్ సూచన
- ఏవియేషన్, ఏరోస్పేస్ హబ్‌గా నిలిచిన తెలంగాణ
- కొత్తగూడెం, జక్రాన్‌పల్లిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్‌కు ప్రణాళిక
- సీ-ప్లేన్, ఎయిర్ అంబులెన్స్ సాధ్యాసాధ్యాలపై పరిశీలన
- వింగ్స్ ఇండియా-2018 సదస్సులో మంత్రి కేటీఆర్



జ్యోతి ప్రజ్వలన చేసి వింగ్స్ ఇండియా - 2018 సదస్సును ప్రారంభిస్తున్న ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రతిపాదన దశలో ఉన్న నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారకరామారావు.. కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. తెలంగాణలో నాలుగు ఏవియేషన్ ఏరోస్పేస్ సెజ్‌లు ఉన్నాయని, ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన విమానయాన సంస్థలైన బోయింగ్, ప్రట్ అండ్ విట్నీ, టీఏఎస్‌ఎల్, జీఈ తదితర కంపెనీలు హైదరాబాద్‌లో సంస్థలు నెలకొల్పినట్లు చెప్పారు. తెలంగాణ సర్కారు చేస్తున్న కృషి, విదేశీ కంపెనీల రాక వంటి అంశాలు దేశ ఏవియేషన్ రంగంలో తెలంగాణను లీడర్‌గా నిలుపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోని పలు నగరాలను అనుసంధానం చేసేలా హుసేన్‌సాగర్ కేంద్రంగా సీ-ప్లేన్ ప్రాజెక్టు, తెలంగాణవ్యాప్తంగా ఉన్న హైవేలను అనుసంధానం చేసేలా ఎయిర్ అంబులెన్స్ సౌకర్యాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బేగంపేట ఎయిర్‌పోర్టులో నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా – 2018 అంతర్జాతీయ వైమానిక సదస్సు, వైమానిక ప్రదర్శనను ఆయన గురువారం పౌర విమానయాన శాఖ కార్యదర్శి నారాయణ్ చౌబే, ఫిక్కీ వైస్ ప్రెసిడెంట్ సందీప్ సోమానీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఏవియేషన్ యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం వల్ల తెలంగాణ సమతుల సమగ్ర అభివృద్ధికి అది దోహదపడుతుందన్నారు. సివిల్

మిగతా 6వ పేజీలో

## కేంద్ర మంత్రి పదవులకు టీడీపీ గుడ్‌బై

- అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి రాజీనామా
- ప్రధానికి లేఖలు
- ఎన్డీయే ఎంపీలుగా కొనసాగుతామన్న సుజనాచౌదరి



11



# దంచికొడుతున్న ఎండలు!



- ఈ సారి రికార్డుస్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు!
- వడగాలుల తీవ్రత ఎక్కువేనంటున్న వాతావరణశాఖ అధికారులు
- రాజస్థాన్ నుంచి వచ్చే వేడిగాలులే కారణం
- ఏటా పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతోనే ముప్పు
- పంటలపైనా ప్రభావం ఉంటుదని వ్యవసాయ శాస్త్రవేత్తల హెచ్చరిక
- వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేస్తున్న ప్రభుత్వం

### మార్చిలోనే వేసవి మంటలు

**రాష్ట్రంలో** ఎండలు దంచికొడుతున్నాయి. ఎండాకాలం ప్రారంభమైన మార్చి మొదట్లోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్న వేళల్లో భగభగ మండుతున్న ఎండల్ని చూసి ప్రజలు ఇండ్లల్లో నుంచి బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒక డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు ముందస్తు నివేదికల ద్వారా వెల్లడించారు. కొన్ని రోజుల్లో రికార్డు స్థాయికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన వడగాలుల ప్రభావం ఎక్కువ రోజుల్లో అధికంగా ఉండనుందని పేర్కొన్నారు. ఈసారి ఎండల తీవ్రత పంటలపై కూడా ప్రభావం చూపనున్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా రక్షించేందుకు వేసవి కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసుకున్నది. ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో గత కొన్నేండ్లుగా ఎండల తీవ్రతలో వస్తున్న మార్పులు, అప్రమత్తతపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం...

11

## 15న బడ్జెట్

**తుదికూర్పుపై కసరత్తు చేస్తున్న ఆర్థికమంత్రి ఈటల**

- కేటాయింపుల్లో వ్యవసాయరంగానికి పెద్దపీట
- సాగునీటి ప్రాజెక్టులు, బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం
- సమావేశాల నిర్వహణపై చైర్మన్, స్పీకర్ ఉన్నతస్థాయి సమీక్ష

3

## 11న టీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం

బడ్జెట్ సమావేశాల్లో వ్యూహంపై చర్చ

# తమిళభాష అమలుతీరుపై అధ్యయనం

## మహాబలిపురం, కంచిలో సాహిత్య అకాడమీ చైర్మన్ బృందం పర్యటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమిళభాష అమలుతీరుపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ సారథ్యంలోని బృందం గురువారం తమిళనాడులోని మహాబలిపురం, కంచి ప్రాంతాల్లో పర్యటించింది. సీబీఎస్ఈ, టెక్నో పాఠశాలలను పరిశీలించి, తమిళభాష అమలుతీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తమిళనాడులోని విద్యాశాఖ, తమిళభాషా అభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. సీబీఎస్ఈ వంటి అన్ని జాతీయస్థాయి విద్యాసంస్థల్లో టెన్త్ వరకు తమిళభాషను తప్పనిసరిగా అమలుచేస్తున్న తీరును అధ్యయనం చేశారు. తమిళ మీడియంలో ఉన్నతస్థాయి వరకు చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాల్లో 20శాతం రిజర్వేషన్ విధానాన్ని అమలుచేస్తున్నారని ఈ సందర్భంగా సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీ సెక్రటరీ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు అధ్యయన బృందంలో ఉన్నారు.



తమిళనాడు విద్యాశాఖ మంత్రి తిరు సెంగోట్టైయాన్‌తో భేటీ అయిన సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సెక్రటరీ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, తెలుగు వర్సిటీ ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ తదితరులు

# సీఎం కేసీఆర్ కృషి అభినందనీయం

## ఆలయాల అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాలు ఉన్నతమైనవి

## కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ప్రశంసలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధ్యాత్మికరంగంలో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమని కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి మహాస్వామి ప్రశంసించారు. ఆయన ప్రయత్నాలన్నీ విజయవంతం కావాలని శుభాశీస్సులందించారు. గురువారం రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, భాషా సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సాహిత్య అకాడమీకార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పలు అంశాల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి స్వామి సీఎం కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారు. దేవాలయాల అభివృద్ధి కోసం తెలంగాణ సీఎం చేస్తున్న ప్రయత్నాలు చాలా ఉన్నతమైనవని చెప్పారు. తమిళనాడు- తెలంగాణ మధ్య ఆధ్యాత్మిక సాంస్కృతిక ఆదానప్రదానాలు పెంపొందాలని ఆకాంక్ష వ్యక్తంచేశారు. తెలుగుభాష ఔన్నత్యం గురించి విజయేంద్ర సరస్వతి.. ప్రత్యేకంగా ప్రస్తావించారు. త్వరలో తెలంగాణలో పర్యటించనున్నట్టు ఆయన వెల్లడించారు.



## వనపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వనపర్తి మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖ ద్వారా ఈ నిధులను విడుదల చేసింది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## 16 మంది మున్సిపల్ ఇంజినీర్లకు పదోన్నతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలకశాఖలో పనిచేస్తున్న 16మంది సీనియర్ ఇంజినీర్లకు ఎస్ఈలుగా, అలాగే పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారికి సీఈవోగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ తివారీ నేతృత్వంలో డీపీసీ నిర్వహించి నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశంలో జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హాతోపాటు ఈ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పట్టాదార్ పాస్‌పుస్తకాల ముద్రణ బిడ్లు ఓపెన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణ బిడ్లను తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) గురువారం తెరిచింది. మొత్తం ఎనిమిది సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొనగా.. ఐదు సంస్థలు పాస్ పుస్తకాల ముద్రణకు అర్హత సాధించినట్టు తెలిసింది. శుక్రవారం పాస్ పుస్తకాల ముద్రణకు సంబంధించి ఒప్పందం చేసుకోనున్నారు. ఇది పూర్తయిన 21 రోజుల్లో పాస్ పుస్తకాలు ముద్రించి గ్రామాలకు సరఫరా చేయనున్నారు. ఏప్రిల్ రెండోవారంలో రైతుల చేతికి పట్టాదార్ పాస్ పుస్తకాలు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## పదో తరగతి పరీక్షల సందేహాలపై కౌన్సెలింగ్ కేంద్రం

### అందుబాటులోకి టోల్‌ఫ్రీ నంబర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి కౌన్సెలింగ్‌కేంద్రాన్ని ప్రాథమిక విద్యామండలి ఏర్పాటు చేయనున్నది. ఈ కౌన్సెలింగ్ కేంద్రం దాదాపు నెల పాటు సేవలు అందించనున్నది. సందేహాల నివృత్తికి 1800-425-7461 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కౌన్సిలింగ్ కేంద్రంలో ఒక రిటైర్డ్ ప్రిన్సిపాల్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.32 గంటలకు

సూర్యాస్తమయం: 6.21 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం అష్టమి (శనివారం ఉదయం 6.03 వరకు), నక్షత్రం: అనురాధ రాత్రి 12.46 వరకు తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: సాయంత్రం 5.40 నుంచి రాత్రి 7.16 వరకు, రాహుకాలం: ఉదయం 10.58 నుంచి మధ్యాహ్నం 12.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.54 నుంచి 9.41 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.50 నుంచి 1.37 వరకు, వర్జ్యం: ఉదయం 7.00 నుంచి 8.36 వరకు.

### లోకం పోకడ






అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం లలితకళాతోరణంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అవార్డులు అందుకున్న మహిళలతో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, నాయిని నర్సింహారెడ్డి

# రిజర్వేషన్లతోనే మహిళలకు న్యాయం

- చట్టసభల్లో మహిళల సంఖ్య పెరుగాలి: డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి
- త్వరలో రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయం :మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి తుమ్మల
- పోలీసుశాఖలో 33% రిజర్వేషన్లు అమలు: హోంమంత్రి నాయిని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే మహిళలకు అన్నిరంగాల్లో సంపూర్ణన్యాయం జరుగుతుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. చట్టసభల్లోకి మహిళలు అధికసంఖ్యలో రావాలని.. అప్పుడే మహిళల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని లలితాకళాతోరణంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, సాంస్కృతికశాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 17 రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన 20 మంది మహిళామూర్తులకు 'మహిళా విశిష్ట పురస్కారాల'తో సత్కరించారు. ఈ అవార్డు కింద లక్ష రూపాయల చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయాల్లో మహిళలు స్వతంత్రంగా అవకాశాలు దక్కించుకునే పరిస్థితులు లేవని, వచ్చిన కొద్దిమంది కూడా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మొదటి శాసనసభా సమావేశాల్లోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని డిప్యూటీస్పీకర్ గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం తక్షణమే 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కోరారు. ఆడపిల్ల పుడితే సంరక్షణ బాధ్యతను తీసుకునేందుకు సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ముందుకు వచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమరంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యలక్ష్మి, ఉచితవిద్య, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, పౌష్టికాహారం, కళ్యాణలక్ష్మి పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. మహిళల ప్రతిభ చాలా గొప్పదని.. మహిళలు పాటిస్తున్న ఆర్థిక క్రమశిక్షణ నేడు రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ రూపకల్పనకు స్ఫూర్తిగా నిలుస్తున్నదని అన్నారు.



నమస్తే తెలంగాణ జర్నలిస్టు సౌమ్య నాగపురికి అవార్డును అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ

**మహిళల కష్టాలు తీర్చేందుకే మిషన్ భగీరథ**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పాలనలో రాష్ట్రంలోని మహిళలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, మహిళలను ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తున్నదని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. బాలికల విద్య కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేశామని, త్వరలోనే హైదరాబాద్‌లో ప్రత్యేకంగా మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు అవకాశాలు కల్పించేందుకు ఐటీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వీ-హబ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. మహిళలు అనాదికాలం నుంచి ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టారని, ఈ ఏడాది చివరినాటికి ఇంటింటికి నల్లా ద్వారా కృష్ణా, గోదావరి జలాలు అందించనున్నట్టు చెప్పారు.

**సంపూర్ణ భద్రతకు చర్యలు**

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు చెప్పారు. షీటీమ్స్, భరోసా, సఖి కేంద్రాల ఏర్పాటుతో మహిళలు పూర్తిస్థాయి భద్రతతో స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖలో 33శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని, తాజాగా 735 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తిచేసుకొని విధుల్లో చేరారని వివరించారు. హైదరాబాద్ నగరంలో 200 షీటీమ్స్ పనిచేస్తున్నాయని అన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని.. తద్వారా కుటుంబం రాణిస్తుందని పేర్కొన్నారు. మహిళా కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో మహిళలకు అవకాశాలు పెరిగాయన్నారు. బాలికలు, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్య సమాజం ఆవిష్కృతం అవుతుందని కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని మహిళలు, శిశువుల ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోనే మహిళలు, శిశువుల ఆరో గ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు పొందిన మహిళామణులను మంత్రులు, డిప్యూటీ స్పీకర్ ప్రత్యేకంగా అభినందించారు. అవార్డులను అందుకున్నవారిలో 'నమస్తే తెలంగాణ'కు చెందిన మహిళాజర్నలిస్టు సౌమ్య నాగపురి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక సారథి చైర్మ న్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మహిళాసంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎం జగదీశ్, డైరెక్టర్ విజయేంద్రబోయి, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, మహిళా కార్పొరేషన్ డైరెక్టర్ నిర్మల, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ పీ సునీతా మహేందర్ రెడ్డి, ఖమ్మం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కవిత, వరంగల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జీ పద్మ, బీసీ కార్పొరేషన్ చైర్మన్ బీఎస్ రాములు, నగర మేయర్ సతీమణి బొంతు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



గురువారం వీ హబ్‌లో మంత్రి కేటీఆర్, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ ఆధ్వర్యంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, నారీశక్తి ప్రతినిధులు



గురువారం వీ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న మహిళలు


# వీహబ్‌తో నవశకం!

మొదటిపేజీ తరువాయి...

సమ్మిట్ ముగిసేరోజున వీహబ్ ప్రకటన చేశాం. స్వల్పకాలంలోనే ఆ ప్రాజెక్టును ప్రారంభించుకుంటున్నాం' అని తెలిపారు. ఆవిష్కరణలు ప్రోత్సహించాలంటే విద్యావిధానంలో కూడా మార్పులు రావాలని మంత్రి కేటీఆర్ అన్నారు. 'ప్రపంచం అంతా సిలికాన్ వ్యాలీలోని ఆవిష్కరణల వైపే ఎందుకు దృష్టిసారించాలి? మిగతా దేశాల్లో ఆవిష్కర్తలకు ప్రోత్సాహం దక్కకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందనేది స్పష్టం. చిన్నతనం నుంచే చదువు కేవలం మార్కులకోసమే అన్నట్టు కాకుండా ఆవిష్కరణలను పాఠ్యాంశంలో భాగం చేయాలి. జూనియర్ కాలేజీ విద్యార్థులకు పరిశోధన అవకాశం కల్పించాలి. తద్వారా మెరుగైన ఆవిష్కరణలు వస్తాయి. ఎస్‌యూపీడబ్ల్యూ ప్రాజెక్టుకు మార్కు లు కాకుండా నిజమైన పరిశోధనలకు చోటు కల్పించాలి. వీటితో పాటుగా పాలకులు ఆవిష్కర్తలకు భరోసాగా ఉండాలి. అందుకే వీహబ్‌లో రూపొందిన ఆవిష్కరణలకు మొదటి వినియోగదారుడిగా ప్రభుత్వం ఉంటున్నది. ప్రభుత్వశాఖలకు సంబంధించిన కొనుగోలు నిబంధనలను మహిళల కోసం పక్కనపెట్టి ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. వీహబ్ దేశానికి, మహిళలను ప్రోత్సహించే రంగానికి దిశా నిర్దేశం చేయాలి. స్ఫూర్తిగా నిలువాలి. ఐటీ రంగానికి సంబంధించిన ఆవిష్కరణలే కాకుండా అన్నిరకాల ఆవిష్కరణలకు వీహబ్ కేంద్రంగా నిలుస్తుంది. అందుకే వీహబ్‌కు ప్రాథమిక పెట్టుబడిగా రూ.15 కోట్లు కేటాయిస్తున్నాం. ఎంపికైన ఆవిష్కర్తలకు రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు అందజేస్తాం' అని మంత్రి కేటీఆర్ తెలిపారు. కాగా, ఈ కార్యక్రమం సందర్భంగా ఆరు ఒప్పందాలు ఆయా సంస్థల ప్రతినిధులు కుదుర్చుకున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యూఎన్‌డీపీ, సీఐఐ-ఇండియా ఉమెన్ నెట్‌వర్క్, సేల్స్‌ఫోర్స్, ఐఐఎం బెంగళూరు, ఎన్ఐడియా, పీడబ్ల్యూఎల్ ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల్లో ఉన్నాయి.

**తెలంగాణ ప్రభుత్వానికి సెల్యూట్**

డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్, మిస్సైల్ ఉమన్ టెస్సీ థామస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. వీహబ్‌లోని ఆవిష్కరణల ద్వారా రూపొందిన ఉత్పత్తులు, సేవలకు తామే మొదటి వినియోగదారుగా ఉంటామని, 25% ఉత్పత్తులు తాము కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. ఆవిష్కరణల కోసం టీహబ్ ప్రారంభించడం, మహిళల కోసం ప్రత్యేకంగా వీహబ్ ఏర్పాటుచేయడం ప్రశంసనీయమన్నా రు. 'చిన్న ఆవిష్కరణ పెద్ద విప్లవాత్మక ఫలితానికి బీజంగా మారుతుంది. అలా మహిళల ఆవిష్కరణలను వెన్నుతట్టేలా తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేయడం సంతోషకరం. ప్రస్తుతం మహిళల్లో విశేషశక్తి ఉంది. వారి ఆలోచనలకు తగిన ప్రోత్సాహం అందించడం, వేదికను కల్పించడం సంతోషకరం. ఒక ప్రాజెక్టు ఆలోచన మొదలుకొని అది ఫలితం ఇచ్చేవరకు అండగా నిలవడం, ఉత్పత్తికి సైతం తాము భరోసాగా ఉండటం సంతోషకరం' అని పేర్కొన్నారు. ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్ట్ వాణికోలా మాట్లాడుతూ, దేశంలో ఆవిష్కరణల రంగంలో మహిళల పాత్ర కేవలం 4% మాత్రమే ఉందని, ఇది పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ రంగంలో కీలక ముందడుగు వేసిందని చెప్పారు. గతంలో ఇలాంటి ప్రోత్సాహం ఉం డి ఉంటే తాను సిలికాన్‌వ్యాలీ సహాయం కోసం ఎదురుచూసే అవసరం ఏర్పడేది కాదని ఆమె అన్నారు. ఎదుగుతున్న మహిళలకు ఇలాంటి ప్రయత్నం ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. టీహబ్, వీహబ్‌తో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. ప్రముఖ ఫ్యాషన్ స్పెషలిస్ట్ శశి వంగపల్లి, శ్రీయల్ టెక్ ప్రతినిధులు సాహిత్యారాయ్, ఆమె సోదరి ఈ సందర్భంగా తమ విజయగాథను పంచుకున్నారు.




వీహబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రదర్శించిన డ్రోన్ కెమెరా 'ఎయిర్‌సెల్ఫీ. దీనిని డీఎస్ఎన్ ఫిలిమ్స్ రూపొందించింది.

### వీహబ్‌తో నీతిఆయోగ్ ఒప్పందం

కాగా వీహబ్ ఆరంభం రోజే తన ప్రత్యేకతను చాటుకున్నది. మహిళల సాధికారత కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నారీశక్తి తమ మొట్టమొదటి ఒప్పందం తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్నదని రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి హబ్‌ను మహిళల కోసం ఏర్పాటుచేసిన తెలంగాణతో తాము జట్టుకట్టడం సంతోషంగా ఉందని, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ తెలిపినట్టు జయేశ్ రంజన్ వివరించారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ యూనివర్సిటీ ప్రాంగణంలో గల టీ శాట్ కార్యాలయంలో వీహబ్ కొలువుదీరిందని ఆయన తెలిపారు. టీహబ్2 ఏర్పడిన అనంతరం అక్కడ శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. వీహబ్‌లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. www.wehub.telangana.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తులు సమర్పించవచ్చని వివరించారు.

# ఎంబీసీలకు సర్కారు బాసట

మొదటిపేజీ తరువాయి...

గాను రూ.60 వేలు (60శాతం) సబ్సిడీ ఇచ్చేవారు. ఆ సబ్సిడీ సరిపోదని, మరింత సబ్సిడీ అందించాల్సిన అవసరం ఉందని, అదేవిధంగా రూ.లక్ష నుంచి రూ.12 లక్షల వరకు యూనిట్లు నెలకొల్పేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని చెప్పారు. రూ.లక్ష వరకు తీసుకునే ఆర్థిక సహకారంలో 80 శాతం (రూ.80 వేలు) సబ్సిడీ, రూ.2 లక్షలు విలువైన యూనిట్ నెలకొల్పే వారికి 70 శాతం (రూ.1.40 లక్షలు) సబ్సిడీ, రూ.2 లక్షల నుంచి రూ.12 లక్షల విలువైన యూనిట్లు నెలకొల్పేవారికి 60 శాతం (గరిష్ఠంగా రూ.5 లక్షలు) సబ్సిడీ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

# నాలుగో రోజూ ఆగని నిరసనలు

మొదటిపేజీ తరువాయి...

ఒకటే రోజులో పాసవుతుందని, కానీ కేంద్రం ఆ పని చేయకుండా కాలం వెళ్ళదీస్తున్నదని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్లు మతపరమైనవి కావని, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. రాజ్యాంగం, చట్టం గురించి తమకు బీజేపీ నేతలు సూక్తులు చెప్తున్నారని వినోద్ మండిపడ్డారు. రిజర్వేషన్లు పెంచడానికి అనుగుణంగా ఈ అంశాన్ని తొమ్మి దో షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. దీని ద్వారా కోర్టుల నుంచి ఎలాంటి సమస్య ఉండదన్నారు. రాష్ట్రం ఏర్పడితే ఎస్సీ, ఎస్టీ , మైనార్టీల రిజర్వేషన్లు పెరుగుతాయని టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటినుంచి సీఎం కేసీఆర్ అనేక బహిరంగసభల్లో చెప్పారని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం కేసీఆర్ రాష్ట్ర శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి, అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించారని.. అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని గవర్నర్ ఆమోదంతో రాష్ట్రపతికి పంపి పది నెలలైనా కేంద్రం స్పందించడం లేదని చెప్పారు. జనాభా పెరిగితే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. రిజర్వేషన్ పెంచాలంటే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంఖ్య పెరిగినట్లు రుజువు చేయాలని సుప్రీంకోర్టు చెప్పిందని, ఇందుకు అనుగుణంగానే సుధీర్, చెల్లప్ప కమిటీలను సీఎం కేసీఆర్ నియమించారని చెప్పారు. ఈ రెండు కమిషన్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు పెరిగిన శాతాన్ని నమోదు చేశాయని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో ఉందని.. అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్రం నుంచి సరియైన స్పందన లేదని ఎంపీ సీతారాంనాయక్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలను అణిచివేసే వైఖరిని బీజేపీ అవలంబిస్తున్నదని ఆయన ఆరోపించారు.

**మహిళా బిల్లును ఆమోదించాలి: డీఎస్**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లుకు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డీ శ్రీనివాస్ కోరారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభలో మాట్లాడిన ఆయన.. ఎంపీలకు , మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రతి మగవారి విజయం వెనుక మహిళా ఉంటుందన్నారు.

# రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా

మొదటిపేజీ తరువాయి...

ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని గతనెల 25వ తేదీన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో సీఎం కేసీఆర్ ప్రకటించారు.

**ఈ నెల 12న బాధ్యతల స్వీకరణ**

కాగా, ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4.30 గంటల తరువాత గుత్తా సుఖేందర్ రాష్ట్ర రైతు సమన్వయసమితి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. అధికారికంగా ఉత్తర్వులు అందుకున్న గుత్తాసుఖేందర్‌రెడ్డి నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దేశంలో మరో ఆర్థిక విప్లవానికి మార్గదర్శకుడని అన్నారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా తనకు అప్పగించిన గురుతర బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ సూచనల మేరకు రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తూ, రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపడుతానన్నారు.


# హైదరాబాద్‌లో మరో ఫోరెన్సిక్ ల్యాబ్

- మహిళా సంబంధ నేరాల కోసం ప్రత్యేకం
- ప్రణాళికలు రూపొందిస్తున్న కేంద్ర మహిళాశిశు సంక్షేమశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో మరో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)ని ఏర్పాటు చేయనున్నారు. ఈ ల్యాబ్‌ను ప్రత్యేకంగా మహిళా సంబంధిత నేరాల పరిశోధనల కోసం వినియోగించనున్నారు. అంతేకాకుండా రైల్వేస్టేషన్‌లు వంటి ప్రాంతాల్లో మహిళల కోసం ప్రత్యేక టాయిలెట్స్ నిర్మించనున్నారు. మహిళా సంబంధ నేరాలపై కేంద్ర మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ముంబైలో నిర్వహించిన సమావేశంలో పలు రాష్ట్రాల పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పలు రాష్ట్రాల్లో సరిపడా ఫోరెన్సిక్ ల్యాబ్‌లు లేకపోవడంతో లైంగిక దాడులు వంటి కేసుల్లో పరీక్షల నివేదిక అందడంలో జాప్యం జరుగుతున్నదని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మరిన్ని ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నోలో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఎనిమిది రాష్ట్రాల్లో ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.282 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర మహిళాశిశు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ చేతన్ బీ సంఘీ తెలిపారు. అంతేకాకుండా రైల్వేస్టేషన్ల వంటి రద్దీ ప్రాంతాల్లో మహిళల కోసం టాయిలెట్లు నిర్మించనున్నట్టు చెప్పారు. ల్యాబ్‌ల ఏర్పాటు, టాయిలెట్ల నిర్మాణం, సిబ్బంది నియామకాల్లో రాష్ట్రాల సహాయం తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్ ఉన్నది. ఇటీవల ఈ ల్యాబ్‌పై పనిఒత్తిడి బాగా పెరిగింది. దీంతో మహిళా సంబధ నేరాల్లో పరీక్షల నిమిత్తం వచ్చిన నమూనాలను పరీక్షించి నివేదిక అందించడంలో ఆలస్యం అవుతున్నది. దీని ప్రభావం కేసుల దర్యాప్తుపై పడుతున్నదని అధికారులు చెప్తున్నారు.

# తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు బాగు.. మిషన్ భగీరథ, కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టులు
- కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు ప్రశంసలు
- రాష్ట్ర ప్రభుత్వం, మీడియా అకాడమీని అభినందిస్తూ లేఖ



సిద్ధరాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు అభినందించారు. కొత్త రాష్ట్రం అయినప్పటికీ.. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్ల నిధిని ఏర్పాటుచేసి, భారీఎత్తున సంక్షేమ పథకాలు చేపడుతున్నదని, దీనికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరువ తీసుకున్నారని ప్రశంసించారు. గతనెల 27, 28 తేదీల్లో కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు నేతృత్వంలోని 25 మంది సీనియర్ జర్నలిస్టుల బృందం రాష్ట్ర పర్యటన చేపట్టింది. తిరిగి వెళ్లాక.. సిద్ధరాజు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని, మీడియా అకాడమీని అభినందిస్తూ గురువారం లేఖ రాశారు. జర్నలిస్టులను ఆదుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించిన మీడియా అకాడమీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టును ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం దొరికిందని, అవి అద్భుతమైన పథకాలని సిద్ధరాజు ప్రశంసలు కురిపించారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తాయని పేర్కొన్నారు.

# టీఎస్ సెట్-2018 నోటిఫికేషన్ విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత సాధనకు నిర్వహించే తెలంగాణ స్టేట్ – స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్) – 2018 నోటిఫికేషన్ విడుదలైందని టీఎస్‌సెట్ సభ్య కార్యదర్శి ప్రొ యాదగిరి స్వామి గురువారం తెలిపారు. ఈ నెల 14 నుంచి వచ్చేనెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చని, రూ.1500 అపరాధ రుసుముతో వచ్చేనెల 24 వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో మే 4 వరకు, రూ.3 వేల అపరాధ రుసుముతో మే 15 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. జులై 15న సెట్ పరీక్షను నిర్వహిస్తామ న్నారు. ఇతర వివరాలను 12 నుంచి www .telanganaset.org, www. osmania. ac.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయన్నారు.



## 11న టీఆర్ఎస్ఎల్పీ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహంపై ఈనెల 11న తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ శాసనమండలి సమావేశం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంతా మధ్యాహ్నం ఒంటి గంటకు తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. భోజనాలు చేసిన తరువాత మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది.

## బీసీ ప్రతిపాదనలపై పార్లమెంట్‌లో చర్చ

- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అసెంబ్లీ ఆమోదంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కేంద్రానికి పంపిన బీసీ కమిషన్ ప్రతిపాదనలపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్నదని బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కమిషన్ ఇచ్చిన ప్రతిపాదనలు తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పంపిందని, ఈ అంశం ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తున్నదని అన్నారు. 2019 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇదొక ప్రధానాంశంగా ముందుకు రానున్నదని, కర్ణాటకలో రిజర్వేషన్లు పెంచే ప్రక్రియకు సంబంధించి గణాంకాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఎలాంటి సమస్యనైనా విశ్లేషించి, దాన్ని ఒక నినాదంగా ముందుకు తీసుకువెళ్లి పరిష్కారం సాధించడం కేసీఆర్ విజయ రహస్యమని రాములు పేర్కొన్నారు. తెలంగాణ సాధించినట్లే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్లను కూడా సాధిస్తామని కేసీఆర్ గతంలోనే వెల్లడించారని గుర్తుచేశారు. కేంద్రం కానీ, కోర్టులు కానీ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చెప్పడం కుదరదని, సరైన జనాభా దామాషా చూపగలిగితే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని 1993లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలు, తీర్మానాల మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచడాన్ని యథాతథంగా ఆమోదించడం కేంద్రం కనీస కర్తవ్యమన్నారు.

## 8 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- సీఎంవోకు సందీప్‌కుమార్ సుల్తానియా, మానిక్ రాజు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసి పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇటీవల ఐఏఎస్‌లుగా పదోన్నతులు పొందిన అధికారులను పలు జిల్లాలకు కలెక్టర్లుగా నియమించింది. కాగా 1998 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్‌సుల్తానియా, 2005 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ మానిక్ రాజ్‌లను సీఎంవోకు తీసుకున్నారు. సీఎంవో కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చిన సందీప్‌కుమార్ సుల్తానియాకు పశుసంవర్ధకశాఖ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ మానిక్‌రాజ్‌ను సీఎంవో అదనపు కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

**బదిలీ అయిన వారి జాబితా..**

| ఐఏఎస్ పేరు | ప్రస్తుతం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| సందీప్‌కుమార్ సుల్తానియా | ఏహెచ్‌డీడీ | సీఎంవో |
| కే మానిక్‌రాజ్ | సంగారెడ్డి కలెక్టర్ | సీఎంవో |
| కే ధర్మారెడ్డి | మేడ్చల్ జేసీ | మెదక్ కలెక్టర్ |
| టీ వినయ్‌కుమార్‌రెడ్డి | ఖమ్మం జేసీ | జనగామ కలెక్టర్ |
| సీహెచ్ శివలింగయ్య | నిర్మల్ జేసీ | మహబూబాబాద్ కలెక్టర్ |
| వీ వెంకటేశ్వర్లు | సంగారెడ్డి జేసీ | సంగారెడ్డి కలెక్టర్ |
| డీ అమయ్‌కుమార్ | జయశంకర్ భూపాలపల్లి జేసీ | జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ |
| ఎం హరిత | వరంగల్ రూరల్ జేసీ | వరంగల్ రూరల్ కలెక్టర్ |

# 15న రాష్ట్ర బడ్జెట్

- తుదికూర్పుపై ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ కసరత్తు
- కేటాయింపుల్లో వ్యవసాయరంగానికి పెద్దపీట
- సాగునీటి ప్రాజెక్టులు, బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం
- సమావేశాల నిర్వహణపై మండలి చైర్మన్, స్పీకర్ ఉన్నతస్థాయి సమీక్ష



బడ్జెట్ సమావేశాల సందర్భంగా సమీక్షిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

2018–19 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ ఈ నెల 15న ప్రజల ముందుకు రానున్నది. బడ్జెట్ తుది కూర్పుపై ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఆర్థిక శాఖ అధికారులతో తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఆదాయంలో గణనీయంగా వృద్ధిని సాధిస్తున్న నేపథ్యంలో వచ్చే వార్షిక బడ్జెట్ మరో 15% అదనంగా ఉండే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయనున్నారు. రైతులకు పెట్టుబడి కింద ఎకరాకు 8వేలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో వ్యవసాయానికి భారీగా నిధులు కేటాయించనున్నట్టు తెలిసింది. జూన్‌లోనే రైతులకు సాగునీరందించే కాళేశ్వరంతోపాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించనున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి భారీగా నిధుల కేటాయింపు ఉండే అవకాశం ఉంది. వివిధ సంక్షేమ పింఛన్లకు నిధులు పెద్దఎత్తున కేటాయిస్తారు. అన్ని రంగాల్లో బీసీల అభివృద్ధి కి వృత్తుల వారీ నిధులు కేటాయించే అవకాశం ఉంది.

**12 నుంచి సమావేశాలు**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12న ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 14వరకు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ సభ్యులు ప్రసంగిస్తారు. 15న అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ 2018–19 సంవత్సరానికి వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతారు.

**సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి**

ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి అధికారులకు సూచించారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై గురువారం చైర్మన్, స్పీకర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. స్పీకర్ చాంబర్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్‌సిన్హా, తదితర అధికారులతో స్వామిగౌడ్, మధుసూదనాచారి సమావేశమయ్యారు. తర్వాత అసెంబ్లీ కమిటీ హాల్–1లో డీజీపీ మహేందర్‌రెడ్డి, పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్‌చంద్, రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్, సెంట్రల్ జోన్ డీసీపీ జోయెల్ డేవిస్ తదితరులతో సమావేశమయ్యారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రజలు జరుపుకునే పండుగలు, ఉత్సవాలపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. స్పీకర్ మధుసుదనాచారి మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఈసారీ సజావుగా సభ కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. సభ్యులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు అడిగిన ప్రశ్నలకు నిర్ణీత కాలవ్యవధిలో జవాబు లు పంపేలా చూడాలని సీఎస్‌ను ఆదేశించారు. బడ్జెట్ సమావేశాలకు 2000 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. సజావుగా సభ నిర్వహణకు తీసుకున్న చ ర్యలను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు తెలిపారు. అసెంబ్లీ డిప్యూటీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, ఉపేందర్‌రెడ్డి, ప్రసన్నకుమారి సమావేశంలో పాల్గొన్నారు.

## 13వ షెడ్యూల్‌లోని హామీలు అమలుచేయండి

- నివేదికలను సిద్ధంచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో సమావేశం నిర్వహించనున్న కేంద్రం.. పాల్గొననున్న తెలుగు రాష్ట్రాల సీఎస్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం –2014లోని 13వ షెడ్యూల్‌లో చేర్చిన హామీలను అమలుచేయాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. 13వ షెడ్యూల్‌లోని హామీలపై త్వరలో కేంద్రహోంశాఖ నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు పాల్గొననున్నారు. దీంతో 13వ షెడ్యూల్‌లోని హామీలపై రాష్ట్ర ప్రభుత్వం నివేదికలు సిద్ధం చేస్తున్నది. షెడ్యూల్ హామీలపై విద్య, గిరిజన, రోడ్లు, భవనాలు తదితర శాఖలు నివేదికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినట్టు సమాచారం. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన హామీలును పునర్వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్ –13లో చేర్చింది. తెలంగాణలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విద్యాసంస్థను, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటి విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలో అభివృద్ధి చేసే రహదారులకు నిధులు ఇస్తామని ఇలా ఎన్నో హామీలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం తెలంగాణలో ఏర్పరిచే పరిశ్రమలకు ప్రోత్సాహకాలూ ఇవ్వాలి. కొత్త రాష్ట్రం ఏర్పడగానే గోదావరి పుష్కరాలను నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. గోదావరి పుష్కరాలకు కేంద్రం సాయం చేస్తామని హామీ ఇచ్చినా అమలుచేయలేదు. సమ్మక్క– సారలక్క గిరిజన జాతరకు నిధులు ఇస్తామని, జాతీయ జాతరగా గుర్తిస్తామని ఇచ్చిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేదు.



**NOTIFICATION**
**TS-SET- 2018**
**Osmania University, Hyderabad-500007**

Applications are invited by the Osmania University from eligible candidates to appear for the Telangana State- State Eligibility Test (TS-SET) - 2018 to be conducted on **15-07-2018.** For further details see the information provided in **www.telanganaset.org, www.osmania.ac.in** from **12-03-2018.**

**IMPORTANT DATES:**

| | |
|---|---|
| Commencement of Submission of Online Applications | 14-03-2018 |
| Last date for Submission of Online Applications without Late Fee | 14-04-2018 |
| With late fee of Rs. 1500/- + Registration Fee | 24-04-2018 |
| With late fee of Rs. 2000/- + Registration Fee | 04-05-2018 |
| With late fee of Rs. 3000/- + Registration Fee (For Hyderabad centre only) | 15-05-2018 |
| Date of Examination | 15-07-2018 |

Date: 08-03-2018 MEMBER SECRETARY, TS-SET



## ఆరు జిల్లాల్లో 155 మహిళా భవనాలు మంజూరు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో మహిళా భవనాలను పంచాయతిరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంజూరుచేసింది. కరీంనగర్, వరంగల్ రూరల్, జగిత్యాల, పెద్దపల్లి, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 155 మహిళా భవనాలను మంజూరు చేస్తూ గురువారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.15.50 కోట్ల అంచనా వ్యయంతో 155 మహిళా భవనాలను నిర్మించనున్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించారు.

## షాదీ ముబారక్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్‌కు నిధులు

- రూ.30 కోట్లకు పరిపాలనా అనుమతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పేద మైనారిటీ యువతుల వివాహాలకు ప్రభుత్వం అందించే నగదు ప్రోత్సాహక 'షాదీముబారక్' పథకం కోసం రూ.20 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎం దానకిశోర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమశాఖ జీవో నంబర్ 63ని విడుదల చేసింది. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే పేద మైనారిటీ యువతకు సంబంధించిన 'సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం' కోసం రూ.10 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులిస్తూ దానకిశోర్ జీవో నంబర్ 64ను జారీచేశారు.

## పథకాల అమలుకు ఉమ్మడి సమీక్షలు

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచన
- త్వరలో వెబ్‌సైట్ రూపకల్పన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమర్థంగా ప్రభుత్వ పథకాల అమలుకు కొత్త పద్ధతికి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి శ్రీకారం చుట్టారు. శాఖల మధ్య సమన్వయం కోసం ఉమ్మడి సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశాలు జిల్లాస్థాయిలోనూ నిర్వహించాలన్నారు. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు సాగునీటి ప్రాజెక్టుల సమావేశాలకు హాజరైతే ప్రాజెక్టు అవసరం వారికి అర్థం అవుతుందని, కావాల్సిన అనుమతులు, భూసేకరణ నోటిఫికేషన్ పనులువేగంగా పూర్తిచేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం వేగంగా సాగాలంటే రెవెన్యూ, గృహ నిర్మాణ, పురపాలక, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ శాఖలు సమన్వయంతో ముందుకుసాగాలన్నారు.

**ఒకేచోట సమస్త సమాచారం:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు సమస్త సమాచారాన్ని అంతా ఒకేచోట ఉండేలా వెబ్‌సైట్ రూపొందించాలని సీఎస్ భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు జీఏడీ ఆధ్వర్యంలో గుడ్ గవర్నెన్స్ అధికారులు సమాచారాన్ని ఒకచోట నిక్షిప్తం చేస్తున్నట్లు సమాచారం. అధికారులు క్షేత్రస్థాయిలో పనుల సమాచారాన్ని తెలుసుకొని, విశ్లేషించి సమర్థంగా పథకాల అమలుచేసేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.



ఈ ఆధునిక కాలంలో కూడా లింగవివక్ష తగదు. ప్రతి ఒక్కరికీ మంచి విద్య అందించాలి. బాలురకు ఎలాంటి విద్య అందిస్తున్నామో బాలికలకు కూడా అదే విద్య అందించాలి. ఆడబిడ్డను ఏ తల్లిదండ్రులూ భారంగా భావించరాదు. నిజానికి వారే కుటుంబానికి గౌరవం.

**నరేంద్రమోదీ, ప్రధాని**



ఇన్నాళ్లూ పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న మాలాంటి వాళ్లమే విద్యార్థులుగా మీ దగ్గరికి వచ్చి ఓటు వేయాలని కోరుతున్నాం. ఇప్పుడు మీరు ఓటు మాత్రమే ఇస్తే సరిపోదు, మీ ఆలోచనలూ మాకు కావాలి. మీతోనే తమిళనాడు మారుతుంది. కొత్త శకానికి నాంది అవుతుంది.

**కమల్‌హాసన్, మక్కల్ నీది మయ్యమ్ అధినేత**


### చరిత్రలో నేడు



**1497**

అంతరిక్ష పరిశోధనలకు అంకురార్పణ చేసిన నికోలస్ కోపర్నికస్.

**1776**



ప్రఖ్యాత 'ది వెల్త్ ఆఫ్ నేషన్స్' గ్రంథాన్ని రచించి ప్రచురించిన ఆడమ్ స్మిత్.



**1926**

సీటెల్ మేయర్‌గా ఎన్నికైన మొదటి మహిళ బెర్తాలా లాండెస్.

దేశంలో విగ్రహాల విధ్వంసం కొనసాగుతున్నది. త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం పతనమై, బీజేపీ అధికారంలోకి రావటంతో లెనిన్ విగ్రహాల కూల్చివేతతో మొదలై పెరియార్, అంబేద్కర్ విగ్రహాల విధ్వంసం దాకా వచ్చింది. కోల్‌కతాలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ విగ్రహం కూడా ధ్వంసమైంది. వర్తమాన రాజకీయ అవసరాల కోసం గతంలో నెలకొల్పిన విగ్రహాలపై ప్రతీకారం చూపటం అర్థరహితం. దేశంలో ఉన్న పేదరికం, నిరుద్యోగం, విద్య, వైద్యం లాంటి మౌలిక విషయాలను వదిలి విగ్రహాల చుట్టూ రాజకీయాలు తిరుగటం పెద్ద తిరోగమనం.

**ది హిందూ**

శ్రీలంకలో 2011 తర్వాత అత్యవసర పరిస్థితి విధించే స్థితి రావటం ఇదే తొలిసారి. కాండీ ప్రాంతంలో జరిగిన ఘటనతో దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగాయి. శ్రీలంకలో జనాభా పరంగా మూడో అతిపెద్ద ప్రజా సమూహం ముస్లింలు. ఎల్‌టీటీఈ పతనం తర్వాత సింహాళీయులకు ముస్లింలే శత్రువులుగా కనపించటం శోచనీయం. గతంలో ఎల్‌టీటీఈ ప్రాబల్యం ఉన్నకాలంలో శ్రీలంక ముస్లింలు తీవ్రంగా నష్టపోయారు. మరోసారి ముస్లింలు లక్ష్యంగా దాడులు జరుగకుండా చూడాల్సిన బాధ్యత శ్రీలంక ప్రభుత్వానిది.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# వాణిజ్య యుద్ధం తప్పదా!

తమ దేశానికి దిగుమతి అయ్యే ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై పది శాతం సుంకం విధించడానికి అమెరికా అధ్యక్షుడు సిద్ధపడుతుండటంతో, ఈ చర్య క్రమంగా వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందనే అనుమానాలు కలుగుతున్నాయి. ట్రంప్ నిర్ణయం విపరీత పరిణామాలకు దారితీస్తుందని అమెరికాలోని చాలామంది చట్టసభ సభ్యులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ఆర్థిక సలహాదారు ఒకరు ఈ విషయమై విభేదిస్తూ రాజీనామా కూడా చేశారు. అయినా ట్రంప్ ఇటీవలికాలంలో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమెరికా ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు విధిస్తే, తాము చూస్తూ ఊరుకోబోమని, తాము కూడా కొన్ని అమెరికా వస్తువులపై భారం వేస్తామని యూరోపియన్ యూనియన్, చైనా హెచ్చరించాయి. భారత్‌తో పాటు మెక్సికో, జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణకొరియా, కెనడా తదితర దేశాలు ట్రంప్ ప్రతిపాదనల పట్ల ఆందోళన వ్యక్తంచేశాయి. అమెరికా చర్యలకు ప్రతిచర్యగా తాము కూడా సుంకాలు విధిస్తామని యూరోపియన్ యూనియన్ వాణిజ్య కమిషనర్ సిసీలియా మామ్‌స్ట్రామ్ హెచ్చరించారు. అమెరికా టీషర్టులు, పడక బట్టలు, మోటారు సైకిళ్ళు, పొగాకు మొదలైన వస్తువుల జాబితాను రూపొందిస్తున్నట్టు ఈయూ అధికారులు వెల్లడించారు. 1930 దశకంలో ఆర్థిక మహా మాంద్యం నేపథ్యంలో వివిధ దేశాల మధ్య వాణిజ్యయుద్ధం సాగింది. ఆ తరువాత మళ్ళా అంతటి వాణిజ్య యుద్ధానికి ట్రంప్ చర్య దారితీయవచ్చుననే ఆందోళన వ్యక్తమవుతున్నది. మరీ అంతగా భయపడవలసిన అవసరం లేదని చెప్పేవారూ ఉన్నప్పటికీ, ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో ఒకసారి ఇటువంటి రక్షిత చర్యలు మొదలైన తరువాత పరిణామాలు ఎట్లా ఉండేదీ ఊహించడం కష్టం. చైనా కూడా ఇటువంటి జాబితానే తయారు చేస్తున్నదని చెబుతున్నారు. ట్రంప్ మాత్రం వాణిజ్య యుద్ధమంటూ మొదలైతే అది ఎదుటి దేశాలకే నష్టం తప్ప తమకు కాదని అంటున్నారు.

**ప్రపంచీకరణ విధానాల ద్వారా మూడవ ప్రపంచ దేశాల తలుపులు తెరిపించిన స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంపొందించిన పెద్ద దేశాలు తాము, మాత్రం వాణిజ్య రక్షిత విధానాలను అవలంబిస్తున్నాయి. అయితే చైనా, భారత్ తదితర వర్ధమాన దేశాలు డబ్ల్యూటీవో వేదికపై కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అమెరికా, ఈయూ వీలైనప్పుడల్లా తమ పెత్తనం చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. చైనా, భారత్ తదితర దేశాలు ఈ కుట్రలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా వ్యవహరించాలె.**

ట్రంప్ రెండు వస్తువులపై సుంకాలు విధించడం అమెరికా వాణిజ్య విధానంలో చరిత్రాత్మక మార్పుగా చెబుతున్నారు. ట్రంప్ దేశీ కంపెనీలను నష్టాలబారిన పడకుండా కాపాడుకోవడానికి ఉక్కు, అల్యూమినియం దిగుమతులను అడ్డుకుంటున్న మాట నిజమే. అయితే ఈ సుంకాల విధింపు ట్రంప్ మొత్తం వ్యూహంలో ఒక భాగమే. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో)ను పనికిరాకుండా చేయడం, తద్వారా ఇప్పుడున్న బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను కుప్పకూల్చడం ట్రంప్ లక్ష్యం. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన నాటి నుంచి డబ్ల్యుటీవోను నిరర్థకం చేసే దిశగా పావులు కదుపుతున్నారు. డబ్ల్యుటీవో ఫిర్యాదుల విచారణ కమిటీకి సభ్యులను నియమించకుండా అడ్డుకున్నారు. దీంతో ఫిర్యాదుల విచారణ సరిగ్గా సాగడం లేదు. ఇదేవిధంగా నియామకాలు నిలిచిపోతే రెండేండ్లలో డబ్ల్యుటీవో అచేతనంగా మారుతుంది. అంతర్జాతీయస్థాయిలో తీర్పరి పాత్ర వహించే సంస్థ లేకపోతే, బలమైన దేశాలు బలహీనదేశాలను ఇబ్బందులకు గురిచేస్తాయి. భారత్ తదితర దేశాలు ప్రపంచీకరణకు అంగీకరించే దశలో అనేక చర్చలు జరిగాయి. ఈ క్రమంలో కొత్త వాణిజ్య నియమాలు గల ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడ్డది. భారత్‌ను అమెరికా వంటి దేశాలు ఇబ్బంది పెట్టినప్పుడల్లా భారత్ డబ్ల్యుటీవో వేదికగా ఫిర్యాదు చేసి న్యాయం పొందింది. భారత్ నుంచి ఎగుమతి అయ్యే సరుకులపై కూడా అమెరికా సుంకాలు విధించడానికి సమాయత్తమవుతున్నది. అయితే డబ్ల్యుటీవో బలహీనపడిన క్రమంలో భారత్ ఆ వేదిక ద్వారా న్యాయం పొందే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఎగుమతులపైనా, రక్షణరంగ పరికరాలపైన భారత్ ఇటీవలి కాలంలో ఆధారపడటం పెరిగింది. అందువల్ల ఈయూ, చైనా మాదిరిగా అమెరికాను బలంగా ధిక్కరించే పరిస్థితిలో భారత్ లేదని వాణిజ్యరంగ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్‌లో రైతులకు మద్దతు ధర ఇవ్వడం ద్వారా ఆహారం సేకరించి, భారీ ఎత్తున నిలువ చేసుకునే విధానం ఉన్నది. ఈ ఆహార నిలువలు గడ్డు పరిస్థితుల్లో ఉపయోగపడుతాయి. అయితే రైతులకు మద్దతు ధర ఇచ్చే విధానాన్ని అమెరికా తప్పుపడుతున్నది. డబ్ల్యుటీవో వేదికపై భారత్‌పై అమెరికా దాడి చేస్తుంటే, చైనా మద్దతు ఇస్తున్నది. దీంతో ప్రధాని మోదీ అనుసరిస్తున్న అమెరికా అనుకూల విధానాలు ప్రశ్నార్థకమవుతున్నాయి.

ప్రపంచీకరణ విధానాల ద్వారా మూడవ ప్రపంచ దేశాల తలుపులు తెరిపించిన స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంపొందించిన పెద్ద దేశాలు తాము, మాత్రం వాణిజ్య రక్షిత విధానాలను అవలంబిస్తున్నాయి. అయితే చైనా, భారత్ తదితర వర్ధమాన దేశాలు డబ్ల్యుటీవో వేదికపై కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అమెరికా, ఈయూ వీలైనప్పుడల్లా తమ పెత్తనం చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. చైనా, భారత్ తదితర దేశాలు ఈ కుట్రలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా వ్యవహరించాలె. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ పేర మూడు దశాబ్దాలకు పైగా అమలవుతున్న విధానాలు ప్రపంచ దేశాలలో తీవ్ర సంక్షోభాన్ని తెచ్చిపెడుతున్నాయి. దీంతో బహుళ పక్ష వాణిజ్యాన్ని న్యాయబద్ధంగా మార్చడానికి వర్ధమాన దేశాలు కలిసికట్టుగా వ్యవహరించాలె. ప్రైవేటీకరణ విధానాలను, పొదుపు చర్యల పేర సంక్షేమ పథకాలపై కోతలను సమీక్షించుకోవడం కూడా మంచిది. ట్రంప్ విధానాలు ఆర్థిక విధానాలపై పునరాలోచనకు పురికొల్పితే సంక్షోభాలు సమసిపోతాయి.

సామాజికం



**బి.ఎస్.రాములు**

# పార్లమెంటులో మన బీసీ ఎజెండా

**పార్లమెంటులో తెలంగాణ బీసీ కమిషన్ సిఫార్సుల చర్చ దేశాన్ని కుదిపివేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ శాసనసభ, శాసనపరిషత్ ఆమోదించి పంపిన బీసీ కమిషన్ సిఫార్సులు అనేక రాజ్యాంగపరమైన చర్చలను ముందుకు తీసుకురావడంలో భూమికగా పని చేస్తున్నవి. 2019 పార్లమెంటు, ఆయా రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో ఇదొక ప్రధానాంశంగా ముందుకు రానున్నది. కర్నాటకలో రిజర్వేషన్లు పెంచే ప్రక్రియకు సంబంధించిన దామాషా లెక్కలన్నీ సిద్ధంగా ఉన్నాయి. అదికూడా ముందుకు రానున్నది.**

ఏ రంగంలోనైనా సరే ఒక పరిష్కారాన్ని ఆలోచించడం, విశ్లేషణ చేసి దాన్ని ఒక నినాదంగా ముందుకుతెచ్చి, ప్రజలను ఉత్తేజితులను చేయడం కేసీఆర్ విజయరహస్యం. తెలంగాణ రాదన్నారు. రానివ్వమన్నారు. తెలంగాణను సాధించాం. అలాగే బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్నారు. పెంచనివ్వమన్నారు. అయినా 75–85 శాతం కూడా సాధిస్తాం. తెలంగాణ సాధించినట్టే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లు సాధిస్తామని కేసీఆర్ ఎప్పుడో స్పష్టంచేశారు.అందుకు ఇచ్చిన నినాదం ఫెడరల్ స్ఫూర్తికి సంబంధించినది కూడా. బీసీ రిజర్వేషన్ల కోసం 1953లో ఏర్పాటుచేసిన కాకా కాలేల్కర్ కమిషన్ చెప్పింది కూడా ఆయా రాష్ట్రాలే బీసీలు ఎవరో, తామే తేల్చుకోవాలని. అదే స్ఫూర్తిగా కేసీఆర్ 'మా రాష్ట్రంలో మా ప్రజలకు మేం రిజర్వేషన్లు పెంచుకుంటాం. కేంద్రం ఇచ్చే రిజర్వేషన్లు వారి ఇష్టం. అందుకు సహకరించండి. ఇది సాగకపోతే ఫెడరలిజం అర్థమేమిటి? కేంద్రం ఇష్టానుసారంగా సాగేదైతే ఫెడరలిజం స్ఫూర్తి ఎక్కడున్నది'? అని ప్రశ్నించారు.

ఎస్సీ రిజర్వేషన్లు, జాతీయస్థాయి కమిషన్ల ద్వారా నిర్ణయమవుతున్నాయి. భారత రాజ్యాంగంలో చేర్చాల్సిన ఓబీసీ రిజర్వేషన్లు భారత రాజ్యాంగ పరిషత్‌లో ఓబీసీ ప్రతినిధులు తక్కువ ఉండటం, వారి అవగాహన, అధ్యయనం, వాదనాపటిమ చాలకపోవడం, ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం వంటి అనేక కారణాల వల్ల రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వలె ఓబీసీ రిజర్వేషన్లు చేర్చబడలేదు. నెహ్రూ ప్రధానిగా 1953లో ఏర్పర్చిన కాకా కాలేల్కర్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఏమైనప్పటికీ ఓబీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టబడలేదు. జనతా పార్టీ ప్రభు త్వం మండల్ కమిషన్ ఏర్పాటుచేసి రిజర్వేషన్ అమలు కోసం అనేక ప్రతిపాదనలు చేసింది. కాకా కాలేల్కర్ కమిషన్ ఆయా రాష్ట్రాలే ఓబీసీలను, వాటి పట్టికలను తేల్చాలని చెప్పడం జరిగింది. ఎక్కడికక్కడ ప్రత్యేక పరిస్థితులు భిన్న జీవన ప్రమాణాలు, విద్య, సామాజిక రంగాల్లో వివక్ష, అసమానతలు, సామాజిక అణచివేత, కులవివక్ష వంటి అనేక రంగాల్లో ఉన్న అంశాలను, ఆయా రాష్ట్రాలే పరిశీలించి ఓబీసీల లిస్టులను రూపొందించి, పథకాలు అమలుచేయాలని, రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కాకా కాలేల్కర్ కమిషన్ స్పష్టం చేసింది. అంటే, ఇది ఆయా రాష్ట్రాల సమస్యగా వదిలివేసింది. దాంతో ఆయా రాష్ట్రాలు ఎక్కడికక్కడ కమిషన్లు వేసుకొని రిజర్వేషన్లను అమలుజరిపే కృషిచేశారు. ఆయా రాష్ట్రాలు జీవోల ద్వారా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాయి. వాటిని కోర్టులో ప్రశ్నించినప్పుడు బీసీ కమిషన్లు ఏర్పాటుచేసి రిజర్వేషన్లను క్రమబద్ధీకరించారు.

అలా ఏపీలో 1970లో అనంతరామన్ కమిషన్ సూచించిన రిజర్వేషన్లు నేటికీ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలో, తమిళనాడులో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కొనసాగిస్తున్నారు. ఇలా ఆయా రాష్ట్రాలు అమలు జరుపుకోవాలని చెప్పిన కాలేల్కర్ సూచన ప్రకారం రిజర్వేషన్లు పెంచుకోవడమనేది స్పష్టంగా ఆయా రాష్ట్రాలకు వదిలేయడం జరిగింది. అయినప్పుడు కేంద్రం గానీ, న్యాయవ్యవస్థ గానీ, రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చెప్పడం కుదరదు. అందుకే సరైన జనాభా దామాషా చూపగలిగితే రిజర్వేషన్లు పెంచుకోవచ్చని 1993లోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జనాభా లెక్కలు తీయాల్సింది కేంద్రం. కానీ ఆ లెక్కలు తీయడం లేదు. రాష్ట్రాలు ఎప్పటికప్పుడు తీసే లెక్కలకు సాధికారికత లేదని వాదిస్తున్నారు.

1950 జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. స్వేచ్ఛా, సమానత్వం, అందరికీ సమానావకాశాలు, ఆ అవకాశాలను వెనుకబడినవారు అందుకునే ప్రత్యేక ఏర్పాట్లు కల్పించే ఆర్టికల్ 15(4), 16 (4), 31 (బి) ఆర్టికల్స్ చేర్చబడినాయి. అవి పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. కేంద్రంలో 27శాతం రిజర్వేషన్లకు గాను 7–11 మాత్రమే అమలయ్యాయని కేంద్రం ప్రకటించింది. అనగా వారిని ఎదిగించే నైపుణ్యాలు పెంచే ఉన్నత విద్య అందుకునే ఏర్పాట్లను కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

**చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీంకోర్టు తీర్పును రాజ్యాంగ సవరణ ద్వారా ఎప్పుడో మార్చవచ్చు. ఈ విషయం ప్రతి రాజకీయనాయకుడికి, ప్రతి పార్టీకి, ప్రతి ప్రభుత్వానికి తెలుసు. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కల వలె మరికొన్ని కాలమ్స్ జోడించి ఎప్పటికప్పుడు పదేండ్లకోసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల లెక్కలు తీస్తే ఈ సమస్యే ఉత్పన్నం కాదు.**

నేటికీ కులవివక్ష, మత వివక్ష, ప్రాంతీయ వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. రాజ్యాంగం అమల్లోకి రావడం ద్వారా అందరికి సమాన హక్కులు వచ్చాయి. వాటిని సరిగ్గా వినియోగించుకునే అవకాశాలు కల్పించడం కోసం చేసిన కృషి పూర్తికాలేదు. ఎన్నో ఆర్టికల్స్‌లో ఫెడరలిజం స్ఫూర్తి కొనసాగుతున్నది. ఆ స్ఫూర్తిని కొనసాగించడానికి 31 (బి)లో భాగంగా 9వ షెడ్యూల్లో చేర్చుతూ వాటిని రాజ్యాంగంలోని ఇతర అధికరణల ద్వారా కొట్టివేయడానికి వీల్లేదని చేబుతూ రావడం జరిగింది. తెలంగాణ, ఆంధ్ర విషయంలో 371(డి) ఆర్టికల్ కూడా అలాంటిదే. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రిజర్వేషన్ల అంశం కూడా ఇలా రాష్ట్రాల బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్లు చేసే సిఫార్సులను రాష్ట్రం ఆమోదించి అమలు జరుపాలని నిర్ణయించుకున్నప్పుడు వాటిని 31 (బి), 9వ షెడ్యూల్ వంటి అనేక విధాలుగా న్యాయవ్యవస్థల జోక్యం నుంచి రక్షించవచ్చు. అలాగే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చెబుతూనే సుప్రీంకోర్టు సరైన డేటా ఉన్నప్పుడు అంతకుమించి పెంచుకోవచ్చని కూడా చెప్పడం జరిగింది. అయినా ఇటీవల తెలంగాణ బీసీ కమిషన్ ఇచ్చిన రిపోర్టును తెలంగాణ చట్టసభలు ఆమోదించి కేంద్రానికి పంపితే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్తూ కేంద్రం వెనక్కిపంపింది. ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం. స్పష్టమైన సుప్రీంకోర్టు తీర్పు ఉండగా, కేంద్రం అబద్ధం ఆడటం శోచనీయం. 31 (బి) ఆర్టికల్ ద్వారా 15(4), 16(4)ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చడం ద్వారా తెలంగాణ బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు, తీర్మానాల మేరకు బీసీ రిజర్వేషన్లు పెంచడాన్ని యథాతథంగా ఆమోదించడం కనీస కర్తవ్యం. అసలు ఇలాంటి విషయాల్లో కేంద్రం ఆమోదం అవసరం లేనివిధంగా రాజ్యాంగ సవరణ చేయాలి. ఏమంటే కేంద్రం చేసినా, రాష్ట్రం చేసినా, న్యాయస్థానాలు ఎలాగూ వాటిని పరిశీలించి తుదితీర్పు ఇస్తాయి. కాబట్టి కేంద్రం ప్రత్యేకంగా అధికారం చలాయించి నిరాకరించాల్సిన అవసరం లేదు.

మరో అంశం– చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించకూడదనే సుప్రీంకోర్టు తీర్పును రాజ్యాంగ సవరణ ద్వారా ఎప్పుడో మార్చవచ్చు. ఈ విషయం ప్రతి రాజకీయనాయకుడికి, ప్రతి పార్టీకి, ప్రతి ప్రభుత్వానికి తెలుసు. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కల వలె మరికొన్ని కాలమ్స్ జోడించి ఎప్పటికప్పుడు పదేండ్లకోసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల లెక్కలు తీస్తే ఈ సమస్యే ఉత్పన్నం కాదు. జనాభా ఎవరిది ఎంతో తేలుతుంది. ఎవరెంత వెనుకబడి ఉన్నారో, ముందుకు సాగారో, ఎలాంటి ప్రణాళికలు చేపట్టాలో కూడా తెలుస్తుంది.కేంద్రానికి కావలసింది చిత్తశుద్ధి. అది లేనందున జనాభా లెక్కలను తీసే అధికారం కూడా రాష్ట్రాలకే దాఖలు పరుస్తూ జనాభా లెక్కలకు సంబంధించిన 1948చట్టాన్ని, రాజ్యాంగాన్ని సవరించడం అవసరం. కేంద్రం కూడా రాష్ట్రాల యంత్రాంగం ద్వారానే జనాభాలెక్కలు,ఓటర్ల లిస్టులు తయారుచేస్తుంది. కేంద్రానికి ప్రత్యేకంగా యంత్రాంగమంటూ క్షేత్రస్థాయిలో ఉండే అవకాశమే లేదు. అందువల్ల రాష్ట్రాలకే జనాభా లెక్కలు తీసే అధికారం, జీఎస్టీని తొలిగించి రాష్ట్రాలకు పూర్తి అధికారాలు ఇవ్వ డం, ఇన్‌కమ్‌టాక్స్ విధించి పొందే అధికారం, రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం, ఆయా సామాజికవర్గాలకు ప్రత్యేక స్కీములు, బడ్జెట్లు అమలుజరిపే అధికారం రాష్ట్రాలకే ఉండటం అవసరం. ఇలాంటి విధానాల రూపకల్పనతోనే నవభారతం నిర్మాణం అవుతుంది.

**(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్)**

# గురి తప్పని విలుకాడు

తెలంగాణం



**సందీప్‌రెడ్డి కొత్తపల్లి**

మనం ఎక్కడినుంచి వచ్చాం? ఎక్కడికి వెళ్తున్నాం? ఏం చేస్తున్నాం? ఏం ప్రతిఫలం అందుకుంటున్నాం? అందుకు ప్రతిగా ఏంచేయాలి? సరిగ్గా గమనిస్తే పవిత్ర గ్రంథం భగవద్గీత సారాంశం ఇదే. ప్రజల నుంచి ఎన్నికైన ఏ నాయకుడైనా, ప్రజల కోసం పనిచేస్తున్నాననుకునే ఏ నేత అయినా ఈ ప్రశ్నలు వేసుకుంటే చాలు అతని నుంచి ప్రజలకు, ఆ సమాజానికి మేలు జరిగినట్లే. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్పష్టమైన లక్ష్యం ఉన్నది. ప్రజల కోసం పనిచేయాలన్న సంకల్పం ఉన్నది. అందుకే ఆయన ఏ అడుగు వేసినా దానికి తగ్గ ప్రణాళిక సిద్ధంగా ఉంటుంది.

2001లో తెలంగాణ ఉద్యమం మొదలుపెట్టినప్పుడు కేసీఆర్ ప్రయత్నం కేవలం రాజకీయ ప్రయోజనమే అని అంతా భావించారు. అయితే ప్రతి సందర్భంలోనూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనే తనకు ముఖ్యం అని, తెలంగాణ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టంగా చెబుతూ వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా తేలికైన విషయం కాదని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలోనే అన్ని పార్టీలను ఒప్పించి సాధించాల్సిన అంశమని తేల్చిచెప్పారు. ఢిల్లీలో, తెలంగాణలో ఉన్న పార్టీలను ఒప్పించడం, ప్రజలను చైతన్యం చేయడం వంటి ప్రయత్నాలతో ముందుకువెళ్లారు. అయితే తెలంగాణ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే అని భావించిన కొందరి మూలంగా ఉద్యమంలో ఎదురుదెబ్బలు తగిలాయి, తప్పితే కేసీఆర్ ఎక్కడా విఫలం కాలేదు. ఇదే సమయంలో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ తదితర పార్టీలకు తెలంగాణ ఒక రాజకీయ ప్రయోజనం మాత్రమే తప్పితే తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి వారికి కనీస ప్రణాళిక, ఆలోచన లేదు. అందుకే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు దూరం పెట్టి కేసీఆర్‌కు పట్టంకట్టారు.

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో కేసీఆర్ వందశాతం విజయవంతం అయ్యారు. తెలంగాణ వస్తే బతుకులు అంధకారం అవుతాయని ఆక్రోశించినవారు తలదించుకునేలా, తెలంగాణ ప్రజలు సగర్వంగా తలెత్తుకునేలా నాలుగేండ్ల కేసీఆర్ పాలన విజయవంతంగా సాగుతున్నది. తెలంగాణకు పురిట్లోనే సంధికొట్టాలన్న వారి కుట్రలను బద్ద లుచేస్తూ కేసీఆర్ ముందుకుసాగుతున్నారు. గత 60 ఏండ్ల సీమాంధ్ర పాలనలో నష్టపోయిన తెలంగాణ వనరులను మళ్లించే ప్రయత్నం మొదలుపెట్టారు. ముఖ్యంగా ప్రజల జీవన ప్రమాణాల్లో సమూల మార్పులు తీసుకువచ్చే కూడు, గూడు, నీళ్లు అనే అంశాల మీద ఆయన దృష్టిసారించారు. ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలన్న సంకల్పంతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించారు. రాష్ట్రంలోని 46,531 చెరువులను మిషన్ కాకతీయ ప్రాజెక్టులో భాగంగా ఐదేండ్లలో పునరుద్ధరించడం లక్ష్యంగా పెట్టుకొని గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా ధ్వంసమైన చిన్ననీటిపారుదల వ్యవస్థకు ఊపిరిపోసే దిశగా అడుగులువేశారు. ఇక తెలంగాణ దిశను సమూలంగా మార్చే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 35,200 కోట్లతో నిర్మిస్తున్నారు.

ఇవి కాకుండా కొత్తగా సీతారామసాగర్‌ను రికార్డు సమయంలో నిర్మించారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతలను, మిడ్‌మానేరులను శరవేగంగా నిర్మాణంచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 14 ఏండ్ల పాటు తెలంగాణ సమస్యలను సమగ్ర అధ్యయనం చేసిన అవగాహన మూలంగానే కేసీఆర్ విజయవంతం కాగలిగా రు. ఇక రైతులకు పంట పెట్టుబడి,5 లక్షల జీవిత బీమా ఇవ్వడం ఒక సం చలనం. కొత్తగా పురుడుపోసుకున్న ఒక రాష్ట్రం ఇన్ని విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. ఇతర రాష్ట్రాలే కాదు దేశమే తెలంగాణ పథకాల మీద దృష్టి సారిస్తున్నదంటే అర్థం చేసుకోవాలి. ఇన్ని లక్షల కోట్లతో ఇన్ని అభివృద్ధి పనులు ఈ నాలుగేండ్లలోనే ఎలా సాధ్యమ య్యా యి? ఎందుకు మొదలయ్యాయి? గత 60 ఏండ్ల సుదీర్ఘ పాలనలో ప్రజల కోసం ఏం చేశారు? అని ప్రశ్నిస్తే విపక్షాలకు చెప్పుకునేందుకు సమాధానం లేదు. అందుకే కేసీఆర్‌ను ప్రజలు విశ్వసిస్తున్నారు.

తాజాగా కేసీఆర్ దేశ రాజకీయాల మీద సరికొత్త ప్రశ్నలు సంధించడంతో సర్వత్రా కలకలం రేగుతున్నది. ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరుడు పక్క దేశాలను చూడటం, వినడం.. మనం దేశం ఎప్పుడు అలా అవుతుందని ఎదురుచూడటం తప్పితే ఈ 70 ఏండ్ల స్వతంత్ర భారతంలో దేశ స్థితిగతులను మార్చాలని చేసిన ప్రయత్నాలు కనిపించవు. దివంగత ప్రధాని పీవీ హయాంలో చేపట్టిన సంస్కరణలు మినహాయిస్తే ఈ దేశ ప్రగతికి తోడ్పడిన ప్రణాళికలేమీ లేవు. సామాన్యుడి మదిలో మెదులుతున్న ఈ ప్రశ్నలనే ఇప్పుడు కేసీఆర్ సంధించారు. కాంగ్రెస్ సుదీర్ఘ పాలనను చూసిన ప్రజలు మోదీ మీద విశ్వాసంతో గెలిపించారు. మోదీ కూడా ఊహించని విధంగా తొలిసారి బీజేపీ కూటమికి మెజార్టీ సీట్లు ఇచ్చి ఆదరించారు. ఈ దేశానికి ఇక కొత్త రోజులు ఖాయమని ప్రజలు భావించారు. కానీ ఈ నాలుగేండ్ల పాలనలో దేశంలో వచ్చిన సమూల మార్పులేమీ లేవు. నోట్లరద్దుతో రాత మారుతుందని చెప్పిన మోదీ అసలు బ్యాంకుల్లో నోట్లే దొరుకని పరిస్థితిని సృష్టించారు. బ్యాంకుల మీద నమ్మకం కోల్పోయిన ప్రజలు వాటిని ఇండ్లలో దాచుకోవడమో, భూములు కొనుక్కోవడమో చేస్తున్నారు తప్పితే బ్యాంకు వైపు వెళ్లే సాహసం చేయడంలేదు. ఇక అధికారంచేతిలో ఉంచుకునే ప్రయత్నాల్లో భాగంగా రాష్ట్రాలను కేంద్ర అజమాయిషీలోకి తీసుకొచ్చి రాష్ట్రాల వ్యవస్థను నిర్వీర్యం చేయడం మొదలుపెట్టింది మోదీ ప్రభుత్వం. తమ అనుకూల రాష్ట్రాలకు తప్పితే ఇతర రాష్ట్రాలకు రావాల్సిన వాటాకు మించి కనీస ప్రోత్సాహం అందించడం లేదు. ప్రజల జీవితాల్లో సమూల మార్పు తీసుకువస్తారనుకుంటే ఎన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నాం, ఎన్ని రాష్ట్రాలలో ఏ విధంగా అధికారాన్ని దక్కించుకోగలమనే లెక్కల్లోనే మోదీ ప్రభుత్వం మునిగిపోయింది.

తెలంగాణ ఆవిర్భవించిన వెంటనే ఏడు మండలాలను ఆంధ్రలో కలిపి తెలంగాణ పట్ల వివక్షను ప్రకటించిన కేంద్రంతో ఎలాంటి కయ్యాలకు దిగకుండా ప్రణాళికాబద్ధంగా కేసీఆర్ ముందుకెళ్లారు. నోట్లరద్దుతో దేశం రూపురేఖలు మారుతాయంటే మంచిదే కదా అని మద్దతు ఇచ్చారు. జీఎస్టీతో మార్పు వస్తుందంటే దానికీ మద్దతు ఇచ్చారు. కానీ కేంద్రం మాత్రం తెలంగాణను చిన్నచూపే చూసింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం దేశంలోని అన్ని పార్టీలను కలిశారు. అందరు నేతలను సంప్రదించారు. తెలంగాణనే కాదు దేశంలోని అన్నిరాష్ట్రాల స్థితిగతుల మీద ఆయనకు పట్టున్నది. తెలుగు మాత్రమే కాదు ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషలను ఆయన అనర్గళంగా మాట్లాడగలరు. సామాన్యుడికి సైతం అర్థమయ్యేరీతిలో చెప్పగల సామర్థ్యం గల అరుదైన వ్యక్తుల్లో కేసీఆర్ ఒకరు. అందుకే ఈ దేశంలో రావాల్సిన సమూల మార్పుల గురించి ఆలోచిస్తున్నారు. అడుగులు వేస్తున్నారు. మిగతా పార్టీలది అధికారం పొందాలన్న రాజకీయాలు తప్పితే ప్రజల కోసం చేసింది శూన్యం. 14 ఏండ్లు తెలంగాణ కోసం ఉద్యమించిన కేసీఆర్ ఇప్పుడు ఈ దేశంలో గుణాత్మకమార్పు రావాలన్న ఆకాంక్షతో ముందుకు నడుస్తున్నారు. ఇంకా ఎన్నేండ్లు అమెరికా, చైనా గురించి చెప్పుకోవాలి. ఆ దేశాలు మన దేశాభివృద్ధిని చూసి చెప్పుకునే రోజులు రావాలని ప్రకటించారు. కేసీఆర్ ఏదీ మొదలుపెట్టినా అది ప్రజలకోసం. ఆ ప్రయత్నంలో ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయరు. గమ్యం చేరడం ఆలస్యం కావచ్చేమో గానీ ఆయన గురి తప్పరనడానికి సాక్ష్యం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, నాలుగేండ్ల తెలంగాణ పాలన.

**14 ఏండ్లు తెలంగాణ కోసం ఉద్యమించిన కేసీఆర్ ఇప్పుడు ఈ దేశంలో గుణాత్మకమార్పు రావాలన్న ఆకాంక్షతో ముందుకునడుస్తున్నారు. ఇంకా ఎన్నేండ్లు అమెరికా, చైనా గురించి చెప్పుకోవాలి. ఆ దేశాలు మన దేశాభివృద్ధిని చూసి చెప్పుకునే రోజులు రావాలని ప్రకటించారు. కేసీఆర్ ఏదీ మొదలుపెట్టినా అది ప్రజలకోసం. ఆ ప్రయత్నంలో ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయరు.**

జనగళం

## దేశానికి దిశ

ప్రజా సంక్షేమ పాలనను
రాష్ట్రంలో అందించెరా..
మూడో ఫ్రంట్ అనుకుంటూ
మూడో కన్ను తెరిచెరా..
కొత్త రాజకీయాల కోసం
జనం కదులుతున్నరురా
అవినీతి నాయకుల గుండెలు
గుభేలుమన్నయిరా
ఉత్తర దక్షిణమంతా
కొత్త దారి పట్టునురా
ఆసేతు హిమాచలం
అన్నదాతలకు పండుగరా



ప్రాంతీయ ఆకాంక్షలు అంటే
సంకుచితత్వం కానే కాదు..!
జాతీయతా భావం
ఏ ఒక్కరి సొత్తుకాదు..
కేసీఆర్ అంటున్నది మూడోఫ్రంట్
అది దేశానికే ఏలబోయే మొదటి ఫ్రంట్!!

**– ఉప్పు సుధాకర్, 1969 ఉద్యమకారుడు**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

## ఆకాశంలో సగం.. నేలపైనా సగం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పెయిన్‌లోని పాంప్లోనాలో స్త్రీలపై పురుషుల హింసకు వ్యతిరేకంగా, ఉపాధిలో సమాన అవకాశాలను డిమాండ్ చేస్తూ జరిగిన ప్రదర్శనలో మహిళలు



అలహాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కోపైలట్ మమత



పాకిస్థాన్‌లో మహిళల కోసం ప్రారంభించిన పింక్ ట్యాక్సీలో మహిళా డ్రైవర్



ఢిల్లీలో మొదటి మహిళా ఈ-రిక్షా డ్రైవర్ బినోటా



ఇండోర్‌లో పింక్ జోన్ ప్రారంభం అనంతరం కరెంట్ స్తంభానికి మహిళా కార్మికుల మరమ్మతులు



రాంచీలో రైలు ప్రయాణికుల వద్ద టికెట్లు తనిఖీ చేస్తున్న మహిళా టీటీఈలు; గురువారం ఈ రైలులో రైల్వే సిబ్బంది అందరూ మహిళలే




లైంగిక దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో యువతులు



మహిళా దినోత్సవం నాడు అమృత్‌సర్‌లోని భారత్-పాక్ సరిహద్దులో బీఎస్‌ఎఫ్ మహిళా సిబ్బంది గస్తీ



# గెలుపు కోసం ప్రజల్ని విడదీస్తున్నారు!



- భారత్‌లో నీచ రాజకీయాలు నడుస్తున్నాయి
- దేశ సంస్థాగత నిర్మాణానికి సవాళ్లు ఎదురవుతున్నాయి
- కశ్మీర్‌లో పరిస్థితుల్ని చూసి నాకు కన్నీరు ఆగలేదు
- సింగపూర్‌లో రాహుల్.. బీజేపీపై విమర్శలు

**సింగపూర్, మార్చి 8:** భారత్‌లో ప్రస్తుతం బెదిరింపుల వాతావరణం నెలకొందని, ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ ప్రజల్ని విభజిస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న రాహుల్ గురువారం అక్కడి 'లీ కువాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ' నిర్వహించిన చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సంస్థాగత నిర్మాణానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇటీవలి సుప్రీంకోర్టు సంక్షోభాన్ని రాహుల్ ప్రస్తావిస్తూ.. 'న్యాయవ్యవస్థలో మౌలికంగా తప్పిదాలు జరుగుతున్నాయని, వాటిపై తమ గొంతుకనైనా ప్రజలు వింటారని న్యాయమూర్తులు అలా చేశారు. కానీ, ఆ వివాదానికి కేంద్ర బిందువు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా మొదట్లో నిందితుడిగా ఉన్న సోహ్రబుద్దీన్ కేసు. అంటే దేశ సంస్థాగత నిర్మాణానికి ఇలాంటి సవాళ్లు ఎన్ని ఎదురవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు' అని రాహుల్ తెలిపారు. 'దేశంలో చట్టాల రూపకల్పననూ ప్రధానే నియంత్రిస్తారు. ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా పోలీసులనూ ఆయనే కంట్రోల్ చేస్తారు' అని పేర్కొన్న రాహుల్.. మోదీని తాము ఎదుర్కొంటామని, ఎన్నికల్లో ఓడిస్తామని ధీమా వ్యక్తంచేశారు.

**బీజేపీ ప్రభుత్వ నిర్ణయం వల్లే కశ్మీర్ సంక్షోభం**

జమ్ముకశ్మీర్ వివాద పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. చర్చల ప్రక్రియకు తన సంపూర్ణమద్దతును ప్రకటించారు. కశ్మీర్‌లో ప్రస్తుత సంక్షోభానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని అన్నారు. 'మీరు ప్రజలతో మమేకమవండి. వారితో కలిసి పనిచేయండి, ప్రజలను నమ్మండి. అలా అయితేనే పరిష్కారం సాధ్యం' అని ఆయన చెప్పారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ విధాన వైఫల్యం, పనికిమాలిన రాజకీయ నిర్ణయాలే జమ్ముకశ్మీర్ ప్రస్తుత సంక్షోభానికి కారణమని ఆరోపించారు. 'మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నకాలంలో విధాననిర్ణయాల ఫలితంగా కశ్మీర్‌లో శాంతిభద్రతలను సాధారణ స్థితికి తేగలిగాం. 2014 నుంచి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అక్కడి పరిస్థితుల్ని చూసి నాకైతే ఏడుపు ఆగలేదు' అని రాహుల్ చెప్పారు. చైనాతోనూ భారత్ స్నేహపూర్వక, శాంతియుత సంబంధాలను కలిగి ఉండాలని ఆయన చెప్పారు.

**నేతాజీ స్మారక కేంద్రాన్ని సందర్శించిన రాహుల్**

సింగపూర్ పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీ గురువారం అక్కడి ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్‌ఏ) స్మారక కేంద్రాన్ని సందర్శించి, నేతాజీకి నివాళులర్పించారు. సింగపూర్-ఇండియన్ అసోసియేషన్ కార్యాలయాన్ని కూడా రాహుల్ సందర్శించారు.

# మహిళలకు కోటా ఇవ్వాల్సిందే!

### రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

- రాజ్యసభలో పార్టీలకు అతీతంగా సభ్యుల డిమాండ్
- మహిళా సాధికారత తక్షణ అవసరమన్న లోక్‌సభ స్పీకర్
- మహిళా దినోత్సవంపై చర్చ అనంతరం సభను అడ్డుకున్న విపక్ష సభ్యులు

**న్యూఢిల్లీ, మార్చి 8:**

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పించే బిల్లును వెంటనే ఆమోదించాలని రాజ్యసభలో పలు పార్టీలకు చెందిన సభ్యులు డిమాండ్ చేశారు. రాజ్యసభ ఇదివరకే ఆమోదించిన ఈ బిల్లును లోక్‌సభ కూడా ఆమోదించేలా చొరవ తీసుకోవాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల హక్కుల కోసం పాటుపడుతామని రాజ్యసభ, లోక్‌సభ సమైక్యంగా ప్రకటించాయి. మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ మరింత శక్తితో, విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా చర్చలో పాల్గొన్న సభ్యులు దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న నేరాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల ఆందోళనతో సోమవారం నుంచి ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వరుసగా సభ వాయిదా పడుతుండగా, గురువారం మాత్రం మహిళల సమస్యలపై మాట్లాడేందుకు సభ్యులందరూ తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టారు. స్పీకర్ ప్రసంగం ముగిసిన వెంటనే అన్నాడీఎంకే, టీఆర్‌ఎస్, టీడీపీ, టీఎంసీ సభ్యులు ప్లకార్డులు చేతపట్టుకొని వెల్‌లోకి దూసుకెళ్లారు.



మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీలు .. పైవరుసలో (ఎడమ నుంచి) సుష్మాస్వరాజ్, అంబికాసోని, రేణుకాచౌదరి, విప్లవ్ ఠాకూర్, అను ఆగా, కింది వరుసలో (ఎడమ నుంచి) తోట సీతారామలక్ష్మి, కుమారి సెల్జా, కనిమొళి, వాంగ్‌సుక్ సయమ్, రజనీ పాటిల్

ఏఐఏడీఎంకే సభ్యులు పెరియార్ ఫొటోలను ప్రదర్శించారు. రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్‌ఎస్ సభ్యులు డిమాండ్ చేయగా, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ సభ్యులు కోరారు. రాజ్యసభ గురువారం సమావేశం ప్రారంభంకాగానే గంటపాటు మహిళల సమస్యలపై చర్చించారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని చైర్మన్ వెంకయ్యనాయుడు కోరారు. దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్‌తోపాటు ఇతర చట్ట సభలలో వారికి రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు. చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును రాజ్యసభ 2010లోనే ఆమోదించగా, లోక్‌సభ ఆమోదించాల్సి ఉంది. మహిళా బిల్లుకు తాను ఇప్పటికీ మద్దతునిస్తున్నానని విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి మహిళలకు భద్రతను కల్పించే సురక్షిత వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. మహిళల కోటా బిల్లును త్వరగా ఆమోదించాలని డిమాండ్ చేశారు. సభలో వైస్ చైర్మన్లుగా వ్యవహరించే వారిలో ఒక్క మహిళ కూడా ఎందుకు లేరని కాంగ్రెస్ సభ్యురాలు విప్లవ్ ఠాకూర్ ప్రశ్నించారు. పలువురు సభ్యులు మహిళల భద్రత, కొనసాగుతున్న భ్రూణ హత్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ చర్చ ముగిసిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు మళ్లీ వెల్‌లోకి దూసుకెళ్లి.. బ్యాంకింగ్ కుంభకోణాలు, కావేరీ జల వివాదం, ఏపీకి ప్రత్యేక హోదా తదితర అంశాలపై సభను అడ్డుకున్నారు. ప్లకార్డులు చేతపట్టుకొని నినాదాలు చేయడం ప్రారంభించారు. చైర్మన్ తొలుత మధ్యాహ్నం వరకు ఆ తరువాత డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ మరుసటి రోజు వరకు సభను వాయిదా వేశారు.

**ప్రైవేటు కోచింగ్ సెంటర్ల క్రమబద్ధీకరణ మా పని కాదు**

ప్రైవేటు కోచింగ్ సెంటర్ల క్రమబద్ధీకరణలో తాము జోక్యం చేసుకోమని కేంద్రప్రభుత్వం గురువారం రాజ్యసభ సభ్యుడికి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తినాటికి 20 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఫిబ్రవరి ఆఖరునాటికి 19.58 గిగావాట్లకు చేరుకున్నామని కేంద్రప్రభుత్వం పేర్కొంది.



## నాగాలాండ్ సీఎంగా రియో ప్రమాణం

### కార్యక్రమానికి హాజరైన నిర్మలా సీతారామన్, కిరణ్‌రిజిజు, అమిత్‌షా

**కోహిమా:** నాగాలాండ్ సీఎంగా నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ) నేత నెఫియో రియో గురువారం ప్రమాణం చేశారు. డిప్యూటీ సీఎంగా బీజేపీ ఎమ్మెల్యే వై పతాన్ ప్రమాణం చేశారు. వీరితోపాటు పది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, కిరణ్ రిజిజు, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్, నాగాలాండ్ మాజీ సీఎం టీఆర్ జెలియాంగ్‌తోపాటు అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ సీఎంలు హాజరయ్యారు. నాగాలాండ్ సీఎంగా నెఫియో రియో బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి.

## పార్టీ కార్యాలయమే మాణిక్ సర్కార్ కొత్త ఇల్లు

**అగర్తలా:** ఇరవైఏండ్లు అప్రతిహతంగా త్రిపురను పాలించి.. ఇటీవల అధికారాన్ని కోల్పోయిన మాజీ సీఎం మాణిక్ సర్కార్ ఇకపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో నివసిస్తారు. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి, సమీపంలోనే ఉన్న పార్టీ ఆఫీస్‌లోకి మారుతున్నారని సీపీఎం కార్యదర్శి బిజన్ దార్ గురువారం మీడియాకు తెలిపారు. 'కొన్ని గంటల్లోనే ఆయన పార్టీ కార్యాలయంలోకి మారతారు. పార్టీ కార్యాలయ అతిథిగృహంలోని ఓ గదిలో భార్య పంచాలి భట్టాచార్యతో కలిసి సర్కార్ నివసిస్తారు' అని చెప్పారు. పార్టీ కార్యాలయంలోని కిచెన్‌లో వండినదే తింటానని ఇప్పటికే సర్కార్ స్పష్టంచేశారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి హరిపాద దాస్ తెలిపారు. కాగా, మాణిక్ దంపతులకు పిల్లల్లేరు.

# మన ఆడపిల్లల గొంతుక విందాం

- వివక్షను రూపుమాపితేనే సమాజ పురోగతి
- మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి

**న్యూఢిల్లీ:** తరతరాల అణిచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్న మన ఆడపిల్లల గొంతుక వినాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నా వారిపై వివక్ష కొనసాగుతూనే ఉందని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో గురువారం సాయంత్రం 'నారీశక్తి పురస్కార్-2017' అవార్డుల ప్రదానం జరిగింది. వివిధ రంగాల్లో రాణించిన 39మంది మహిళలు, మహిళాసంస్థలకు రాష్ట్రపతి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు తమ సత్తా చాటుతుండడం దేశానికి గర్వకారణమన్నారు. బాల, బాలికలను సమానమని చూస్తేనే సమాజ ప్రగతి సాధ్యమని కోవింద్ చెప్పారు. ఈసందర్భంగా అక్రమ రవాణాకు గురైన బాధితులతో రాష్ట్రపతి కోవింద్ సమావేశమయ్యారు. హ్యూమన్ ట్రాఫికింగ్ బాధితులను ఆదరించాలన్నారు. మనుషుల అక్రమ రవాణా దేశానికే కాదు, మానవాళికే కళంకమన్నారు.



ఐఎన్‌ఎస్ తరిణి అధికారిణికి 'నారీశక్తి పురస్కార్' ప్రదానం

## హిమాలయాలూ ఆపలేవు

- భారత్, చైనా సంబంధాలపై చైనా మంత్రి

**బీజింగ్:** భారత్, చైనా మానసిక ప్రతిబంధకాలను వదులుకోవడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేయాలని.. పరస్పర రాజకీయ విశ్వాసం ఉంటే ఇరుదేశాల బంధాన్ని హిమాలయాలు కూడా అడ్డుకోలేవని చైనా విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యి అన్నారు. ఇరుదేశాలు కలిసి విభేదాలను పరిష్కరించుకోవాలన్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పదవీకాలంపై పరిమితులు తొలిగించే ప్రతిపాదనను చైనా పార్లమెంట్ ఆమోదించనున్న నేపథ్యంలో ఆ దేశ రాజకీయ ముఖచిత్రంలో భారీ మార్పులు జరుగనున్నాయి. దీంతో చైనా విదేశాంగ విధానంపై గురువారం మీడియాతో వాంగ్ యి మాట్లాడుతూ తమ విదేశాంగ విధానంలో నవశకం మొదలైందన్నారు. 'చైనా డ్రాగన్, భారత ఏనుగు పరస్పరం పోరాటానికి దిగకుండా కలిసి డ్యాన్స్ చేయాలి. చైనా, భారత్ కలిస్తే ఒకటి ప్లస్ ఒకటి రెండు కాదు. 11 అవుతుంది. కొన్ని ప్రతికూలతలున్నా రెండు దేశాల సంబంధాలు వృద్ధి చెందుతున్నాయి' అని అన్నారు.

## హదియా పెండ్లి సబబే!

### 'లవ్ జిహాద్' కేసులో సుప్రీంకోర్టు తీర్పు



భర్త షఫీన్‌జహాన్‌తో హదియా

**న్యూఢిల్లీ, మార్చి 8:** లవ్ జిహాద్ కేసులో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పును వెలువరించింది. కేరళ యువతి హదియాకు ఆమె భర్తతో కలిసి జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఆమె వివాహం చెల్లదంటూ గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. పెండ్లి విషయంలో ఒక స్త్రీగా ఆమెకు హక్కు ఉంటుందని చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే లవ్ జిహాద్ వ్యవహారంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చేపట్టిన దర్యాప్తును యథావిధిగా కొనసాగించవచ్చని పేర్కొన్నది. కేరళకు చెందిన అఖిల (25) 2016 డిసెంబర్‌లో మతం మారి హదియాగా పేరు మార్చుకుని షఫీన్‌జహాన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆమెది బలవంతపు మతం మార్పిడి వివాహమని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో 'లవ్ జిహాద్' కేసుగా ఈ ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ వివాహం చెల్లదంటూ గత ఏడాది మే నెలలో తీర్పునిచ్చిన కేరళ హైకోర్టు.. దర్యాప్తు కోసం ఎన్‌ఐఏను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ షఫీన్ జహాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# కూతురు బరువు కాదు.. ఇంటి గౌరవం

- భ్రూణహత్యలు కొనసాగడం సిగ్గుచేటు
- ఆడపిల్లలను రక్షించేందుకు నానమ్మలు నడుం బిగించాలి: ప్రధాని మోదీ
- నేషనల్ న్యూట్రిషన్ మిషన్‌ను ప్రారంభించిన ప్రధాని
- బేటీ బచావో..బేటీ పఢావో 161 జిల్లాల నుంచి 640 జిల్లాలకు విస్తరణ

**జున్జును/న్యూఢిల్లీ, మార్చి 8:** సమాజంలో భ్రూణహత్యలు ఇంకా కొనసాగుతుండటం సిగ్గుచేటని, ఈ పరిస్థితిని మార్చి ఆడపిల్లలను రక్షించేందుకు అత్తలు (నానమ్మలు) నడుంబిగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాజస్థాన్‌లోని జున్జును పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మోదీ పాల్గొని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ న్యూట్రిషన్ మిషన్‌ను ప్రారంభించారు. బేటీ బచావో..బేటీ పఢావో కార్యక్రమాన్ని 161 జిల్లాల నుంచి 640 జిల్లాలకు విస్తరిస్తున్నట్టు ప్రకటించారు. బాలికలకు బాలురతో సమానంగా నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని సూచించారు. కూతుళ్లు బరువు కాదని, మన ఇంటి గౌరవమని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పించే వాతావరణం కల్పిస్తామని, ఆడశిశు భ్రూణహత్యలను నిర్మూలిస్తామని దేశవాసులంతా ప్రతిజ్ఞ చేయాలని కోరారు. 18వ శతాబ్దపు భావనలను కొనసాగిస్తూ, ఆడవారి పట్ల వివక్ష చూపేవారికి 21 శతాబ్దపు మనుషులుగా చెప్పుకొనే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా వివక్షను రూపుమాపకుంటే ప్రస్తుత తరంతోపాటు భవిష్యత్ తరాలకూ హాని చేసినవారమవుతామన్నారు. పీఎం(ప్రధానమంత్రి)ను మీరు ఎంతైనా విమర్శించుకోవచ్చని.. కానీ ఇకనుంచి మరో పీఎం (పోషణ మిషన్)గురించి కూడా ఆలోచించాలని పిలుపునిచ్చారు. కేంద్ర మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ చర్యలతో బాల్య వివాహాలు 47శాతం నుంచి 20 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు. పోలీస్ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్రాలను కోరామన్నారు.



న్యూట్రిషన్ మిషన్ ప్రారంభ కార్యక్రమంలో చిన్నారులతో మోదీ

**కున్వర్ బాయ్ నాకు ఆదర్శం**

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కున్వర్‌బాయ్‌ని గుర్తు చేసుకున్నారు. ఆమె ఇచ్చిన స్ఫూర్తితోనే స్వచ్ఛ భారత్ మిషన్‌ను ముందుకు తీసుకుపోతున్నామని పేర్కొంటూ.. ట్విట్టర్‌లో 'షీఇన్‌స్పైర్స్‌మీ' యాష్‌ట్యాగ్‌ను జతచేసి కున్వర్‌బాయ్‌తో తాను దిగిన ఫొటోలను, వీడియోలను షేర్ చేశారు. కున్వర్‌బాయ్ తన జీవనాధారమైన మేకలను అమ్మి రెండు మరుగుదొడ్లను నిర్మించుకున్నారు. రెండేండ్ల కిందట కున్వర్‌బాయ్‌ని ప్రత్యేకంగా కలసిన ప్రధాని, ఆమెను స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధిగా ప్రకటించారు.

## గాంధీ, అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం

### కేరళ, తమిళనాడుల్లో ఘటనలు

**కన్నూర్, మార్చి 8:** జాతి నేతల విగ్రహాల విధ్వంసకాండ గురువారం కూడా సాగింది. కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లా తాలిపరాంబ తాలూకా కేంద్రంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ముఖ భాగాన్ని ఓ వ్యక్తి ధ్వంసం చేశాడు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని, తర్వాత బెయిల్‌పై విడుదల చేశామని వారు చెప్పారు. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నగర శివారులోని తిరువోత్రియూర్ పరిధిలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముఖానికి ఆగంతకులు రంగు పూశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డీసీపీ జీ శశాంక్ సాయి తెలిపారు.

## జాదవ్‌పూర్ వర్సిటీలో ఉద్రిక్తం

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ వద్ద హిందూ జాగరణ్ మంచ్ అనుబంధ విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య గురువారం సాయంత్రం ఘర్షణ జరిగింది. బుధవారం జన్‌సంఘ్ నేత శ్యామ ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గురువారం మితవాద కార్యకర్తలు జాదవ్‌పూర్ యూనివర్సిటీ గేట్ వద్ద దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అప్పుడే వామపక్ష విద్యార్థి సంఘాల కార్యకర్తలు అక్కడికి రావడంతో ఇరు పక్షాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరుపక్షాల వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారులకు గాయాలయ్యాయి. యూనివర్సిటీ బయట నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన తమపై లెఫ్ట్ కార్యకర్తలు దాడి చేశారని హిందూ జాగరణ్ మంచ్ ఆరోపించింది. కానీ జాదవ్‌పూర్ విద్యార్థులు మాత్రం తమ ర్యాలీలోకి జాగరణ్ మంచ్ కార్యకర్తలు చొరబడటంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందన్నారు.

## యాసిడ్ దాడి బాధితుల ర్యాంప్ వాక్



**థాణె:** యాసిడ్ దాడి బాధితులు విపత్కర పరిస్థితుల నుంచి బయటపడి గౌరవప్రదంగా జీవించగలమని సంకేతాలిచ్చారు. చట్ట విరుద్ధంగా సాగుతున్న యాసిడ్ విక్రయాలకు, యాసిడ్ దాడులకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని థాణె నగర మహిళలు ప్రచారోద్యమం చేపట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి అగర్వాల్ అనే యాసిడ్ దాడి బాధితురాలు మాట్లాడుతూ తమ వంటి వారు మళ్లీ జీవితాన్ని ప్రారంభించడం ఒక సవాలేనన్నారు. లక్ష్మి అగర్వాల్ మాదిరిగానే ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న బాధితులు న్యాయం కోసం, మహిళలకు సురక్షిత సమాజం కోసం పోరాడుతామని చెప్పారు.

## ఢిల్లీలో దావూద్ అనుచరుడి అరెస్టు

### ముంబై పేలుళ్లతో నిందితుడికి సంబంధాలు

**న్యూఢిల్లీ:** అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు ఫరూక్ టక్లా(57) అలియాస్ మహమ్మద్ ఫరూక్‌ను సీబీఐ అధికారులు గురువారం అరెస్టుచేశారు. 1993 ముంబై వరుస పేలుళ్ల కేసుతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫరూక్ దుబాయ్ నుంచి ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో దిగగానే అరెస్ట్ చేశామని అధికారులు చెప్పారు. ఫరూక్‌పై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్ ఉన్నా ఢిల్లీకి ఎలా వచ్చాడనే విషయంపై స్పందించేందుకు సీబీఐ నిరాకరించింది. వరుస పేలుళ్ల కేసును విచారిస్తున్న ముంబైలోని ప్రత్యేక కోర్టులో ఫరూక్‌ను హాజరుపర్చనున్నారు.

**దావూద్ గ్యాంగ్‌కు అన్ని విధాల సహకారం:** 1993లో ముంబై పేలుళ్లకు పాల్పడిన దావూద్ గ్యాంగ్‌కు టక్లా అన్ని విధాల సహాయ సహకారాలు అందించాడు. 1993 ముంబై పేలుళ్ల కేసులో నిందితులకు వివిధ వ్యాపారాల ప్రారంభానికి టక్లా సహకరించాడు. పేలుళ్లకు పాల్పడిన వారిని కరాచీకి తీసుకెళ్లి బాంబుల తయారీ, అధునాతన ఆయుధాల తయారీలో శిక్షణ ఇప్పించాడు. ముంబై పేలుళ్ల తర్వాత దావూద్ తదితరులు పాక్‌లో తల దాచుకున్నా.. టక్లా మాత్రం దుబాయిలోనే జీవిస్తూ వచ్చాడు.

## ఆరుషి కేసులో సుప్రీంకోర్టుకు సీబీఐ

**న్యూఢిల్లీ, మార్చి 8:** సంచలనం సృష్టించిన ఆరుషి-హేమరాజ్ హత్యకేసులో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో తల్వార్ దంపతులను నిర్దోషులుగా అలహాబాద్ కోర్టు ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ గురువారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో ఆరుషి తల్లిదండ్రులు నుపుర్, రాజేశ్ తల్వార్‌లను అలహాబాద్ హైకోర్టు గత ఏడాది అక్టోబర్ 12న నిర్దోషులుగా ప్రకటించింది.

# హైదరాబాద్ కలెక్టర్‌కు బేటీ బచావో-బేటీ పఢావో అవార్డు

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా స్వీకరణ**



మోదీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ యోగితారాణా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బాలికల విద్య, రక్షణ అంశాల్లో విశేష కృషి చేసినందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితారాణా కేంద్ర ప్రభుత్వం అందజేసే బేటీ బచావో-బేటీ పఢావో అవార్డును అందుకున్నారు. గురువారం రాజస్థాన్‌లోని జున్జునులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ యోగితారాణా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బేటీ బచావో -బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బాలబాలికల నిష్పత్తిని గణనీయంగా పెంచేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేసి పురోగతిని సాధించింది. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టి ఆడపిల్లల రక్షణ కోసం కృషిచేశారు. జిల్లా కలెక్టర్‌గా యోగితారాణా బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల రక్షణ, బాలికల విద్య కోసం విశేషమైన కృషిచేశారు.



హైదరాబాద్ ఈసీఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో అల్ ఇండియా యాదవ్ ఉమెన్స్ ఫ్రంట్ చైర్మన్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ సతీమణి బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బతుకమ్మను ఎత్తుకున్న దృశ్యం.

# సమాజాన్ని అధ్యయనం చేయాలి

- మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి




విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో కళాశాల కార్యదర్శి పల్లా నీలిమ

**ఘట్‌కేసర్:** మహిళలు సమాజంపై పూర్తి అవగాహన పెంచుకోవడం ద్వారా అన్ని రంగాల్లో రాణించగలుగుతారని మండలి విప్, అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ కాలేజీలో పది రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు మార్గదర్శి చిట్స్ ఎండీ శైలజాకిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. సమాజంలో సగభాగమైన మహిళలు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలన్నారు. మగవారే గొప్ప అనే భావన వదిలి అన్ని రంగాల్లో రాణించగలమనే ఆత్మస్థైర్యం పెంచుకోవడం ద్వారా విజయం సాధించగలరని చెప్పారు. మహిళలు ఆనందంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పల్లా నీలిమ, డైరెక్టర్ కేఎస్ రావు, ప్రోగ్రాం కన్వీనర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఇక్కడంతా మహిళాసిబ్బందే

## బేగంపేట, విద్యానగర్ రైల్వేస్టేషన్లలో గార్డు నుంచి మేనేజర్ దాకా అంతా వారే

- దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నాలుగు మహిళా స్టేషన్లను ప్రకటించిన జీఎం వినోద్‌కుమార్
- ఏపీలోనూ రెండు స్టేషన్లు





విద్యానగర్ స్టేషన్‌లో సిబ్బందితో హైదరాబాద్ డీఆర్ఎం అరుణ్‌కుమార్ జైన్.. బేగంపేట రైల్వే స్టేషన్ మహిళా సిబ్బందితో దక్షిణమధ్యరైల్వే జీఎం వినోద్‌కుమార్

**హైదరాబాద్ సిటీబ్యూరో/అంబర్‌పేట, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు గౌరవసూచకంగా హైదరాబాద్‌లోని రెండు రైల్వే స్టేషన్లను 'ఆల్ ఉమెన్ ఎంప్లాయీస్ రైల్వే స్టేషన్లు'గా మార్చారు. గురువారం బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ ఈ ప్రకటన చేశారు. అనంతరం మాట్లాడుతూ దక్షిణమధ్య రైల్వే పరిధిలో నాలుగింటిని పూర్తిస్థాయి మహిళా ఉద్యోగుల స్టేషన్లుగా మార్చామన్నారు. ఇందులో రెండు తెలంగాణలో, మరో రెండు ఏపీలో ఉన్నాయి. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని బేగంపేట, హైదరాబాద్ డివిజన్‌లోని విద్యానగర్ స్టేషన్లతోపాటు ఏపీలోని గుంతకల్లు డివిజన్ చంద్రగిరి స్టేషన్‌ను, గుంటూరు డివిజన్‌లోని న్యూ గుంటూరు స్టేషన్‌ను మహిళా స్టేషన్లుగా ప్రకటించారు. ఈ నాలుగు స్టేషన్లలో ఇకపై పూర్తిస్థాయిలో మహిళా ఉద్యోగులే విధులు నిర్వహిస్తారని జీఎం చెప్పారు. అనంతరం బేగంపేట స్టేషన్‌లో న్యాప్కిన్ వెండింగ్ మెషీన్‌తోపాటు వెయిటింగ్ హాల్‌ను ప్రారంభించారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాందేడ్, ఔరంగాబాద్ స్టేషన్లలో న్యాప్కిన్ వెండింగ్ మెషీన్లతోపాటు బేబీ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సబర్బన్ రైల్వే స్టేషన్లలో నిర్భయ స్క్వాడ్స్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలో ఫిరంగిపురం, రామవరపాడు స్టేషన్లను ఆల్ ఉమెన్ ఎంప్లాయీస్ స్టేషన్లుగా మార్చనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మహిళా రైల్వే స్టేషన్లకు కేటాయించిన ఉద్యోగినులకు శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేట స్టేషన్ మీదుగా వెళ్తున్న ఎంఎంటీఎస్ లోకోపైలట్ సత్యవతికి జీఎం ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి, ఆమె సేవలను కొనియాడారు.

**మహిళల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే..**

విద్యానగర్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మహిళా ఉద్యోగుల స్టేషన్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవానికి ప్రత్యేక గౌరవం ఇచ్చే క్రమంలో విద్యానగర్‌ను మహిళా స్టేషన్‌గా మార్చామన్నారు. మహిళల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే మహిళా రైల్వేస్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. మహిళలు స్వతంత్రంగా పని చేయాలని, పురుషులకు సమానంగా రాణించి విజయం సాధించాలని కోరారు. విద్యానగర్ స్టేషన్‌లో గురువారం నుంచి విచారణ, రిజర్వేషన్, క్లర్క్స్, ఆర్పీఎఫ్, హోంగార్డులు, పారిశుద్ధ్యం, టికెట్ వెండింగ్ తదితర విధుల్లో మహిళలే ఉన్నారు. ఈ స్టేషన్‌కు 27 మంది సిబ్బందిని కేటాయించారు. కార్యక్రమాల్లో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అమిత్‌వర్ధన్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏ శ్రీధర్, సీనియర్ డీఎస్‌వో శంతల్, సీనియర్ సేఫ్టీ ఆఫీసర్ రవికుమార్ పాల్గొన్నారు.



అహ్మద్‌గూడలో నిర్మిస్తున్న ఇండ్ల వద్ద పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

## డబుల్ ఇండ్లను వేగంగా పూర్తి చేయండి

**పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో పేదల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డితో కలిసి అహ్మద్‌గూడలో నిర్మిస్తున్న 4,041 ఇండ్ల కాలనీని అరవింద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహ్మద్‌గూడలో ఇండ్ల నిర్మాణం పూర్తయితే ఇదో టౌన్‌షిప్‌గా అవతరిస్తుందని చెప్పారు. పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో వేగం పెంచేందుకు ప్రతి గురువారం కాలనీలను సందర్శించనున్నట్టు తెలిపారు.

## హెచ్‌సీయూ చెరువులో ప్లాంక్టోపిరస్ బ్యాక్టీరియా

**యాంటీబయాటిక్ ఉత్పత్తి చేస్తుందన్న శాస్త్రవేత్తలు**

**కొండాపూర్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని బఫెల్లో లేక్‌లో వ్యాధి నిరోధకాన్ని (యాంటీబయాటిక్) ఉత్పత్తి చేసే బ్యాక్టీరియా లభించినట్టు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన ప్లాంట్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. పరిశోధనల్లో భాగంగా వర్సిటీలోని బఫెల్లో లేక్‌లోని నీటిని పరిశీలించగా అందులో ప్లాంక్టోపిరస్ హైడ్రిల్లే అనే బ్యాక్టీరియాను కనుగొన్నామన్నారు. దీనిపై మరింత పరిశోధనలు జరుపగా ఇది వ్యాధి నిరోధకశక్తిని పెంచడంలో, అమ్మోనియా వ్యర్థాలను శుభ్రం చేయడంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని తేలిందన్నారు. ఈ బ్యాక్టీరియా వాతావరణ సంరక్షణలోనూ భాగస్వామి అవుతుందని చెప్పారు. మనుషులు, జంతువులకు ఈ బ్యాక్టీరియా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.



బ్యాక్టీరియాను గుర్తించిన ప్రొఫెసర్ వెంకటరమణ, స్కాలర్ శ్రీనివాస్

## ఎల్బీనగర్‌లో ఇద్దరు టెన్త్ విద్యార్థినుల ఆత్మహత్య

- ఎనిమిదో అంతస్తుపైనుంచి దూకిన స్నేహితురాళ్లు



భార్గవిపటేల్, సావని మృతదేహాలు

**మన్సూరాబాద్:** ఇద్దరూ మంచి స్నేహితులు.. చదువుల్లో ఎప్పుడూ ముందుంటారు.. పరీక్షలు ఉండటంతో కలిసి చదువుకుంటున్నారు.. కారణమేంటో తెలియదు కానీ, కంబైన్డ్ స్టడీ చేస్తున్న వారిద్దరూ అపార్ట్‌మెంట్ ఎనిమిదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ ఎల్బీనగర్ సమీపంలోని బహదూర్‌గూడ ఎస్బీహెచ్ కాలనీలో జరిగింది. కాలనీలోని టీఎన్ఆర్ వైష్ణవి శిఖర అపార్ట్‌మెంట్‌లోని 805 ఫ్లాట్‌లో కాంతిపటేల్, కమలాపతి దంపతులు నివసిస్తున్నారు. వారి నాల్గో కూతురు భార్గవి పటేల్(15) పదోతరగతి చదువుతున్నది. ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్ మంజీరా హైట్స్‌ఫేజ్-1లోని 704 ఫ్లాట్‌లో నివసించే డీఆర్డీవో సైంటిస్ట్ నరేందర్ కాలే కుమార్తె సావని కాలే(15), భార్గవి ఒకే పాఠశాలలో చదువుతూ మంచి స్నేహితులుగా ఉన్నారు. సీబీఎస్ఈ సిలబస్ కావడంతో వారికి టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 6న హిందీ పరీక్ష రాసిన వారు, 12న ఇంగ్లిష్ పరీక్ష ఉండటంతో గురువారం భార్గవిపటేల్ ఇంటివద్ద కలిసి చదువుకుంటున్నారు. ఇద్దరూ చదువుకుంటుండగా భార్గవి తల్లిదండ్రులు బయటకువెళ్లారు. సాయంత్రం 6:30 గంటల సమయంలో భార్గవి, సావని అపార్ట్‌మెంట్ ఎనిమిదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నారు. వీరి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు సావని రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సావని తన సూసైడ్‌లో 'తేజు ఐ మిస్‌యూ' అంటూ తన అన్నను ఉద్దేశించి రాసింది. దీంతోపాటు 'మై మమ్ పప్పా సారీ' అంటూ రాసింది.

## 5.7 కోట్లు ఇస్తామంటూ 3.4 లక్షలు బురిడీ

- ఈయూ పావర్టీ ప్రోగ్రాంకు ఎంపికయ్యారంటూ ఇద్దరికి టోపీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** యురోపియన్ యూనియన్(ఈయూ) నిర్వహించే పావర్టీ ప్రోగ్రాం కింద మీకు రూ.5.7 కోట్లు మంజూరయ్యాయి.. కొన్ని ట్యాక్స్‌లు చెల్లిస్తే డబ్బు మీ చేతికందుతుందంటూ సైబర్ చీటర్లు హైదరాబాద్‌కు చెందిన ఇద్దరికి రూ.3.4 లక్షలు టోకరావేశారు. యూసుఫ్‌గూడకు చెందిన చెన్నకేశవులు ఆక్టోపస్ కమాండోగా పనిచేస్తున్నారు. గత నెల 20న గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఒకరు బెల్జియం హై కమిషనర్‌గా, మరొకరు ఆర్బీఐ ఏజెంట్‌గా పరిచయం చేసుకున్నారు. మీ ఫోన్ నంబర్ ఈయూ పావర్టీ ప్రోగ్రాంకు ఎంపికైందని చెప్పారు. మీకు రూ.5.7 కోట్లు వస్తాయని చెప్పి, మీ వివరాలను ఇన్ఫో@ఆర్‌బింగ్.ఓఆర్‌జీకి పంపించాలని, అది ఆర్బీఐ మెయిల్ ఐడీ అని నమ్మించారు. దీంతో చెన్నకేశవులు వివరాలను పంపించారు. తర్వాత ఆ వ్యక్తులు మళ్లీ ఫోన్ చేసి మీకు నగదు బదిలీ చేయాలంటే కొన్ని ట్యాక్స్‌లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పి బ్యాంకు ఖాతాల్లో రూ.24,500, రూ. 85,500 డిపాజిట్ చేయించారు. వారిపై అనుమానం రావడంతో తన డబ్బు వెనక్కి ఇవ్వాలని చెన్నకేశవులు కోరారు. అయినా ఇవ్వకుండా రూ.కోట్లు ఇస్తామని చెప్తూ వివిధ కారణాలు చూపుతూ మరింత డబ్బు డిపాజిట్ చేయాలని సైబర్ చీటర్లు వెంటపడ్డారు. దీంతో చెన్నకేశవులు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సైబర్ చీటర్లు బోరబండకు చెందిన నఫీజబేగంకు ఫోన్ చేసి ఈయూ పావర్టీ ప్రోగ్రాం పేరుతో రూ.2.33 లక్షలను వివిధ ఖాతాల్లో డిపాజిట్ చేయించారు. జరిగిన మోసాన్ని గుర్తించిన నఫీజ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కేవీఎం ప్రసాద్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు జరుపుతున్నది.

మొదటిపేజీ తరువాయి...

# ఏవియేషన్‌లోనూ తెలంగాణ లీడర్

ఏవియేషన్ స్పేస్‌లో భాగంగా తొలి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టుగా పీపీపీ విధానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేసినట్లు గుర్తుచేశారు. జీఎంఆర్ నిర్వహిస్తున్న ఈ ఎయిర్‌పోర్టు దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న మేజర్ ఎయిర్‌పోర్టుల్లో ఒకటిగా నిలిచిందని చెప్పారు. ఫార్మా, ఏరోస్పేస్ సెక్టార్ విస్తరణలో ఎయిర్‌పోర్టు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు ఫార్మాజోన్‌లో ఉండటంతోపాటు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను కలిగి ఉందని చెప్పారు. తెలంగాణలో బేగంపేట, వరంగల్, హకీంపేట, దుండిగల్, నాదర్‌గుల్, రామగుండంలో ఎయిర్‌పోర్టులు ఉన్నట్లు తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్టును మరింత అందుబాటులోకి తీసుకురావటం వల్ల మెగా టెక్స్‌టైల్ పార్కు వృద్ధి, ఐటీ హబ్ విస్తరణకు అవకాశం కలుగుతుందన్నారు. కొత్తగూడెం, జక్రాన్‌పల్లిలో మరో రెండు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు.. కోల్‌బెల్ట్, మైన్స్, పవర్ సెక్టార్‌ను అనుసంధానం చేసేందుకు ఉపయోగపడుతుందని; జక్రాన్‌పల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు రాబోతున్న ఫార్మాసిటీకి దోహదకారికానుందన్నారు. హైదరాబాద్‌లో రెండేండ్ల క్రితం ప్రారంభించిన హెలీ టూరిజం విజయవంతంగా నడుస్తున్నదని, రాష్ట్రంలోని మిగతా నగరాలకు కూడా దానిని విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ఏవియేషన్ రంగంలో తనదైన ముద్ర వేస్తున్న తెలంగాణ.. ఏరోస్పేస్, ఏరోనాటికల్స్ ఇంజినీరింగ్‌లో లీడర్‌గా నిలిచిందన్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీ సంయుక్తంగా.. 'ఇండియా గ్లోబల్ ఏవియేషన్ హబ్' ఇతివృత్తంతో నిర్వహిస్తున్న సదస్సు ఈ నెల 11 వరకు కొనసాగనుంది. ఈ సదస్సుకు అమెరికా, జపాన్, జర్మనీ, సింగపూర్, మలేషియా, ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్ తదితర దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

**అందుకే నంబర్ 1గా నిలిచాం**

ఏరోస్పేస్, డిఫెన్స్ సెక్టార్లను తెలంగాణ పరిశ్రమల విధానంలో భాగంగా ప్రాధాన్యాంశాలుగా గుర్తించామని మంత్రి కేటీఆర్ చెప్పారు. పెద్దమొత్తంలో పెట్టే పెట్టుబడులకు అన్ని రకాల మద్దతు ఇస్తున్నామని, టీఎస్ ఐపాస్ ద్వారా కేవలం 15 రోజుల్లోనే సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తున్నామని వివరించారు. మేజర్ గ్లోబల్ ఏరోస్పేస్ కంపెనీలైన బోయింగ్, ఎయిర్‌బస్, జీఈ, సాఫ్రాన్, ప్రట్ అండ్ విట్నీ, సీఎఫ్ఎం, బొంబార్డియర్, పిలాటస్, ఆర్యూఏజీ, కోబమ్, హనీవెల్, సాబ్, రాక్‌వెల్ కొలిన్స్ తదితర కంపెనీలు దేశంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మొత్తంలో మూడు ఏరోస్పేస్ పార్కులు ఉన్నాయని, నాలుగో ఏరోస్పేస్ పార్కు కోసం స్థలాన్ని ఎంపిక చేస్తున్నట్టు వెల్లడించారు. ఏవియేషన్, ఏరోస్పేస్ రంగంలో నైపుణ్యం గల శ్రామికశక్తి అవసరమని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ సర్కారు టాస్క్ భాగస్వామ్యంతో విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ ఏవియేషన్ అకాడమీ, జీఎంఆర్ ఏవియేషన్ అకాడమీ, ఫ్లైటెక్ ఏవియేషన్ అకాడమీ వంటి సంస్థలు నైపుణ్యం గల విద్యార్థులను ఈ రంగానికి అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ తయారీ కంపెనీలైన ప్రట్ అండ్ విట్నీ, సీఎఫ్ఎంలు ఇంజిన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నాయని చెప్పారు. లీప్ ఇంజిన్ల తయారీకి హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు టీఏఎస్ఎల్, జీఈ ఇటీవలే ముందుకు వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ ఏవియేషన్ రంగంలో జరుగుతున్న ఆశాజనక పరిణామాలు హైదరాబాద్‌ను ఏరోస్పేస్ సెక్టార్‌లో ప్రథమస్థానంలో నిలుపుతున్నాయన్నారు.

**వ్యాట్ తగ్గించాలి: నారాయణ్ చౌబే**

విమానయాన ఇంధనంపై వ్యాట్ తగ్గించాలని పౌర విమానయాన శాఖ కార్యదర్శి నారాయణ్ చౌబే.. తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. మధ్యతరగతికి చెందినవారు దేశంలో 40 కోట్ల మంది ఉన్నారని, అందులో ప్రతి ఒక్కరు కేవలం రెండు టికెట్లు కొనుగోలు చేసినా, 80 కోట్ల టికెట్లు అమ్ముడవుతాయని చెప్పారు. ఎక్కువ ధర కారణంగా అలా జరగడం లేదని పేర్కొన్నారు. సామాన్యుడికి సైతం విమాన టికెట్లు అందుబాటులోకి రావాలని అన్నారు. జీఎస్టీలోకి విమానయాన సర్వీసులను తీసుకురావటం వల్ల ఏవియేషన్ ఇండస్ట్రీ గ్రోత్ పెరుగుతుందని చెప్పారు. ప్రతి ఏడాది 26 శాతం వృద్ధి కనిపిస్తున్నదని, ఉడాన్ పథకం ద్వారా 51 ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. భారతదేశం.. ప్రపంచవ్యాప్తంగా మూడో అతిపెద్ద ఏవియేషన్ హబ్‌గా ఉన్నట్లు స్పష్టం చేశారు.



ఏవియేషన్ షోలో భాగంగా వర్చువల్ రియాలిటీ గ్లాసెస్ సహాయంతో బోయింగ్ విమాన నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్



వింగ్స్ ఇండియా సదస్సులో రాష్ట్రానికి దక్కిన 'బెస్ట్ స్టేట్ విత్ ఏ డెడికేటెడ్ ఔట్‌లుక్ ఫర్ ద సెక్టార్' అవార్డును ఐటీ కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు అందజేస్తున్న మంత్రి కేటీఆర్, వింగ్స్ ఇండియా ప్రతినిధులు

### ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేం..

రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని, అన్నింటికి సిద్ధంగా ఉండాల్సి వస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఉదయం లేవగానే.. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు రాజీనామా వార్త పత్రికల్లో చూసి ఆశ్చర్యపోయానన్నారు. శుక్రవారం వింగ్స్ ఇండియా సదస్సు సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. పౌరవిమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. హైదరాబాద్ బేగంపేటలో వింగ్స్ ఇండియా సదస్సుకు ముఖ్య అతిథిగా రావాల్సిన అశోక్ గజపతిరాజు అంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాలేకపోవడంతో తాను ముఖ్య అతిథిగా వ్యవహరించాల్సి వచ్చిందని తెలిపారు. దేశంలో 70 ఏండ్లలో 70 విమానాశ్రయాలు ఉంటే అశోక్ గజపతిరాజు సారథ్యంలో గడిచిన మూడేండ్లలోనే దాదాపు 60 విమానాశ్రయాలు కొత్తగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. భారత ఏవియేషన్ రంగానికి విస్తృత సేవలు అందించిన అశోక్‌గజపతిరాజుకు, ఆయన బృందానికి మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



ఏవియేషన్ షో ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

### దేశం రెండు పార్టీలదే కాదు.. కూటమే ప్రత్యామ్నాయం: కేటీఆర్

దేశం రెండు పార్టీలది మాత్రమే కాదని, మూడో కూటమి ఏర్పాటే ప్రత్యామ్నాయమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. మన దేశంలో అనేక పార్టీలు ఉన్నాయని, మనది రెండు పార్టీల ప్రజాస్వామ్యం కాదని, ప్రాంతీయ పార్టీలు కూడా బలంగా ఉన్నాయని చెప్పారు. గురువారం వింగ్స్ ఇండియా సదస్సులో పాల్గొన్న ఆయన మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో మూడో కూటమి ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నదని అన్నారు. ఎన్నికలకు మరో ఏడాది కాలం ఉన్నదని, ముందు సమీకరణలు ఎలా మారుతాయో వేచి చూద్దామని బదులిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లుగా దేశ ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు అనేకసార్లు అవకాశాలు ఇచ్చారని, కానీ ఆ పార్టీలు ప్రజల ఆశయాలను తీర్చడంలో విఫలమయ్యాయని అన్నారు.



ఏవియేషన్‌షోలో సందర్శకులను ఆకట్టుకుంటున్న విమానాలు



## ప్రాణత్యాగానికీ వెనుకాడరు..!!

**ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తుల నుంచి ప్రజలను కాపాడేందుకు 40మంది సాయుధ మహిళా కమెండోలు సిద్ధమయ్యారు. ఎంతో కష్టతరమైన ఆ ఉద్యోగంలో చేరి తమ సత్తా నిరూపించుకుంటున్నారు.**

ముంబైలోని 2008లో జరిగిన ఉగ్రదాడిలో ఎందరో అమాయకులు చనిపోయారు. ఆ తర్వాత ఢిల్లీకి ముప్పు పొంచి ఉందన్న సమాచారంతో 2009లో 'స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టీస్'(ఎస్‌డబ్ల్యూఏటీ) టీంను సిద్ధం చేశారు అధికారులు. అలాంటి దాడులను, ఉగ్ర కార్యకలాపాలు, సాయుధ నేరస్థులు, ప్రమాదకర వ్యక్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ టీం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుంది. ఈ బృందంలో దాదాపు 200 మంది పురుషులు ఉన్నారు. వీరితోపాటుగా ప్రభుత్వం కొత్తగా 40మంది మహిళా కమెండోలను నియమించింది. ప్రాణాలకు తెగించి పోరాడే ఇలాంటి ప్రమాదకరమైన ఉద్యోగాల్లో మహిళలను నియమించడం ఇదే తొలిసారి. వీరికి అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించడం, ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులను క్షణాల్లోనే మట్టుబెట్టడం, స్వీయ రక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఇలాంటి దేశ, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని చెబుతున్నారు.

## నవ్వొక భౌతిక భావం!

**మనసులో కలిగే భావనల వల్ల వ్యక్తి నవ్వుతాడు. రకరకాలుగా దాన్ని ఆస్వాదిస్తాడు. అయితే భావనలు కాకుండా భావం గురించి చెప్పకుంటే అది భౌతికపరమైన చర్యలను ప్రతిబింబింపజేస్తుందని అమెరికా శాస్త్రవేత్తలు చెప్తున్నారు.**

నవ్వును అందించడంలో ఫిజికల్ రియాక్షన్స్ ఆధిపత్యం చెలాయిస్తాయట. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కన్సిన్ మెడిసన్ పరిశోధకులు నవ్వుపై అధ్యయనం చేశారు. నవ్వును మానసిక.. శారీరక చర్యలు ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో పరిశీలించారు. నవ్వు భౌతికంగా మూడు రకాలుగా మనసును డామినేట్ చేస్తుందని చెప్పారు. ఒక్కోసారి ఇది నెగెటివ్.. క్రిటికల్ భావాలను కూడా వ్యక్తపరుస్తుందట. కొందరి నవ్వులను మామూలుగా తీసుకోవాల్సి వస్తే కొందరి నవ్వులను తీవ్రంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాళ్లు స్పష్టం చేస్తున్నారు.




7. జిందగీ

Life is Beautiful

నమస్తే తెలంగాణ



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



హైదరాబాద్

శుక్రవారం 9 మార్చి 2018

WWW. NTNEWS.COM


**గెట్ టు గెదర్ పార్టీలకు ఏం వేసుకోవాలనుకున్నా.. ఫేర్‌వెల్ పార్టీల్లో తళుక్కున మెరువాలనుకున్నా.. కూల్‌గా ఉండే క్యాజువల్ డ్రెస్‌లు పర్‌ఫెక్ట్.. కాలేజీకి వెళ్లే అమ్మాయిలంతా అనార్కలీలకే ఓటేస్తున్నారు.. అందులో హై అండ్ లో డిజైన్‌లో వచ్చిన కొన్ని డ్రెస్‌లే ఇవి..**

# కూల్‌గా.. క్యాజువల్‌గా!

అందరిలో సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా ఉండేందుకు ఈ డ్రెస్ ఎంచుకోండి. పీచ్ కలర్ క్రేప్ మీద చెక్స్ వచ్చిన ఫ్యాబ్రిక్‌ని ఎంచుకున్నాం. దీనికి గోల్డ్ గోటా పట్టీ బార్డర్‌ని ఇచ్చాం. ఇక పైన రాయల్ బ్లూ కలర్ వెల్వెట్ మెటీరియల్ తీసుకున్నాం. దాని మీద జర్దోసీ, థ్రెడ్స్‌తో నెమళ్లను డిజైన్ చేశాం. తెల్లని నెట్ దుపట్టా మీద జర్దోసీ, థ్రెడ్స్‌తో నెమలి పించాలను ఇచ్చాం. గోటా పట్టీ బార్డర్ దీనికి అదనపు ఆకర్షణ.





ఈ ఎండాకాలంలో ఇది మీకు మరింత కంఫర్ట్‌ని ఇస్తుంది. రాయల్ బ్లూ కలర్ ఇక్కత్ కాటన్‌ని టాప్‌గా కుట్టాం. దీనికి హైనెక్‌తో హైలైట్ చేశాం. బార్డర్‌గా నల్లని రాసిల్క్ జతచేశాం. నల్లని సాఫ్ట్ నెట్‌కి కూడా నల్లని రాసిల్క్ బార్డర్ వేశాం. బ్లాక్ లెగ్గింగ్ దీనికి పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది.

తెల్లని సాఫ్ట్ నెట్ మీద పింక్ ఫ్లోరల్ డిజైన్‌ని ప్రింట్ చేయించాం. దాన్ని హై అండ్ లో కట్‌తో డిజైన్ చేశాం. దీనికి మధ్య భాగంలో పానీ వర్క్ చేసి మిర్రర్స్‌తో నింపేశాం. ఈ గౌన్ డ్రెస్‌కి పింక్ రాసిల్క్ బార్డర్ మీద గోటా పట్టీ బార్డర్‌ని జతచేయడంతో మరింత మెరిసిపోతున్నది. పింక్ కలర్ సాఫ్ట్ నెట్‌కి గోటా పట్టీ బార్డర్‌ని కుట్టాం.

సింపుల్ అండ్ స్వీట్‌గా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! గ్రీన్ అండ్ స్కైబ్లూ కలర్ 2డీ నెట్‌ని ఎంచుకొని హై అండ్ లో డిజైన్‌తో టాప్ కుట్టాం. దీనికి గోల్డ్, సిల్వర్‌తో వచ్చిన గోటా పట్టీ బార్డర్‌ని జతచేశాం. పైన ఆరెంజ్ కలర్ రాసిల్క్ మీద థ్రెడ్ వర్క్‌తో హైలైట్ చేశాం. నెక్‌లైన్, స్లీవ్స్‌కి [illegible] పైపింగ్ చేశాం. యెల్లో, [illegible] కాంబినేషన్‌లో టై అండ్ డై చేసిన నెట్ దుపట్టాతో అదిరిపోయే లుక్ వచ్చింది.



**వి. స్వాతి**
స్వాతి వెల్దండి డిజైన్ స్టూడియో
బంజారాహిల్స్, హైదరాబాద్
8179668098

బిట్స్ కార్నర్


## ఆటోతో స్వావలంబన!



**ఆమెది బాల్య వివాహం. బలవంతంగానే కాపురం చేసింది. కానీ కట్నం కోసం వేధింపులు.. దాడులు తప్పలేదు. ఎన్ని రోజులు భరించాలి? ఎంతకాలం సహించాలి? అని ఆవేదన చెందింది. అత్తింటి ఆరాళ్లు ఆగలేదు. పైగా ఆమెను చంపే ప్రయత్నం చేశారు. ఎలాగోలా అక్కడ్నుంచి బయటపడింది.**

ఆమె ఉత్తర భారతదేశంలోనే తొలి మహిళా ఆటోడ్రైవర్. పేరు సునితా చౌదరి. సౌత్ ఢిల్లీలోని మాల్వియా నగర్‌లో ఉంటున్నది. పొద్దున్నే లేచి తెల్లని ప్యాంటు.. షర్టు వేసుకొని ఆటోస్టాండ్‌కు వెళుతుంది. రోజుకు రూ.500 సంపాదిస్తూ సొంతంగా అభివృద్ధి చెందుతున్నది. ఎన్నో చీదరింపులు.. అవమానాలు.. ఆకలి బాధలు ఎదుర్కొని ఇప్పుడు నలుగురికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. మొదట్లో సునిత ఆటోను కొంతమంది కావాలనే పంచర్ చేసేవాళ్లు. భౌతికంగా దాడి చేసేవాళ్లు. ఆడవాళ్లకు ఆటో అవసరమా? అని హేళన చేసేవాళ్లు. లైసెన్స్ విషయంలో కూడా అన్నీ అడ్డంకులే. చావునే ఎదుర్కొని వచ్చిన తనకు ఇవన్నీ పెద్ద సమస్యలు కావని ఆత్మస్థైర్యం తెచ్చుకొని పురుషులకన్నా నమ్మకంతో ఆటో నడిపించడం ప్రారంభించింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై ముందుండి నిలబడి ఉద్యమం చేసింది. ప్రభుత్వంతో అయినా.. అధికారులతో అయినా ధైర్యంగా మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం.. డిమాండ్ల సాధనకోసం సునీత కృషి చేస్తున్నది. ఆటో డ్రైవర్స్ యూనియన్ ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై తనలాంటి మహిళలు ఆటోల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహిస్తున్నది సునీత.

## లిప్‌స్టిక్ చెదిరిపోకుండా..



- లిప్‌స్టిక్ ఎక్కువ సమయం ఉండాలనుకుంటే.. పెదవులపై మృత కణాలు తొలిగించాలి. దీనికోసం ఎక్స్‌ఫోలియేట్ చేసి మాయిశ్చరైజింగ్ లిప్ బామ్ పెదవులకు రాసుకోవాలి. ఆరోగ్యవంతమైన పెదవులపై లిప్‌స్టిక్ ఎక్కువ సేపు ఉంటుంది.
- లిప్‌లైనర్ ఎక్కువ సమయం ఉంటుంది. ఇందులో ఉండే మైనం పదార్థాలు పెదవులను అంటుకొని ఉంటాయి. అయితే లిప్‌స్టిక్ రంగు షేడ్‌కి దగ్గరల్లో ఉండే లిప్ పెన్సిల్ లేదా న్యూట్రల్ లిప్‌లైనర్‌ను వాడాలి. ఇది పెదవులకు మంచి ఆకారాన్ని ఇవ్వడంలో సహాయపడుతుంది.
- పెదవులకి బేస్ ఇచ్చే లిప్ ప్రైమర్‌ని వాడాలి. పెదవులను మృదువుగా మార్చి లిప్‌స్టిక్ రంగు చెదిరిపోకుండా ఉండేలా చేస్తుంది.
- బ్లాటింగ్ వల్ల అదనపు నూనెలు పీల్చుకోబడి లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉంటుంది. లిప్‌స్టిక్ వేసి శుభ్రమైన టిష్యూ పేపర్ తీసుకొని పెదవుల మధ్యలో ఉంచుకొని కొన్ని సెకన్లు ఒత్తి పట్టుకోవాలి. తర్వాత అదే లిప్‌స్టిక్ మరో కోటింగ్ వేస్తే ఎక్కువ కాలం నిలిచి ఉంటుంది.

## కాళ్లకు షుగరా?



అడుగండి చెబుతా

**నా వయసు 47. ట్రాక్టర్ నడిపిస్తాను. ఐదేళ్ల క్రితం నాకు షుగర్ వ్యాధి నిర్ధారించారు. మందులు వేసుకుంటూనే ఉన్నాను. కానీ కొద్ది నెలల నుంచి తరచూ కాళ్లలో తిమ్మిరిగా ఉంటున్నది. అరి కాళ్ల నుంచి పైకి మంటగా ఉంటున్నది. ఈ మధ్య ఒకసారి కాలు మీద ఇనుప కడ్డీ పడి గాయం అయ్యింది. కానీ అది నాకు తెలియనే లేదు. ఆ సంఘటనతో భయపడి డాక్టర్‌ను కలిశాను. డయాబెటిక్ ఫూట్ అని చెప్పారు. వైద్యం చేయించుకుంటున్నాను. కానీ కాళ్లలో డయాబెటిస్ ఏమిటో అర్థం కాలేదు. అసలు డయాబెటిస్ ఫూట్ అంటే ఏమిటి? దయచేసి పూర్తిగా వివరించండి.**

**జంపన్న, గంభీర్రావు పేట**

డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిలో చాలామందికి ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో డయాబెటిస్ ఫూట్ ముఖ్యమైంది. దీనిలో కాళ్లపైన పుళ్లు ఏర్పడతాయి. టైప్2 డయాబెటిస్‌లో వచ్చే ఈ అనారోగ్యాన్ని ముందుగా గుర్తించి వెంటనే చికిత్స చేయించుకున్న పక్షంలో దీర్ఘకాలంలో ఖర్చు తగ్గటమే కావకుండా మరినిన సమస్యలకు ఆస్కారం ఉండదు. కాలు తిమ్మిరిగా ఉండడం నొప్పి, వేడి, చల్లదనాలు గుర్తించలేకపోవడం, కాళ్లు మంటలు, కొద్దిపాటి బరువు కాలిపై పడినా కూడా భరించలేకపోవడం, కాలి కండరాలు బలహీనపడటం వంటి లక్షణాలతో డయాబెటిక్ ఫూట్‌ను ముందుగా గుర్తించవచ్చు. ఈ కారణాల వల్ల కాలికి దెబ్బతగిలినా తెలియదు. మరోవైపు ఆ గాయం మానకుండా పెద్దదవుతుంది. అల్సర్‌గా మారుతుంది. మధుమేహం వల్ల కాలికి జరిగే రక్త సరఫరాలో కూడా సమస్యలు ఎదురవుతాయి. తగినంత రక్తం సరఫరా కాకపోవడంతో గాయలు త్వరగా మానవు. గాంగ్రీన్‌గా మరే ప్రమాదం పొంచి ఉంటుంది. గుండెకు దూరంగా ఉండే రక్తనాళాల్లో వచ్చే సమస్య ఇది. కండరాలను నియంత్రించే నాడులు దెబ్బతినడం వల్ల కాలు నేలపై మోపినపుడు ఒత్తిడి కొన్ని భాగాలపైనే కేంద్రీకృతం అవుతుంది. కొన్ని చిన్నచిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా డయాబెటిస్ ఫూట్ నుంచి కాళ్లు, పాదాలను కాపాడుకోవచ్చు.

వెచ్చని నీళ్లు, సబ్బు ఉపయోగిస్తూ ప్రతిరోజు పాదాలను శుభ్రంగా కడుగాలి. పాదాలు ఎక్కువ సమయం పాటు నీళ్లలో నానకుండా జాగ్రత్త పడాలి. వేళ్ల మధ్య భాగాలతో సహా మొత్తం కాలు, పాదాన్ని తుడిచి పొడిగా ఉంచాలి. కాళ్లు, పాదాలపైన పుళ్లు, బొబ్బలు, కమిలిన ప్రదేశాలు ఏమైనా ఏర్పడ్డాయేమో ప్రతి రోజు పరీక్షించి చూసుకోవాలి. కాళ్లకు రక్త ప్రసరణకు సంబంధించిన సమస్యలు ఉన్నట్టయితే ఈ విషయంలో మరింత జాగ్రత్త పడడం అవసరం. ట్రాక్టర్ నడిపించేసమయంలో కాకుండా ఇంట్లో కూడా చెప్పులు వేసుకునే ఉండాలి. వీలైనంత వరకూ సాక్స్ వేసుకోండి. వేళ్లను కప్పి ఉంచగల చెప్పులు లేదా బూట్లు వాడడం మంచిది.



**డాక్టర్ దేవేందర్ సింగ్**
సీనియర్ వాస్క్యులార్ అండ్ ఎండోవాస్క్యులార్ సర్జన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
# చింతన
[ హైదరాబాద్ ]
శుక్రవారం 9 మార్చి 2018

ఉపనిషత్సుధ - 12

## ఆత్మవిద్య

పదార్థవాదం అన్నిటికీ సమాధానం ఇవ్వలేదు. ఆత్మవాది, ఆత్మవేది కాగల నచికేతసుడి వంటి వాడు యదార్థవాదం వైపు మనసును మరల్చుకున్నవాడు. కనుకనే సమవర్తి అయిన యముణ్ణి సమీపించ గలిగాడు. సంభాషించగలిగాడు. యమ ప్రశంసను పొందగలిగాడు..

''అహంకారం, అస్పష్టత, అవిద్య, ఆభిజాత్యం, అవివేకం వంటి వ్యతిరిక్త భావనలను ఎప్పటికప్పుడు తుడిచివేసుకోవాలి. చావులేనిది చదువని భావించి ఆత్మవిద్యను ఎరగాలి. ఒక మొగ్గ పరిణామ క్రమంలో పువ్వై,కాయై, పండై నిరంతర నిత్యోదయాన్ని అనుభవిస్తున్నది. మొగ్గ మొగ్గగా ఉన్నంతవరకు ఏ రంగు, రుచి, వాసన ఎరుగక ఉంటుంది. ఆ మొగ్గే పువ్వై తన సొబగులను, పరిమళాలను వెదజల్లుతున్నది. కాయై పక్వమవుతున్నది. పండై పరిపక్వ రసభరితమౌతున్నది. ఆ విధంగానే మనిషి రుషి కావాలి. బ్రహ్మర్షి కావాలి. దీనికి ఆత్మవిద్యను మించి మరొక విద్య లేదు.

దేహమే నేను అనుకోవడం నుండి నేను దేహం మాత్రమే కాదనుకుంటూ, నేను ఆత్మను అన్న ఎరుక లోకి రావాలి. ఇదే పారమార్థిక సార్థక మానవ జన్మ.



### ఆత్మభావమే జీవన పరమార్థం

జీవన సాఫల్యం అనుగ్రహించని ఏ సిద్ధాంతమైనా రాద్ధాంతమే. శుష్క వాదనలన్నీ వేదననే మిగుల్చుతయ్. శాస్త్రాలపై ఉన్న అధికారం ఒక్కొక్కసారి అంధత్వం వైపు, అహంకారం వైపు అడుగులు వేయిస్తుంది. ఇదొక ప్రమాదకరమైన మలుపు.

ఆ శాస్త్రాధికారమే ఆత్మవిద్యకు దారి చూపిస్తే అదొక కాంతిబాట అవుతుంది. ఆవిధంగానే భౌతిక సంపద కంటే ఆధ్యాత్మిక సిరి కదలనిది కానీ అన్నింటినీ కదిలించగలది. భౌతిక వస్తు సంపద అత్యంత పరిమిత శక్తి కలది. అది సుఖాన్ని ఇవ్వగలదు. ఆపై కొంత తాత్కాలిక సంతోషాన్ని మిగల్చగలదు. ఆనందాన్ని మాత్రం ఇవ్వలేదు. దానికి ఆ శక్తి లేదు. ఆత్మే సాక్షాత్తు ఆకారమై ఉన్నదన్న భావన స్థిరమైనప్పుడు దేహమాత్రుడను కున్నవాడు తన్ను తానే సరిదిద్దుకొని ఆత్మభావంతో మెలగటం ప్రారంభిస్తాడు. ఇదే జీవన పరమార్థం.

### మాధవత్వానికి పునాది

ఈ పరిణామంతో శరీరాన్ని పవిత్రమైన పనిముట్టుగా భావించి, ధర్మబద్ధమైన కార్యాచరణ ప్రారంభం అవుతుంది. ఇక నెమ్మదిగా అన్ని కలాపాలు ఆత్మ చలనాలుగా, విశ్వశ్రేయోదాయకంగా సాగుతయ్. ఆ కారణంగా శాంతి, సహనం, ప్రేమ, సహజీవన సౌందర్యం వంటి మానవీయ భావనలు బహిర్గతమై ప్రపంచాన్ని సౌందర్యమయంగా ఆవిష్కరిస్తూనే దానినొక కర్మక్షేత్రంగా మారుస్తయ్.

కర్మ ఫలాలను అందరికీ పంచగల విశాల భావనను, త్యాగనిరతిని, నిరతిశయానందాన్ని పరిచయం చేస్తయ్. నిజానికిదే నిజ పరిణామం! ఈ ప్రాప్తి ప్రతి వ్యక్తికి కలగాలి. మానవత్వం పరిమళిస్తే అదే మాధవత్వం అవుతుంది. ప్రపంచం తన నడకను బాహ్యంగా మానవత్వంలోనూ ఆంతరంగికంగా మాధవత్వం లోనూ సాగించగలిగితే అదే అసలైన మానవ జీవితం.

పవిత్రంగా భావింపబడిన శరీరం నాశమెరిగినది. నాశమెరుగని ఆత్మతో కూడి ఉన్నా దేని స్థితి దానిదే. ఒకటి పోయేది. రెండవది ఎప్పటికీ పోనిది. ఆ రెండవదే మనం అన్న భావనతో జీవితం ప్రవహించాలి. అలుపు లేని ఆగని అందని ప్రయాణమే మానవ జీవితం. గతంలో నుంచి స్ఫూర్తిని పొందుతూ వర్తమానాన్ని వెలిగించుకుంటూ ముందుకు సాగాలి.

విచక్షణ, వివేకం, అన్వేషణ, ఆత్మాన్వేషణ ఆనందాన్ని కలిగిస్తయ్. ఆత్మ విద్య స్థిర బుద్ధిని, సంస్థిత స్థితిని కలిగించి మనిషిని అమరుణ్ణి చేస్తుంది''.

'నచికేతా! కాలబద్ధుడైన మానవుడు ఆత్మవిద్యను ఎరుగకపోతే నా పాశబద్ధుడవుతూనే ఉంటాడు. ఈ సూక్ష్మాన్ని గ్రహించినవాడు శాశ్వతుడౌతాడు. చైతన్యమై ప్రకాశిస్తాడు' అన్నాడు సమవర్తి.

విషయం అర్థమవుతున్నట్లుగా తల పంకించాడు నచికేతుడు.

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఖురాన్ మాట

## శీలసంపదే సాఫల్యానికి సోపానం



సంపద, అధికారం, పలుకుబడి ఈ అన్నింటికంటే శీలం అత్యంత ప్రధానమైంది. ఎంత సంపాదించినా, ఎన్ని అధికారాలు అనుభవించినా మనిషిలో మంచి, మానవీయ సుగుణాలు లేకపోతే జీవితం నిరర్థకం. ఈనాడు చాలామంది సంపదే సర్వస్వమని, అధికారమే పరమావధి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరైన విధానం కాదు. ఇవన్నీ ఈరోజు ఉండి, రేపు పోయే తాత్కాలిక పటాటోపాలే. చివరికి మిగిలేది మంచి, మానవీయ సుగుణాలు మాత్రమే.

ఈనాడు సంపాదన విషయంలో అధికారం, హోదా విషయంలో పోటీ పెరిగిపోయింది. 'అక్రమం, సక్రమం' అన్న విచక్షణ లేకుండా అందిన వరకు దండుకోవడమే జీవనధ్యేయంగా మారిపోయింది. అలా కాకుండా మంచి పనుల్లో, సమాజ శ్రేయస్సుకు ఉపకరించే కార్యక్రమాల్లో ఒకరికొకరు పోటీ పడాలి. అంటే, ఒకరు ఒక సత్కార్యం చేస్తే అది చూసి మరొకరు అంతకంటే ఎక్కువ సత్కార్యాలు ఆచరించాలి. ఒకరు పది రూపాయలు దానం చేస్తే, మరొకరు ఇరవై రూపాయలు దైవమార్గంలో వెచ్చించడానికి ప్రయత్నించాలి. పోటీ గనక ఉంటే సత్కార్యాల్లోనే ఉండాలి తప్ప, ప్రాపంచిక వ్యవహారాల్లో కాదు. మన పూర్వీకులు ఇలాంటి ఆదర్శాలనే నెలకొల్పారు. దైవమార్గంలో తమ ధనాన్ని త్యాగం చేయాల్సిన అవసరం ఏర్పడినప్పుడు హజ్రత్ ఉమర్ (ర) తన సంపదలో సగానికి సగం తెచ్చి ప్రవక్త మహనీయుల వారి ముందు రాశి పోశారు. హజ్రత్ అబూబకర్ సిద్దిఖ్ (ర) తన మొత్తం సంపదనూ దైవమార్గంలో త్యాగం చేశారు. ఇదీ నిబద్ధత అంటే. ఇదీ త్యాగం అంటే.

సృష్టి మొత్తం దేవుని కుటుంబం. మానవుడూ ఈ సృష్టిలోని భాగమే. అందుకని సృష్టిలోని ఏ ప్రాణికి సేవ చేసినా అది దైవానికి అందుతుంది. ఇలాంటి సత్కార్యాలకు దైవం అమితంగా సంతోషిస్తాడు. అనంతమైన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. అందుకని ఈరోజు ఉండి, రేపు పోయే తాత్కాలిక మెరుగులకు లోనుకాకుండా ఇహలోక ప్రయోజనాలతో పాటు పరలోక సాఫల్యాన్నీ సాధించిపెట్టగల కార్యాలపై దృష్టి సారించాలి. అంటే సంపాదనవైపు దృష్టి సారించవద్దని, ప్రపంచాన్ని త్యజించమని అర్థం కాదు. మంచీ చెడు, ధర్మం అధర్మం లాంటి విషయాలను మర్చిపోకూడదు. విచక్షణా జ్ఞానాన్ని కోల్పోకూడదు. మానవీయ విలువల్ని కాలరాయకూడదు. అన్యాయానికి, అధర్మానికి పాల్పడకుండా, ఒకరి కడుపు కొట్టకుండా, ధర్మ సమ్మతమైన మార్గంలో, నైతిక, ధార్మిక పరిధుల్ని అతిక్రమించకుండా ఎంతైనా సంపాదించవచ్చు.

నిజాయతీగా, నిబద్ధతతో, నిస్వార్థంతో దైవప్రసన్నతా కాంక్షతో ప్రజాసేవ చెయ్యాలన్న బలమైన సంకల్పం ఎంతో కొంత పట్టించుకోగలిగితే అటువంటి సంపాదన, అధికారం ఎంతైనా ప్రశంసించదగ్గది. దైవప్రసన్నతకు యోగ్యం కాగలదని ఆశించవచ్చు.

... మదీహా అర్జుమంద్

జీవన మార్గం..



# భీష్మోపదేశం

అంపశయ్య మీద భీష్మ పితామహుడు.. అవసాన దశలో ఉన్న ఆయన్ని చూడాలన్న కోరికతో వస్తాడు ధర్మరాజు. కృష్ణ భగవానుడు ఇచ్చిన ప్రోద్బలంతో, ఆయన ఇచ్చిన శక్తితో ధర్మరాజుకు ధర్మోపదేశం చేస్తాడు. వీటిలో నూట ముప్పది అధ్యాయాల్లో రాజ ధర్మాన్ని, నలభై మూడు అధ్యాయాల్లో ఆపద్ధర్మాన్ని తన జ్ఞాన దృష్టితో వివరిస్తాడు. ధర్మరాజు భీష్మగీత ద్వారా రాజధర్మమూ, ఆపద్ధర్మమూ, మోక్షధర్మము అని మూడు పర్వాలుగా గ్రహించాడు. లోకానికి అందించాడు. ఆ భీష్మోపదేశం రాజైనవాడికి మాత్రమే కాదు.. సామాన్యులమైన మనకు కూడా అనేక రకాలుగా మార్గదర్శనం చేస్తుంది. ధర్మ మార్గాచరణను సూచిస్తుంది. భీష్ముడు చేసిన ఆ ధర్మ ప్రబోధంలో మచ్చుకు కొన్ని..

అంపశయ్య మీద ఉన్న భీష్ముని చూడాలని చెప్పగానే అనుకున్నదే తడవుగా సాయంత్ర సమయంలో బయలుదేరుతారు. శ్రీకృష్ణుడు మెల్లగా భీష్ముని సమీపించి దివ్య వాక్కులతో సంభాషించగానే భీష్ముడు కళ్లు తెరిచి వాసుదేవునికి చేతులు జోడించి రెప్పవేయకుండా ఆయన్నే చూస్తూ, ''శ్రీకృష్ణా! విశ్వమంతా వ్యాపించి ఉన్న నీ రూపమే నాకు కనబడుతున్నది. ఇంకేమీ గోచరించడం లేదు అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు, 'భీష్మాచార్యా! నాయందు నీకున్న అపార భక్తి వలన అంత్యకాలమున నీకు నా దివ్యరూపం గోచరమగుచున్నది. నీవు తిరిగి రావాల్సిన అగత్యం లేని లోకాలు నీ కొరకు ఎదురుచూస్తున్నాయి. ఇక మాసం రోజుల్లో సూర్య భగవానుడు ఉత్తర దిక్కుకు మరలే సమయం ఆసన్నమౌతున్నది. అప్పుడే నీ ప్రయాణం' అని చెప్తూ 'భీష్మ పితామహా! నీ మనుమడు ధర్మరాజు బంధుమిత్రుల వరుస మరణాలతో కలత చెంది ఉన్నాడు. అతనికి ధర్మశాస్త్ర రహస్యాలు చెప్పి ఊరడించు' అని అడిగాడు. ఆయనకు కావలసిన శక్తి ప్రసాదించాడు. జ్ఞాననేత్రాన్ని అనుగ్రహించాడు. ఈలోపు సూర్యుడు అస్తమించగా మరునాడు వస్తామని చెప్పి అందరూ వెళ్లిపోయారు. మరునాడు ఉదయాన్నే ముందురోజు వచ్చిన వాళ్లందరూ అక్కడకు చేరారు. భీష్ముడి చుట్టూ వ్యాసభగవానుడితో పాటు సప్తఋషులు కూడా ఉన్నారు. ఆయన దేవగణాలతో ఉన్న బ్రహ్మ దేవునిలాగా శోభిస్తున్నాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుతో, 'ధర్మజా! భీష్ముడు ఇంకా ఇరువది తొమ్మిది రోజులు మాత్రమే మన మధ్య ఉంటారు. నీకున్న సంశయాలన్నీ ఈలోపు నివృత్తి చేసుకో' అని చెప్పాడు. అప్పుడు భీష్ముడు 'కృష్ణా! అన్నీ తెలిసిన సర్వజ్ఞుడవు. నీవే పాండవుల చెలికాడివి. నా చేత ప్రత్యేకంగా చెప్పించాల్సిన కారణమేమిటి?' అని ఆర్ద్రంగా అడిగాడు.

దానికి కృష్ణుడు, 'నీవంటి ఏకసంథాగ్రాహి, ఇంద్రియ నిగ్రహపరుడు, ధర్మ నియమాలు పాటించేవాడు మరొకడు లేడు. ఇప్పుడు వారికి నీవు చెప్పబోయే ధర్మసూక్ష్మాల ద్వారా నీ కీర్తి అజరామరంగా ఉండేందుకు నీ చేత ఈ విషయాలు ప్రత్యేకంగా చెప్పిస్తున్నాను. పితామహా! నీవు చెప్పే విషయమంతా వేద వాక్యమై వర్ధిల్లుతుంది. ధర్మమార్గంలో కరదీపిక వలె నిలుస్తుంది' అని సాదరంగా పలికాడు.

భీష్ముడు చెప్పనారంభించాడు 'ధర్మజా! ముందుగా రణరంగంలో నీవు చేసిన సంహారాలు, దోషాలు ఎందుకు కావో ప్రస్తావిస్తాను. తాతలు, తండ్రులు, అన్నదమ్ములు, గురువులు ఎవరైనా ధర్మం తప్పి ప్రవర్తిస్తే వారిని రణరంగంలో వధించడం పాపం కాదు. 'ఈ తొలిపలుకులు వినగానే, ధర్మజుడు తనలో ఉన్న బిడియాన్ని పక్కనబెట్టి తాతగారి దగ్గరగా వచ్చి ఆయన పాదాలు పట్టుకున్నాడు. భీష్ముడు ఎంతో సంతోషించి, 'నీకున్న సందేహాలు భయపడకుండా అడుగు నాయనా!' అన్నాడు.

ధర్మరాజు అక్కడ ఉన్న పెద్దలందరికీ నమస్కరించి, 'తాతా! నాకు ముందుగా రాజధర్మాన్ని బోధించండి. ధర్మవిధుల్లో మిమ్ములను మించినవారు ఎవరూ లేరు కదా' అన్నాడు.

### ఇదే రాజధర్మం

ధర్మం మొదటగా వేదవిదులైన మహాత్ముల నుండి వారి వాక్కు ద్వారా పుడుతుంది. కాబట్టి ఏ రాజైనా, యజ్ఞయాగాలు నిర్వహించేవారిని, వేదాంతులని, పండితులని హింసించరాదు. నీచులను శిక్షించడంలో వెనుకంజ వేయరాదు. వారి యెడల క్షమాగుణం పనికిరాదు. నీచులను క్షమిస్తే రాజ సింహాసనానికి భంగం వాటిల్లుతుంది. రాజు పూవు వలె మెత్తగా ఉండరాదు. పాషాణం వలె కర్కశంగానూ ఉండరాదు. గ్రీష్మతాపం వలె ఉండాలి. రాజు గర్భవతి అయిన స్త్రీ లాగా మెలగాలి. కడుపులో ఉన్న బిడ్డ క్షేమం కోసం స్త్రీ ఎలా త్యాగాలు చేస్తుందో, రాజు కూడా ప్రజలకు మేలు చేయడానికి కొన్ని త్యాగాలు చేయాలి. సేవకులతో రాజు పరిహాసాలు ఆడరాదు. రాజు చులకన అవుతాడు. చులకన అయితే వారిచే పని చేయించుకోలేడు.

తండ్రి ముందు తనయులు ఎంత సంతోషంగా ప్రవర్తిస్తారో రాజ్యంలో ప్రజలు కూడా రాజుగారి నీడలో సంతోషంగా ఉండేటట్లు ప్రవర్తించాలి. రాజు ఇంద్రియ నిగ్రహం కలవాడై ఉండాలి. బిచ్చగాళ్లను, సంఘ విద్రోహకార శక్తులను రాజ్యంలోకి చొరబడకుండా చూడాలి. రాజ్యంలో ఆకలిచావులు లేకుండా చూడాలి. కళలను పోషించాలి. గొప్ప కార్యాలను నిర్వహించినవారిని సన్మానించాలి.

రాజ్యంలో హింస ప్రజ్వరిల్లితే ఉక్కుపాదంతో అణచివేయాలి. మేధావి వర్గాన్ని పోషించాలి. వారు అవినీతిపరులు కాకుండా చూసుకోవాలి. పాలిచ్చే గోవు ఆలనా పాలనా చూసేవాడు ఆవుపాలను సమృద్ధిగా పొందుతాడు. ప్రజలను సురక్షితంగా, సుభిక్షంగా ఉంచే ప్రభువు ప్రజల మన్ననలను పొందుతాడు. ధనాగారం లోటు లేకుండా ఉంటుంది' అంటూ అనేక విషయాలు రాజధర్మంగా చెప్పాడు భీష్మ పితామహులు.

### శత్రువు శత్రువు మిత్రుడే!

'పితామహా! బలవంతుడైన శత్రువు చేతికి దుర్బలుడైన రాజు చిక్కినప్పుడు అతడు ఏ విధంగా చేయాలి?' అని ధర్మరాజు ప్రశ్నించగా భీష్ముడు ఆపద్ధర్మం గురించి చెబుతూ, 'ధర్మజా! బలవంతుడైన రాజు విజయశీలుడు, ధర్మవ్రతుడు, నియమనిష్ఠుడు అయితే అతనితో సాధ్యమైనంతవరకు యుద్ధానికి దిగకుండా సంధి చేసుకోవడం మంచిది. ఒకవేళ అతడు అధర్మపరుడు, అసత్యవర్తనుడు, అహంభావి అయితే కొంత భూభాగాన్ని అతనికి సమర్పించి, తాత్కాలికంగా సమస్య చక్కదిద్దుకోవాలి. శక్తి కూడగట్టుకుని అతనిపై యుద్ధభేరి మ్రోగించవచ్చు' అని చెప్పాడు.

'మహాత్మా! బలవంతులైన అనేకమంది శత్రువులు ఒకేసారి మీదకు వస్తున్నట్లు తెలిస్తే అప్పుడు చేయాల్సిన కార్యం ఏమిటి?' అని అడిగాడు ధర్మరాజు. 'ధర్మజా! అట్టి సమయంలో వారిలో బలవంతుడైనవానితో స్నేహం అభినయించి మిగిలినవారిని అతనికి దూరం చేసి, తరువాత తగిన సమయంలో అతనిని కూడా మట్టుబెట్టాలి. దీనికి ఉదాహరణగా ఒక కథ చెబుతాను విను...

**ఒక అరణ్యంలో మర్రిచెట్టు కలుగులో పలితమనే ఎలుక ఉండేది. అదే మర్రిచెట్టుపై లోమశమనే పిల్లి ఉండేది. ఒకనాడు బోయవాడు పన్నిన వలలో లోమశం చిక్కింది. తన శత్రువు వలలలో చిక్కింది కదా అని పలితం అనే ఎలుక నిర్భయంగా చెట్టు చుట్టూ తిరుగుతూ కాలక్షేపం చెయ్యసాగింది. ఆ చుట్టూ తిరుగుతున్న సమయంలో హరిణమనే ముంగిస ఈ ఎలుకను తినాలని ఉబలాటపడింది. సరిగ్గా అదే సమయానికి చెట్టు మీద చంద్రకమనే గుడ్లగూబ తదేకంగా ఎలుక వైపు చూస్తున్నది ఎగరేసుకు వెళదామని. ఎలుకకు ఎటుచూసినా శత్రువులే!**



పలితము చురుగ్గా ఆలోచించింది. వలలో ఉన్న మార్జాలమే ప్రస్తుతం తనను ఆదుకునేవాడని తలచి వెంటనే వెళ్లి, వలలో ఉన్న దాన్ని గట్టిగా కౌగలించుకుని మిత్రమా! నేను నీతో ఎప్పటినుంచో స్నేహం చేద్దామనుకున్నాను. ఇప్పటికి దగ్గరగా వచ్చి మాట్లాడే అవకాశం కలిగింది.. అని అంటూ దానితో ఇచ్చకపు మాటలు మాట్లాడసాగింది. ఈ సన్నివేశం, ఆ స్నేహం చూసి గుడ్లగూబ, ముంగిస అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఆ రెండూ వెళ్లిపోగానే తనను కాపాడిన మార్జాలాన్ని రక్షించడానికి దాని బంధనాలను మెల్లగా కొరకసాగింది. 'మిత్రమా! త్వరగా నన్ను వలలో నుండి బయటకు తీయి. బోయవాడు వస్తే నన్ను చంపేస్తాడు' అని గట్టిగా ప్రాధేయపడుతున్నది.

అయితే ఎలుక మాత్రం నిదానంగా, 'మిత్రమా! నిన్ను ఇపుడే బయటకు వదిలితే నీ చూపు నాపై పడి నన్ను చంపేస్తావు. బోయవాడు అల్లంత దూరాన కనబడినప్పుడు నిన్ను విముక్తుడిని చేస్తాను, ఎందుకంటే ఆసమయంలో నీ దృష్టి బోయవాని నుండి ఎలా తప్పించుకోవాలా అని ఆత్మరక్షణ ధ్యాసలో ఉంటుంది. నాకు హాని చేయవు' అని స్పష్టంగా చెప్పి, తెల్లవారిన తరువాత కనుచూపు మేరలోకి బోయవాడు రాగానే వల త్రాళ్లను పటపటా కొరికి వెళ్లి కలుగులో దూరింది. అలా రెండూ రక్షింపబడ్డాయి.

'ధర్మజా! మన ప్రయోజనాన్ని బట్టి మిత్రుత్వము, శత్రుత్వము ఏర్పడుతుంది. శాశ్వత మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరు. అవసరమైనప్పుడు శత్రువుతో కూడా చెలిమి చేయాలి. అది ఉభయ ప్రయోజనకరంగా ఉంటే దుష్ప్రభావం ఉండదు. ఇరువురి ప్రయోజనం అయిపోగానే శత్రువును దూరంగా పెట్టాలి' అని చెబుతూ, 'ధర్మరాజా! ఆపదలనేవి చెప్పి రావు. అకస్మాత్తుగా వచ్చి పడేవే ఆపదలు. శత్రువులకు శత్రువులెవరో తెలుసుకుంటూ వారితో స్నేహంగా ఉండాలి. మన గూఢచారుల మీద కూడా ఒక కన్ను వేసి ఉంచాలి వారు శత్రువులతో కలువకుండా. అతిగా ఎవరినీ నమ్మకూడదు. పలు పరీక్షల తరువాతే ఆంతరంగికులుగా చేర్చుకోవాలి.

ఋణశేషం, అగ్నిశేషం, శత్రుశేషం ఉండకూడదు. ఈ మూడింటిలో ఏది కొంచెం మిగిలినా వృద్ధి చెందే అవకాశం ఉన్నది. అలాగని ఎవరిపైనా అనవసర ద్వేషం పెంచుకోగూడదు. మేధావులతో ద్వేషించి, వారు దూరంగా ఉంటే ఏమీ చేయలేరు అనుకోవద్దు. వాళ్ల బాహువులు చాలా పొడవుగా ఉంటాయి. ఎక్కడ ఉన్నా వారు హాని చేయగలరు.

... గండవరపు ప్రభాకర్
బొమ్మలు : మృత్యుంజయ

### శత్రువులెవరు?

మిత్రులెవరో, శత్రువులెవరో రాజు పసిగట్టగలగాలి. మిత్రుల రూపంలో శత్రువులు ఉండే అవకాశం ఉన్నది. స్వార్థం ఎంతపని అయినా చేయిస్తుంది. అలాంటి ఒక కథ..

ఒక బ్రాహ్మణుడికి లేకలేక పుట్టిన ఒక పిల్లవాడు ముద్దుగారే వయసులోనే అరిష్టాల వల్ల మరణించాడు. వీడిని శ్మశానంలో ఉంచి గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. పిల్లవాడి ముద్దు మాటలు తలుచుకుంటూ పరితపిస్తున్నారు. ఆ సమయంలో ఆకాశంలో ఎగురుతున్న గ్రద్ద ఒకటి 'నాయనలారా! మీ దుఃఖాన్ని చూడలేకపోతున్నాను. పోయినవాడు తిరిగి రాడు కదా. చీకటి పడుతున్నది. మీరు బయలుదేరండి. రాత్రిపూట ఇక్కడ ఉండడం క్షేమం గాదు' అని చెప్పింది. అది ఎంతో స్నేహంగా చెబుతున్న మాటలకు వచ్చిన వారు బాలుని దేహాన్ని వదిలివెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. ఇంతలో ఒక నక్క అక్కడికి వచ్చి, 'అయ్యో! అప్పుడే వెళ్లిపోతున్నారా! తనివితీరా ఏడవండి. మీ ఏడుపులకు పునర్జన్మ వచ్చినా రావొచ్చు పిల్లవానికి' అని చెప్పింది. ఇదీ బాగానే ఉన్నదనుకుని మళ్లీ బాలుని ముందు కూర్చుని రోదించసాగారు.

'ధర్మరాజా! ఆ గ్రద్దకు గానీ, నక్కకు గానీ వారిపై ఏ ప్రేమా లేదు. చీకటి పడే ముందు వారు వెళ్తే గ్రద్దకు విందు దొరుకుతుంది. చీకటి పడిన తరువాత గ్రద్ద నిస్సహాయంగా వెళ్లిపోతుంది. ఆ బాలుడు నక్కకు ఆహారమౌతాడు. వాటికి బ్రాహ్మణుల మీద ఉన్న ప్రేమ అంతవరకే. బాలుని తండ్రి శివభక్తుడు. ఇదంతా చూసి వ్యాకులపడి, కాలకంఠుని బిగ్గరగా రోదిస్తూ స్తుతించి బాలుని బ్రతికించమని ప్రాధేయపడ్డాడు. శివుడు ప్రత్యక్షమై బాలుని బ్రతికించి, ఆ బ్రాహ్మణుని ఆశీర్వదించాడు. గ్రద్ద, నక్క అక్కడి నుండి పారిపోయాయి.

ఆపద సమయంలో, దిక్కుతోచనప్పుడు శత్రువులు మిత్రులలాగే గోచరిస్తూ ఉంటారు. మనం వివేకం చూపించవలసిన సమయం అదే' అని చెప్పాడు భీష్ముడు.

సువార్త

## గొప్పలు వద్దు..




ఉన్న విషయాన్ని ఉన్నట్టుగా కాకుండా ఎక్కువ చేసి చెప్పడం సాధారణ మనుషుల స్వభావం. తనను తాను గొప్పగా చూపించుకోవడమే దీని వెనుక ఉద్దేశం. 'అహంకారులై యుండకుడి.. పొగరు పట్టిన మాటలాడకుడని భక్తిహీనుల గురించి ఆజ్ఞ ఇచ్చుచున్నాను. దేవుడే తీర్పు తీర్చువాడు. ఆయన ఒకని తగ్గించును. ఒకని హెచ్చించును' అని బైబిల్ (కీర్తనలు 74:4-6)లో రాయబడింది. 'మా అబ్బాయి రాజు, వాడి ఫ్రెండ్స్ అందరిలోను తెలివైనవాడు', 'వీరందరికన్నా మాలతిది ఎంతో మంచి స్వభావము' అని కొందరు తల్లులు తమ పిల్లల గురించి మంచిగా చెప్తూనే ఇతర పిల్లల గురించి తక్కువ చేసి చెప్తారు. తన గురించి తానే అహంకారంతో గొప్పలు చెప్పుకున్న ఒకరాజు చివరికి మృగంగా మారిపోయిన విషయాన్ని బైబిల్ వివరించింది. చాలాకాలం క్రితం ఈ రాజు బబులోను రాజ్యంలో ఉండేవాడు. ఈయన పేరు నెబుకద్నెజరు. ఆ కాలంలో చాలా బలవంతుడైనవాడు. నెబుకద్నెజరు తనకొరకు ఆకాశము నంటుతున్నదా అన్నట్లుండే ఒక గోపురం కట్టించుకున్నాడు. 'బబులోను అనే ఈ మహావిశాల పట్టణం బలాధికారం, నా ప్రభావ ఘనతను కనబచరుటకై నేను కట్టించింది కదా' అని గర్వంగా పలికాడు. అయితే పరలోకం ఒక స్వరం వినిపించింది 'రాజగు నెబుకద్నెజరూ! ఇదే నీకు ప్రకటన. నీ రాజ్యం నీ నుండి తొలగిపోయెను. తమ నుండి మనుషులు నిన్ను తరిమెదరు. నీవు అడవి జంతువుల మధ్య నివాసం చేస్తూ పశువుల వలె గడ్డిమేసెదవు. సర్వోన్నతుడైన దేవుడు మానవుల రాజ్యంపై అధికారియై యుండి తానెవరికి దానిని అనుగ్రహించ నిశ్చయించునో వారికనుగ్రహించునని నీవు తెలుసుకొనువరకు ఏడు కాలములు నీకీలాగు జరుగును అని చెప్పెను' (దానియేలు 4:30-32). తనకు తానే గొప్పలు చెప్పుకున్న రాజు జంతువులా మారిపోయాడు. తమకు తాము గొప్పలు చెప్పుకోవద్దు, మన స్వభావాన్ని, గుణాన్ని చూసి ఇతరులు మన గురించి మాట్లాడుకోవాలి. 'రేపటి దినమును గురించి అతిశయపడకుము. ఏ దినమున ఏమి సంభవించునో నీకు తెలియదు. నీ నోరు కాదు అన్యుడే, నీ పెదవులు కాదు పరులే నిన్ను పొగడదగును' (సామెతలు 27:12) అని బైబిల్ చెప్తుంది.

... జాషువా

నమస్తే తెలంగాణ
విహారం
[ హైదరాబాద్ ]
శుక్రవారం 9 మార్చి 2018

పర్యాటక ప్రదేశాలంటే కనులవిందుగా ఉండాలి. మనసును ఆహ్లాదపరిచేవిగా ఉండాలి. సగటు పర్యాటకుడి ఆలోచన ఇలాగే ఉంటుంది. మరి ఆ కనులవిందు వెనుక కనిపించని భయానకం ఉంటే! ఆ ఆహ్లాదం వెనుక ఆందోళన కలిగించే అంశాలే ఉంటే! ఆ ట్రిప్పు రొటీన్‌కు భిన్నంగా సాగినట్టే. అలాంటి అందమైన భయానక ప్రదేశాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. ఆ లోకేషన్లేమిటో, వాటి విశేషాలేమిటో, సర్‌ప్రైజ్ చేసే సంగతులేమిటో తెలుసుకోవాలంటే ఈ వారం విహారంలో మునిగి తేలాల్సిందే.



# భయానకం.. ఈ ప్రయాణం



## మదిడి నేషనల్ పార్క్, బొలీవియా

తొలిచూపులోనే పర్యాటకులను ప్రేమలో పడేసేంత అందంగా ఉంటుందీ ప్రదేశం. బొలీవియాలో ఉండే అందమైన ఈ పార్కు అత్యంత ప్రమాదకరమైనది. ఇక్కడ కనిపించే పచ్చదనం, ఇతర జీవరాశులన్నీ విష తుల్యమైనవే. పొరపాటున ఏది ముట్టుకున్నా రకరకాల చర్మవ్యాధులతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఏ చిన్న గాయమైనా అక్కడి ఉష్ణమండల పరాన్నజీవులు శరీరంలోకి చొరబడి భారీ ఇన్‌ఫెక్షన్లకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. చూడడానికి మాత్రం అత్యంత సుందరమైన ప్రదేశంగా కనిపించే ఈ పార్క్‌ను సందర్శించాలంటే చాలా డేర్ చేయాలి మరి.



## అఫర్ డిప్రెషన్, ఇథియోపియా

ఇథియోపియాలోని అఫర్ రీజియన్‌లో కనిపించే ఎర్టా ఎలీ వాల్కనో ఇది. ప్రపంచంలోని భయంకరమైన అగ్నిపర్వతాలలో ఇదీ ఒకటి. ఈ ప్రాంతాన్ని నిరంతరం చిన్న చిన్న భూకంపాలు వణికిస్తూనే ఉంటాయి. ఇక్కడొక వింతను చూడొచ్చు. ఎర్టా అలే అగ్ని పర్వత శిఖరాగ్రంలో రెండు లావా సరస్సులు ఏర్పడుతాయి. వీటిలో నిరంతరం మారుతూనే ఉంటుంది. దీని వల్ల భూ ఉపరితరం పైకి, కిందకూ కదులుతూ ఉంటుంది. ఇక్కడికి వెళ్లడమంటే జీవితకాలపు సాహసానికి ఒడిగట్టినట్టే.

## నట్రోన్ సరస్సు, టాంజానియా

చూడ్డానికి భూలోకేతర సుందర దృశ్యంగా కనిపించినా, నిజానికిది టాంజానియాలోని నట్రోన్ సరస్సు చిత్రం. ఈ నదీ ఉపరితలంపై పేరుకుపోయిన ఉప్పు చాలా ప్రమాదకరం. దీనిని ముట్టుకున్నంతనే జీవరాశులు మృత్యువాత పడుతాయంటే దీని గాఢతను అర్థం చేసుకోవచ్చు. కానీ చూసేందుకు రెండు కనులూ చాలని అద్భుత దృశ్యకావ్యం ఈ సరస్సు. అయితే దీని ఉపరితలం నుంచి వచ్చే హైడ్రోజన్ సల్ఫైడ్ వాసన ఒక్క క్షణం కూడా అక్కడ నిలువనివ్వదు. ప్రత్యేకమైన ఏర్పాట్లతో అత్యంత తక్కువ సమయాన్ని(కొన్ని క్షణాలు) మాత్రమే అక్కడ కేటాయించగలం. ఒక్కోసారి అది కూడా సాధ్యం కాకపోవచ్చు.



## బికినీ ఎటాల్, మార్ష్ ఐల్యాండ్

సముద్ర తీరాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. మార్షన్ ఐల్యాండ్‌లోని బికినీ ఎటాల్ మాత్రం అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా మారిపోయింది. ఎందుకంటే ఇది అనేకమైన అణుపరీక్షా కార్యక్రమాలకు వేదికగా మారిపోయింది. దీంతో అసాధారణమైన రేడియోధార్మికత విడుదలై జీవరాశుల మనుగడే ప్రశ్నార్థకమైంది. ఇక్కడ జీవించే ప్రజలు బలవంతంగా ఇక్కణ్నుంచి పంపివేయబడ్డారు. నేటికీ అది మానవ రహిత సముద్రతీరంగా ఉండిపోయింది. ఇక్కడ విడుదలయ్యే విపరీతమైన రేడియేషన్ క్యాన్సర్ సోకేందుకు కారణమవుతుందట.



## స్నేక్ ఐల్యాండ్, బ్రెజిల్

ఎక్కడో మూలన విసిరేసినట్టుగా ఉండే ఈ ద్వీపం.. భూ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా గుర్తింపు పొందింది. దీనికి కారణం ఈ ప్రాంతమంతా విషపూరితమైన బోత్‌రాప్ పాములతో నిండిపోవడమే. పరిశోధకులు చెబుతున్న దాని ప్రకారం ఇక్కడ ఒక్క స్క్వేర్ మీటర్‌కు ఐదుపాముల చొప్పున ఉన్నాయట. చాలామంది ఈ పాములు కరిచి మృతి చెందినట్టు కథకథలుగా చెప్పుకుంటూ ఉంటారు. ఇక్కడున్న లైట్‌హౌజ్ సంరక్షుడు ఈ పాముల దాడిలోనే ప్రాణాలు కోల్పోయాడు. అందుకే బ్రెజిల్ ప్రభుత్వం ఇక్కడ పర్యాటకుల సందర్శనను నిషేధించింది.



## సినాబంగ్ అగ్నిపర్వతం, ఇండోనేషియా

చూడ్డానికి దృశ్యమనోహరంగా అనిపించే ఈ అగ్నిపర్వతాన్ని కలిగిన సుమత్ర ఐల్యాండ్.. ఇండోనేషియాలోనే అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. ఇక్కడ మరో ఉదయానికి భరోసా ఉండదు. తరచూ విస్ఫోటనాలు జరుగుతూనే ఉంటాయి. పరిసర ప్రాంతాల్లో ఉండే వేల మంది జనాలు జీవనోపాధి లేక, తలదాచుకొనే గూడు కరువై ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోయారు. ఈ విస్ఫోటనాల్లో వెదజల్లిన లావా కింద ఎన్నో గ్రామాలు, పట్టణాలు నలిగిపోయి ఉన్నాయి. ఈ విస్ఫోటనాల ప్రభావం 2500 మీటర్ల ఎత్తులో మేఘంలా కమ్మేసుకుంటుంది.



## డెత్ వ్యాలీ, యూఎస్‌ఏ

యూనైటెడ్ అమెరికాలో ఉన్న ఈ ప్రదేశానికి వెళితే మనమున్నది మానవ సామ్రాజ్యమైన భూగ్రహం అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోతాము. అంతటి వేడి తాపాన్ని కలిగి ఉంటుందీ లోయ ప్రాంతం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఎప్పుడూ మండుతున్న పొయ్యిలా ఉంటుంది. అబ్బురపరిచేలా ఉండే ఈ ఎడారి ఎప్పుడూ 56.7 డిగ్రీల ఉష్ణోగ్రతతో ప్రపంచంలోనే ఎప్పుడూ అత్యధిక ఉష్ణోగ్రతను కలిగి ఉండే ప్రదేశంగా రికార్డులకెక్కింది. ఇక్కడ సూర్యుడు ఎంతలా మండుతాడంటే, వెళ్లిన పద్నాలుగు గంటల లోపు శరీరం మొత్తం చుక్క నీరు లేకుండా డీ హైడ్రేట్ అయిపోతుంది. అంటే అక్కడికి వెళ్లిన వారు 14 గంటలకు మించి జీవించలేరన్నమాట. అయినప్పటికీ కొందరు సాహసయాత్రికులు తగిన జాగ్రత్తలతో అక్కడికెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు.




## ఏనుగుల రాజ్యం, థాయ్‌లాండ్

చుట్టూ నీళ్లు, మధ్యలో చిన్న కుటీరం లాంటి నిర్మాణం. ఆ నీళ్లనిండా ఎటు చూసినా మొసళ్లు. అలాంటి ప్రదేశానికి వెళ్లడానికి ఎవరైనా సాహసిస్తారా. ఆ ప్రదేశం థాయ్‌లాండ్‌లోని చింబోరిలో ఉంటుంది. ఎలిఫెంట్ కింగ్‌డమ్‌గా పేరుపొందిన ఈ ప్రాంతంలో చిన్న సరస్సుతో కూడిన ఒక క్రొకడైల్ ఫామ్ ఉంటుంది. దీంట్లోకి వెళ్లేందుకు నిర్వాహకులు కట్టె, ప్లాస్టిక్‌తో కలిపి చేసిన ఒక కదిలే కుటీరాన్ని తయారు చేశారు. దాంట్లోనే పర్యాటకులు సరస్సు మధ్యలోకి వెళ్లి, చుట్టూ వచ్చి నిలబడిన మొసళ్లకు నిర్వహకులిచ్చిన రాడ్‌ల ద్వారా మాంసాన్ని అందిస్తుంటారు. ఇది భయానకమే అయినా కొందరు యాత్రికులు ఈ సాహసాన్ని చేస్తూనే ఉంటారు.

---

ట్రావెలాగ్ -10

# గోడ అడుగున శవాలు!



మా కోచ్ ఉదయం పది ముప్పావుకి గ్రేట్ వాల్ ఆఫ్ చైనా సమీపంలో బడాలింగ్‌లో ఆగింది. ఎండ బాగా ఉంది. 42 డిగ్రీల సెల్సియస్. మేము వెళ్లిన భాగం పేరు జువాంగ్ పాస్. నేను చైనా వాల్‌ని డిస్కవరీ, నేషనల్ జియోగ్రాపిక్ ఛానల్స్‌లో అనేకసార్లు చూశాను. కాని దీన్ని స్వయంగా చూడడం ఇదే మొదటిసారి. మేము చూసే భాగాన్ని టైహాంగ్ పర్వతాల చివర్లోని జుండూ కొండల్లో మింగ్ డైనాస్టీకి చెందిన జనరల్ జూడా, ఛాంగ్ యూ చున్‌లు 1368లో నిర్మించారు. ఆ తర్వాత దానికి అనేకసార్లు మరమ్మతులు చేశారు. కానీ ఆసియాలోని అతి ప్రాచీన కట్టడం చైనా వాల్ కాదు. మన దేశంలోని సాంచీ స్థూపం ఆసియాలోని అతి ప్రాచీన కట్టడం.

విశాలంగా ఉండి, పాములా సాగే ఆ గోడ చాలాదూరం కనిపించింది. వాచ్ టవర్లు, గేట్ టవర్లు, ఆఫీసులు, ఆలయాలు, కన్‌ఫ్యూషియన్ పాఠశాలలు ఇక్కడ ఉన్నాయి. విశాలమైన పగోడా సీలింగ్ గల వాచ్ టవర్లకి పెంకులు కప్పి ఉన్నాయి. చుట్టూతా అనేక పర్వత శిఖరాలు అందంగా కనిపించాయి. దీని పాదం దగ్గర చాలా పెద్ద చైనా వాల్ మ్యాప్‌ని ఉంచారు. చైనీస్, అంతర్జాతీయ ప్రయాణికులతో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. మే డే సందర్భంగా స్కూళ్లకి ఆ వారం సెలవు కాబట్టి అనేక మంది స్కూల్ పిల్లలు కనిపించారు. గ్రామీణులు, విద్యార్థులు కూడా చైనా వాల్ చూడడానికి వచ్చారు. చాలామంది చైనీస్ అడిగి మరీ పద్మజతో ఫొటోలు తీయించుకున్నారు.

ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు సెల్‌ఫోన్ వాడడం నిషిద్ధం అనే బోర్డు కనిపించింది. అక్కడ మింగ్ డెనాస్టీకి చెందిన హాంగ్‌జీ చక్రవర్తి కట్టించిన జెన్ వ్యూ ఆలయం ఉంది. ఈ భాగం గోడని నిర్మించిన జనరల్ జూడాకి జెన్‌వ్యూ దేవుడి సహాయం లభించిందని, 1997లో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారనే బోర్డు ఆలయం బయట ఉంది. అటు, ఇటు ద్వారపాలకుల్లా రెండు సింహాలున్నాయి. వాటి మెడల్లో ఎర్రటి రిబ్బన్ బౌ కట్టి ఉంది. పక్కనే క్వాంగ్‌చూ అనే మరో పురాతన దేవాలయం కూడా ఉంది.



## పొడవైన సిమెట్రీ

హేరిస్ చైనా వాల్‌కి టిక్కెట్లని కొని మాకు తలొకటి ఇచ్చి చెప్పాడు. రెండు దారులు ఉన్నాయి. కుడివైపు తేలిగ్గా ఎక్కొచ్చు. ఎడమ వైపు మార్గం కొద్దిగా కష్టం. కాబట్టి అంతా కుడివైపు ఎంత దూరం వెళ్లగలిగితే అంత దూరం వెళ్లి గంటన్నరలో బస్ దగ్గరికి రావాలని చెప్పాడు. మనం తారీఖుని ముందు, తర్వాత నెలని, చివరగా సంవత్సరాన్ని రాస్తాం. అమెరికాలో నెల ముందు, తర్వాత తారీఖు, చివరగా సంవత్సరాన్ని రాస్తారు. టికెట్ మీద ముందు సంవత్సరం, తర్వాత నెల, ఆ తర్వాత తారీఖు రాశారు. ఇది చైనీస్ పద్ధతి. జపాన్‌లోనూ ఇంతేనని 2015లో జపాన్ వెళ్లినప్పుడు గమనించాను.

మేము వెళ్లిన చైనా వాల్ భాగాన్ని పర్యాటకుల కోసం చక్కగా మరమ్మతు చేశారని, కాని చాలా చోట్ల ఈ గోడ కూలిపోయి అవశేషాలని కావాలని మిగిల్చారని హేరిస్ చెప్పాడు. కొన్ని చోట్ల గోడ ఇరవై ఆరు అడుగుల ఎత్తు, ఇరవై ఒక్క అడుగుల వెడల్పు కూడా ఉంది. మేము గోడ మీద మొదటి వాచ్ టవర్ దాకా వెళ్లి టైం చూసుకుని వెనుదిరిగాం. చాలా మంది ఇంకా ముందుకి వెళ్లారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా మీద ఎంత దూరం వెళ్తే వాళ్లు అంత హీరోలుగా చైనీస్ భావిస్తారు. చైనా వాల్ మీద ఒక జోక్ ఉంది – చైనా తయారీల్లో నాణ్యత గలది ఒక్క ఈ గ్రేట్ వాల్ ఆఫ్ చైనా మాత్రమే. మిగిలినవన్నీ మూడో రోజే రిపేర్‌కి వస్తాయి.

గ్రేట్ వాల్ ఆఫ్ చైనాకి అతి పొడవైన సిమెట్రీ అని పేరు. దాని నిర్మాణంలో మరణించిన పది లక్షల మంది శవాలని ఆ గోడల కిందే సమాధి చేశారు. దీనిమీద ఓ కథ ఉంది. సమీప గ్రామంలోని ఓ రైతుని బలవంతంగా ఇక్కడికి తీసుకువచ్చి కూలీగా నిర్బంధించారు. ఈ గోడ నిర్మాణంలో మరణించిన ఆ కూలీ శవాన్ని గోడ కిందే ఖననం చేశారు. అది తెలిసి అక్కడికి వచ్చిన అతని భార్య మెంగ్ జియాంగ్ ఎంతగా విలపించిందంటే ఆ భాగం గోడ కూలిపోయి అతని శవం బయటపడిందిట. దాన్ని ఆమె తన గ్రామానికి తీసుకెళ్లి తమ ఇంట్లో ఖననం చేసిందట. క్విన్ డైనాస్టీలో జరిగిందని చెప్పబడే ఈ అంశంతో చైనాలో అనేక నాటకాలు రాయబడ్డాయి. చాలామంది కళాకారులు దీంతో ప్రేమలో పడ్డారు. ఫ్రాంజ్ కాఫ్కా అనే యూరోపియన్ నవలా రచయిత ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా పేరుతో ఇలాంటి ఓ కథని రాశాడు. ఈ వాల్ దగ్గరి ఆఖరి యుద్ధం జపనీస్, చైనీస్ సైన్యానికి మధ్య 1938లో జరిగింది. ఇప్పటికీ అక్కడ ఆ గోడకి తుపాకీ గుళ్లు తగిలిన గుర్తులు ఉన్నాయి.

(ఇంకా ఉంది)

...✍ మల్లాది వెంకట కృష్ణమూర్తి

---

# పురానాపూల్

హైదరాబాద్‌లోని ప్రముఖ ఏరియాల్లో పురానాపూల్ ఒకటి. మరోలా చెప్పాలంటే ఈ పేరు చాలా ఫేమస్. వినని వాళ్లే కాదు, చూడనివాళ్లు ఉండరంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ పేరు ఎలా వచ్చిందంటే మాత్రం ఈ జనరేషన్‌లో చాలామందికి తెలియదు.



భాగ్యనగరంలోని పురాతన బ్రిడ్జి ఇది. ఒక రకంగా హైదరాబాద్ షెహర్‌లో కట్టిన తొలి వంతెనగా చరిత్రకెక్కింది. అంతేకాదు దక్షిణ భారతంలో పురాతనమైనదిగా కూడా దీనికి పేరున్నది. కుతుబ్‌షాహీల కాలంలో దీని నిర్మాణం జరిగినట్టు చరిత్ర చెబుతున్నది. 1578లో సుల్తాన్ ఇబ్రహీం కులీ కుతుబ్‌షా దీన్ని కట్టించాడు. హైదరాబాద్‌కు గోల్కొండకు మధ్య వారధిలా దీన్ని నిర్మించారు. అయితే దీని నిర్మాణానికి సంబంధించి మరో ఆసక్తికరమైన కథనం కూడా ప్రచారంలో ఉన్నది. యువరాజు మహ్మద్ కులీ కుతుబ్‌షా.. మూసీకి అవతలి ఒడ్డున నివసించే ప్రియురాలు భాగమతిని కలిసివచ్చేందుకు ఇబ్బందిపడడం చూసి.. అతని తండ్రి సుల్తాన్ ఇబ్రహీం కులీ కుతుబ్‌షా ఈ వంతెనను కట్టించారని చెబుతారు. వారి ప్రేమను గుర్తించి.. తన కుమారుడు సునాయసంగా నదిని దాటి భాగమతిని కలిసి వచ్చేలా చేశాడని చరిత్రకారులు చెబుతారు. అందుకే ఈ బ్రిడ్జికి 'ప్యార్ ఆన్ పూల్' (on love bridge) అని పిలిచేవారట. అలా ప్రాచుర్యం పొందిన ఈ వంతెన.. కాలక్రమేణా పూరానాపూల్‌గా మారి నేటికీ హైదరాబాద్ ప్రజలకు సేవలందిస్తున్నది. ఈ బ్రిడ్జ్‌కి ఆనుకొని ఒక శివాలయం కూడా ఉన్నది. ఆ నాటి నుంచీ ఇక్కడ నిత్య పూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. ఇక్కడి ఆలయం పరిసరాల్లో ఒక పెద్ద సొరంగమార్గం కూడా ఉన్నదని చెబుతుంటారు. ఆ సొరంగమార్గం ద్వారా గోల్కొండకు చేరుకోవచ్చుట. హైదరాబాద్‌పై భయానకంగా విరుచుకుపడిన మూసీ వరదలకు తట్టుకొని నిలబడి, నేటికీ సేవలందిస్తున్న ఒకే ఒక్క వంతెన పురానాపూల్ కావడం విశేషం.

---

**మీరు తరచుగా ప్రయాణాలు చేస్తుంటారా? దేశవ్యాప్తంగా ఊళ్లు చుట్టి వస్తుంటారా? పుణ్యక్షేత్రాలైనా, విహారయాత్రలైనా... వినోదం కోసమైనా, విజ్ఞానం కోసమైనా... మీరు చేసిన ప్రయాణం మాకెంతో ప్రియమైనది. మీ ప్రయాణానుభవాలు మరెందరికో ఉపయోగపడవచ్చు.**

సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భావాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి. మీ పేరుతో ప్రచురిస్తాం.

**మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.**



**మా చిరునామా**
విహారం (నా ప్రయాణం), నమస్తే తెలంగాణ,
తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్,
రోడ్ నెం. 10, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 34.
viharam@ntnews.com

---

# ఇక్కడికి పురుషులు రావద్దు!

**గుడిలోకి వెళ్లాలంటే సంప్రదాయ దుస్తులు ధరించాలి. ఇప్పుడు దాదాపు అన్ని దేవాలయాల దగ్గర ఈ నియమాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. అయితే కేరళలోని ఒక ఆలయంలో మాత్రం ఒక భిన్నమైన ఆచారం ఉన్నది.**

కొల్లం జిల్లాలో కొట్టాన్ కొల్లారా ఆలయం ఉన్నది. ఇక్కడి అమ్మవారు ఎంతో మహిమాన్వితమైనదని నమ్ముతారు జనాలు. అయితే ఈ ఆలయంలో ఒక విచిత్రమైన ఆచారం ఉన్నది. పురుషులకు అనుమతి లేదు. అయితే వెళ్లాలకుంటే వారు ఆడవారిలా చీరకట్టుకుని, కళ్లకు కాటుక పెట్టుకుని, పెదవులకు లిప్‌స్టిక్, తలలో పూలు పెట్టుకుంటే ఆలయంలోకి అనుమతిస్తారట. అలా అలంకరించుకునేందుకు ఆలయంలో తగిన ఏర్పాట్లు కూడా ఉంటాయట. ఆరోగ్యం, వివాహం, విద్య, ఉద్యోగం.. ఇలా ఏ అంశంలోనైనా సమస్య వచ్చినప్పుడు అమ్మవారిని వేడుకుంటారు భక్తులు. అనుకున్నవి జరుగగానే వచ్చి మొక్కులు చెల్లించుకొంటారు. అయితే ఈ ఆచారం వెనుక చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి కొందరు పశువుల కాపరులు చీరలు ధరించి దగ్గరలో ఉన్న ఒక రాయికి పూజలు చేశారట. అందులో దైవశక్తిని గమనించి కొట్టన్‌గా పిలిచి గుడి కట్టారట. అప్పట్నుంచి పురుషులు స్త్రీ వేషధారణలో ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ఓసారి కొబ్బరికాయను ఈ రాయికేసి కొడితే రక్తం వచ్చినట్టు చెబుతారు. అప్పట్నుంచి ఈ రాయిని మరింత విశిష్టమైనదిగా భావిస్తున్నారు. అంతేకాదు, ఈ రాయి పరిమాణం పెరుగుతూ వస్తున్నదని చెబుతున్నారు.



నమస్తే తెలంగాణ
# చిత్రం
[ హైదరాబాద్ ]
శుక్రవారం 9 మార్చి 2018

# హలో గురు ప్రేమకోసమే...



అనుపమ పరమేశ్వరన్, రామ్

రామ్ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న తాజా చిత్రం 'హలో గురు ప్రేమ కోసమే' గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రినాథ రావు నక్కిన దర్శకుడు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. పూజాకార్యక్రమాల అనంతరం అనుపమ పరమేశ్వరన్, హీరో రామ్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వంశీ పైడిపల్లి క్లాప్‌నివ్వగా, మరో దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విఛాన్ చేశారు. హరీష్‌శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. నవీన్ ఎర్నేని, స్రవంతి రవికిషోర్ స్క్రిప్ట్‌ను దర్శకుడు త్రినాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'దిల్‌రాజు, రామ్ కలయికలో రూపొందుతున్న నవ్యమైన ప్రేమకథా చిత్రమిది. ఈ నెల 12 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. దేవిశ్రీప్రసాద్ బాణీలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాల్ని వెల్లడిస్తాం' అని తెలిపారు. ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్.కె. చక్రవర్తి, మాటలు: బెజవాడ ప్రసన్నకుమార్, రచనా సహకారం: సాయికృష్ణ, ఆర్ట్: సాహి సురేష్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, నిర్మాత: దిల్‌రాజు, దర్శకత్వం: త్రినాథరావు నక్కిన.

# ప్రణయగీతాల్లో...

కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఎంఎల్‌ఏ'. 'మంచి లక్షణాలున్న అబ్బాయ్' ఉపశీర్షిక. బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఉపేంద్రమాధవ్ దర్శకుడు. కిరణ్‌రెడ్డి, భరత్‌చౌదరి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 23న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం అజర్‌బైజాన్ దేశ రాజధాని బాకులోని అందమైన లొకేషన్స్‌లో పాటల్ని చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి లక్షణాలున్న అబ్బాయ్ కథ ఇది. ప్రేమ, కుటుంబం కోసం అతడు ఎలాంటి త్యాగానికి సిద్ధపడ్డాడన్నది ఆసక్తిని పంచుతుంది. కల్యాణ్‌రామ్, కాజల్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. వినోదం, ప్రేమ, యాక్షన్, కుటుంబ విలువల సమాహారంగా సాగుతూ చక్కటి ఫీల్‌ను కలిగిస్తుంది' అన్నారు. రవికిషన్, జయప్రకాష్‌రెడ్డి, అజయ్, వెన్నెల కిషోర్, పృథ్వీ, శివాజీరాజా, ప్రభాస్‌శ్రీను, లాస్యా, మనాలిరాథోడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచనా సహకారం: ప్రవీణ్‌వర్మ, ఆదినారాయణ, సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: ప్రసాద్ మూరెళ్ల, ఎడిటింగ్: తమ్మిరాజు.



కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్

# కలెక్టర్ కర్తవ్యం



నయనతార

'ప్రజలకు ఏది అవసరమో అదే చట్టమవ్వాలి. అంతేకానీ చట్టాన్ని ముందే తయారు చేసి దానిని ప్రజల మీద బలవంతంగా రుద్దకూడదని నమ్మే ఓ జిల్లా కలెక్టర్ కథే ఈ చిత్ర ఇతివృత్తం' అని అన్నారు ఆర్. రవీంద్రన్. శరత్‌మరార్‌తో కలిసి ఆయన నిర్మించిన తాజా చిత్రం 'కర్తవ్యం'. నయనతార కథానాయిక. గోపి నైనర్ దర్శకుడు. ఈ నెల 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. మహిళా దినోత్సవం సందర్భంగా ఫస్ట్‌లుక్ టీజర్‌ను చిత్ర బృందం విడుదలచేసింది. నిర్మాతలు మాట్లాడుతూ 'తమిళంలో రూపొందిన 'అరమ్'కు అనువాదరూపమిది. పొలిటికల్ అంశాలు, మానవీయ విలువల మేళవింపుతో హృద్యంగా సాగుతుంది. యదార్థ సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని సహజకోణంలో దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించారు. బోరు బావిలో పడిన చిన్నారిని రక్షించడానికి ఓ మహిళా కలెక్టర్ సాగించిన స్ఫూర్తిదాయక ప్రయాణం నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగుతుంది. జిల్లా కలెక్టర్ పాత్రలో నయనతార నటన ఆకట్టుకుంటుంది. తమిళంలో ఆమె కెరీర్‌లో పెద్ద విజయాన్ని సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. ఈ చిత్రానికి విఘ్నేష్, రమేష్, వినోదిని వైద్యనాథన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కెమెరా: ఓం ప్రకాష్, సంగీతం: జీబ్రాన్, ఎడిటింగ్:గోపీకృష్ణ.

# విజయ్ దేవరకొండ 'నోటా'

ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయడం ఇష్టంలేకపోతే నోటా(నన్ ఆఫ్ ది ఎబోవ్)ను వినియోగించి రాజకీయనాయకులు తమకు నచ్చలేదని తిరస్కరించే హక్కు ఓటర్‌కు ఉంది. ఆ నోటాకు ఉన్న పవర్ ఏమిటో చూపించబోతున్నారు విజయ్ దేవరకొండ. ఆయన కథానాయకుడిగా స్టూడియోగ్రీన్ పతాకంపై తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. ఆనంద్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. కె. ఇ జ్ఞానవేల్ రాజా నిర్మాత. ఈ చిత్రానికి 'నోటా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మెహరీన్ కథానాయిక. గురువారం టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఓటు హక్కును వినియోగించినట్లుగా వేలిపై సిరా గుర్తుతో విజయ్‌దేవరకొండ కనిపిస్తున్నారు. ఆయన వెనుక పలు స్కామ్‌లు, నేరాల తాలూకు వార్తలకు సంబంధించిన చిత్రాలు ఉన్నాయి. సమకాలీన రాజకీయాల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్‌దేవరకొండ పాత్ర శక్తివంతంగా సాగనున్నట్లు సమాచారం. గురువారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించినట్లు చిత్రబృందం పేర్కొన్నది. సత్యరాజ్, నాజర్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శామ్.సి.ఎస్.





రవితేజ,నవీన్ యెర్నేని, శ్రీనువైట్ల, అను ఇమ్మాన్యుయెల్

# 'అమర్ అక్బర్ ఆంటోనీ' షురూ!

హీరో రవితేజ, దర్శకుడు శ్రీనువైట్ల కలయికలో రూపొందుతున్న తాజా చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోనీ'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్, మోహన్(సీవీఎమ్) నిర్మిస్తున్నారు. అను ఇమ్మాన్యుయెల్ కథానాయిక. గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శ్రీనువైట్ల పెద్ద కుమార్తె ఆనంది క్లాప్‌నివ్వగా, రెండవ కుమార్తె ఆద్య కెమెరా స్విఛాన్ చేశారు. రవితేజ స్క్రిప్ట్‌ను శ్రీనువైట్లకు అందించారు. దర్శకుడు శ్రీనువైట్ల మాట్లాడుతూ 'ఏడాది క్రితం చిన్న ఐడియా నుంచి పుట్టిన కథ ఇది. అమెరికాలోని న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపనున్నాం. పూర్తిస్థాయి హాస్యభరిత పాత్రలో సునీల్ కనిపించబోతున్నారు. హీరోయిన్ లయతో పాటు ఆమె కూతురు శ్లోక ఈ సినిమాలో కీలక పాత్రలను పోషించనున్నారు. రవితేజ తనయుడు మహాధన్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాతలు చెప్పారు. అభిమన్యు సింగ్, తరుణ్ అరోరా, విక్రమ్ జీత్‌సింగ్, షాయాజీ షిండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, సంగీతం: ఎస్.ఎస్. తమన్, సినిమాటోగ్రాఫర్: విజయ్.సి. దిలీప్, కథ: శ్రీనువైట్ల, రాజేష్.

# సైకలాజికల్ థ్రిల్లర్



షకీలా

షకీలా, అర్జున్, గీతాంజలి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'శీలవతి'. సాయిరామ్ దాసరి దర్శకత్వం వహిస్తున్నారు. రాఘవ ఎమ్. మహేష్, వీరబాబు బాసింశెట్టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షకీలా నటిస్తున్న 250వ చిత్రమిది. కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. అనంతరం నటి షకీలా మాట్లాడుతూ 'ఈ సినిమా నాకు చాలా స్పెషల్. ఆద్యంతం ఉత్కంఠతో సాగేలా అద్భుతమైన స్క్రీన్‌ప్లేను దర్శకుడు రాసుకున్నారు. నా పాత్ర చిత్రణ చాలా కొత్తగా, భిన్నంగా వుంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని మే నెలలో విడుదల చేయాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. నటిగా నాకు మంచి పేరును తెచ్చిపెడుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'కేరళలో జరిగిన యదార్థ సంఘటన నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. తప్పకుండా అందరిని అలరిస్తుందనే నమ్మకముంది ' అన్నారు.

# సోషల్ మీడియా వేలంవెర్రిగా మారింది!



శ్రీధర్ మర్రి

'విభిన్నమైన పాత్రల్లో నటించేలా నటులకు ప్రేక్షకులు స్వేచ్ఛనివ్వాలి. ఒకే తరహా పాత్రల్లో చూస్తాం అనడం తప్పు. అమీర్‌ఖాన్ 'దంగల్' సినిమా తరువాత మళ్లీ అదే తరహా సినిమా చేస్తే రొటీన్ అవుతుంది. కొత్త తరహా కథలు చేస్తేనే నటుడనేవాడి కెరీర్ సంపూర్ణం అవుతుంది' అన్నారు శ్రీధర్ మర్రి. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన తాజా చిత్రం 'ఏ మంత్రం వేసావే'. విజయ్ దేవరకొండ కథానాయకుడు. శివానీ సింగ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు శ్రీధర్ మర్రి మాట్లాడుతూ 'నా స్వస్థలం హైదరాబాద్. అయితే మా కుటుంబం కొన్ని కారణావల్ల బెంగళూరులో స్థిరపడింది. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తరువాత మాస్టర్స్ ఇన్ ఇండస్ట్రియల్ డిజైన్ కోర్సు చేశాను. ఆ తరువాత కోల్‌కొతాలో ఐ.ఎ.ఎమ్ చేశాను. ఇన్ఫోసిస్‌లో వైస్‌ప్రెసిడెంట్‌గా 15 ఏళ్ల పాట్లు పనిచేశాను. చదువు, ఉద్యోగం రీత్యా నాకు ఇష్టమైన సినిమా రంగంవైపు దృష్టి సారించలేకపోయాను. చిన్నతనం నుంచి సినిమాలతో పాటు స్టోరీస్ రాయడం అంటే ఆసక్తి వుండేది. కెరీర్‌లో స్థిరపడిన తరువాత సినిమా చేయాలనే కోరికతో 'ఏ మంత్రం వేసావే' కథ రాసుకున్నాను. సోషల్ మీడియా మోజులో భావోద్వేగాల్ని, బంధాల్ని మర్చిపోతున్నాం. దీన్నే ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని రెగ్యులర్ చిత్రాలకు పూర్తి భిన్నంగా ఈ సినిమా చేశాను. 2014లో విజయ్ దేవరకొండకు ఈ కథ చెప్పాను. ఇలాంటి కథతో రిస్క్ చేయడానికి ఏ నిర్మాత ముందుకురాడని గ్రహించి స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించాను. ఉద్యోగం చేస్తూ సినిమా చేయడం వల్ల కొంత ఆలస్యమైంది. ఈ సమయంలోనే విజయ్ నటించిన పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాలు విడుదలై సూపర్‌హిట్ అయ్యాయి. వాటి ఫలితాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ చిత్రంలో ఎలాంటి మార్పులు చేయలేదు. గత చిత్రాలకు ఏ మాత్రం సంబంధం లేని విధంగా చాలా భిన్నంగా విజయ్ దేవరకొండ పాత్ర వుంటుంది. అందుకే ఆ చిత్రాలతో పోల్చోద్దు అంటున్నాను. కథ నచ్చి ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాత మల్కాపురం శివకుమార్ ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. హీరో విజయ్ దేవరకొండకు నాకు మధ్య ఎలాంటి విభేధాలు లేవు. సినిమా అనుకున్న సమయానికి రాకపోవడం.. ప్రస్తుతం ఇతర చిత్రాల షూటింగ్‌లతో బిజీగా వుండటం వల్ల ఆయన మా చిత్ర ప్రచారానికి రావడం లేదు. డబ్బు కోసమే నేను చిత్రపరిశ్రమకు రాలేదు. అర్థవంతమైన చిత్రాలకే నా ప్రాధాన్యత. నా దగ్గర చాలా కథలున్నాయి. ఓ కొత్త తరహా కథతో తదుపరి చిత్రానికి శ్రీకారం చుడతాను' అన్నారు.

# తొలి తొలకరిగా...

విశాల్, సమంత జంటగా నటిస్తున్న చిత్రం 'అభిమన్యుడు'. పి.ఎస్. మిత్రన్ దర్శకుడు. హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి. హరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'తొలి తొలిగా తొలకరి చూసి విప్పారిన కన్నుల్లో ' అనే గీతాన్ని గురువారం హీరో నితిన్ విడుదల



విశాల్, సమంత

చేశారు. శ్రేష్ట సాహిత్యాన్ని సమకూర్చిన ఈ గీతాన్ని జతిన్‌రాజ్ ఆలపించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'యాక్షన్, వినోదం, ప్రేమ అంశాలతో ముడిపడిన చిత్రమిది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలను దోచుకుంటున్న కంటికి కనిపించని శత్రువులపై పోరాటం చేసే అభినవ అభిమన్యుడి కథతో సినిమా ఆసక్తికరంగా సాగుతుంది. ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతుంది. విశాల్ కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందిన చిత్రమిది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించాం. విశాల్, సమంత కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. అర్జున్ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, ఛాయాగ్రహణం: జార్జ్.సి. విలియమ్స్, ఫైట్స్: సూపర్ సుబ్బరాయన్.

# 'టెర్మినేటర్-6' రాబోతున్నది!



ఆర్నాల్డ్

'టెర్మినేటర్' సిరీస్ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా చక్కటి ప్రేక్షకాదరణను చూరగొన్నాయి. కథానాయకుడిగా ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్‌కు తిరుగులేని పేరుప్రఖ్యాతుల్ని తీసుకొచ్చాయి. మానవరూపంలో కనిపించే రోబో పాత్రలో ష్వార్జ్‌నెగ్గర్ చేసే పోరాట ఘట్టాలు, సాహసాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షాన్ని కురిపించాయి. 'టెర్మినేటర్' సిరీస్ పరంపరలో భాగంగా ఆరవ సినిమా రాబోతున్నట్లు ప్రకటించారు ఆర్నాల్డ్. జూన్‌లో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారాయన. ఈ ఆరవ సిరీస్‌కు టీమ్ మిల్లర్ దర్శకత్వం వహించనున్నారు. జేమ్స్ కామెరూన్, డేవిడ్ ఇల్లిసన్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో టీ 800 అనే టెర్మినేటర్ పాత్రలో మరోసారి ఆర్నాల్డ్ కనిపించబోతున్నారు.




ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలయ్యే క్రిమినల్ కేసుల విచారణకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాన్ని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జీ వెంకటకృష్ణయ్య గురువారం ప్రారంభించారు. నాలుగో అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కే రవీందర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎం రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి రాహుల్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# సీఎం కేసీఆర్ ప్రధాని కావాలి

- నేడు అజ్మీర్ దర్గాలో డిప్యూటీ సీఎం ప్రార్థనలు
- అజ్మీర్‌లో గెస్ట్‌హౌస్ భవనం కోసం స్థలాల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశ రాజకీయాల్లో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో సీఎం కేసీఆర్ విజయం సాధించాలని, దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టాలని కోరుతూ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోని సుప్రసిద్ధ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ నేతృత్వంలో తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లా, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, తెలంగాణ మైనారిటీ కమిషన్ సభ్యుడు అర్షద్ అలీ, టీఆర్ఎస్ మైనారిటీ నేత షరీఫ్‌లతో కూడిన బృందం గురువారం రాజస్థాన్ పర్యటనకు వెళ్లింది. రాష్ట్రం నుంచి అజ్మీర్ వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం అక్కడ ఉచిత వసతి కల్పించడానికి రుబాత్ (గెస్ట్‌హౌస్) నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రుబాత్ నిర్మాణం కోసం అజ్మీర్ పట్టణంలో అందుబాటులో ఉన్న రాజస్థాన్ ప్రభుత్వ స్థలాన్ని చూసేందుకు రావాలని అక్కడి కలెక్టర్ నుంచి ఫోన్ రావడంతో డిప్యూటీ సీఎం, చైర్మన్లు గురువారం జైపూర్‌కు వెళ్లారు. శుక్రవారం అజ్మీర్ కలెక్టర్, అక్కడి రెవెన్యూ అధికారులతో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ బృందం సమావేశమై స్థలం విషయంపై చర్చించనున్నది.



ఆ తర్వాత అజ్మీర్ దర్గాను సందర్శించి, శుక్రవారం ప్రార్థనల అనంతరం దర్గా దివాన్‌ను కలుస్తారు. జాతీయ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ మూడో ఫ్రంట్ ఆకాంక్ష నెరవేరేలా, దేశానికి దశ, దిశ చూపిస్తూ బంగారు భారతదేశంగా తీర్చిదిద్దగలిగేలా కేసీఆర్ ప్రధాని బాధ్యతలు చేపట్టాలని కోరుతూ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించేలా, జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ కీలక పాత్ర పోషించేలా మొక్కు తీర్చుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు.


## కేంద్రంలో కేసీఆర్ నాయకత్వం అవసరం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ నాయకత్వం దేశ రాజకీయాల్లోనూ అవసరమని రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొండూరు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడున్నరేండ్లుగా వినూత్న పథకాలతో తెలంగాణను అభివృద్ధి దిశలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ మూడో ఫ్రంట్ ఏర్పాటుచేస్తే దేశవ్యాప్తంగా రాజకీయాల్లో గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు.

## కేసీఆర్‌తో దేశ రాజకీయాల్లో మార్పులు

- విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య తెలిపారు. సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో ఉంటే కీలక మార్పులు వస్తాయని భావిస్తున్నామని గురువారం మీడియాకు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక స్థానం, గౌరవం కల్పించింది సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు.



## మహిళల ఆరోగ్య రక్షణకు విస్తృత వైద్యసేవలు

- హెచ్ఐవీ బాధితులకు ఆసరా పింఛన్
- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ ప్రీతీమీనా



ప్రీతీమీనా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి కాపాడుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రీతీ మీనా సూచించారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం విస్తృత వైద్యసేవలందిస్తున్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రవీంద్రభారతిలో మహిళల ఆరోగ్యం, ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ అంశంపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం సలహాలు అందించేందుకు రైట్ టు హెల్త్ యాప్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితుల కోసం ఆయుర్ధాన్ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. 2017లో రాష్ట్రంలో 3,44,116 మంది సాధారణ వ్యక్తులకు హెచ్ఐవీ పరీక్ష చేయగా 6,948 మందికి పాజిటివ్‌గా తేలిందని పేర్కొన్నారు. 3,87,833 మంది గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు చేయగా 400 మందికి పాజిటివ్‌గా నమోదైనట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఆర్టీ కేంద్రాల్లో 72,133 మంది ప్రభుత్వ పరంగా మందులు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందజేస్తున్నదని తెలిపారు. ఎయిడ్స్ అంటే మరణమన్న అభిప్రాయం ఇప్పుడు లేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ డైరెక్టర్ లలితకుమారి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ ఫీజులు 50 శాతం పెంపు!

- డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారని కళాశాలల జేఏసీ ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ ఫీజులను 50శాతం పెంచేందుకు డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి హామీ ఇచ్చారని తెలంగాణ ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ కళాశాలల జేఏసీ నాయకుడు సుందర్‌రాజ్ తెలిపారు. గురువారం ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలల జేఏసీ నాయకులతో కడియం శ్రీహరి చర్చలు జరిపారు. ప్రైవేటు ఇంటర్ కళాశాలకు ఏటా 10 శాతం ఫీజులు పెంచాలనే నిబంధన ఉన్నప్పటికీ 2014-15 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం దానిని అమలుచేయడం లేదు. ఈ నేపథ్యంలో ఒకేసారి 50 శాతం ఫీజులు పెంచాలని డిప్యూటీ సీఎం కడియం ఆధ్వర్యంలో తుది నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రైవేటు ఇంటర్ ఫీజులను పెంచేందుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపామని, దీనిపై ఏప్రిల్‌లో తుదినిర్ణయం వెలువడే అవకాశాలు ఉన్నాయని డిప్యూటీ సీఎం కడియం పేర్కొన్నారని జేఏసీ నాయకులు తెలిపారు. అలాగే ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో 70శాతం వరకు తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. సమావేశంలో తెలంగాణ ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల జేఏసీ నాయకులు ఎస్వీఎస్ ప్రకాశ్, సిద్దేశ్వర్, ఎన్ నరేందర్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల నిర్వహణకు సహకరించండి

- ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు ఇంటర్‌బోర్డు విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సహకరించాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు.

# ఎండకాలం గడిచేదెలా?

### సంక్లిష్టంగా మారిన శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటిమట్టం

- కనీసమట్టం అడుగున నీటి వినియోగానికి కసరత్తు
- అభిప్రాయాలకోసం రెండు రాష్ట్రాలకు బోర్డు లేఖ
- మార్చిలోనే ఎండీడీఎల్ దిగువన వాకడంపై ఆందోళన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కృష్ణా జలాల వినియోగం గాడి తప్పుతున్నదా? రెండు రాష్ట్రాల మధ్య పర్యవేక్షణ బాధ్యతను భుజాన వేసుకొన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ముందుచూపు ప్రదర్శించడం లేదా? గత కొన్నిరోజులుగా చోటుచేసుకొంటున్న పరిణామాల నేపథ్యంలో పలువురు నిపుణులు ఇదే సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు. శ్రీశైలంలో 800 అడుగులు (ఎండీడీఎల్ కంటే 34 అడుగులు తక్కువ), నాగార్జునసాగర్‌లో 500 అడుగులు (ఎండీడీఎల్ కంటే పది అడుగులు తక్కువ) వరకు నీటి వాడకాన్ని అనుమతిస్తూ రెండు రాష్ట్రాలకు వాటా వేయడంతోపాటు.. అభిప్రాయాలు చెప్పాలంటూ తాజాగా గురువారం కృష్ణా బోర్డు రెండురాష్ట్రాలకు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. వేసవి మొదలైందో.. లేదో.. కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) దిగువన నీటి వాడకంపై చర్చలు మొదలుపెట్టడం ఆందోళనకరంగా మారింది. గత రెండుమూడేండ్లుగా ఎదురైన పరిస్థితులు అనుభవంలో ఉన్నప్పటికీ.. ఇప్పుడు కూడా ఎడాపెడా నీటిని వాడుకొనేందుకు ప్రయత్నిస్తుండటం కలవరానికి గురిచేస్తున్నది.

తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీటి వాడకంపై పలు చర్చల అనంతరం.. మార్చి నెలాఖరు వరకు సాగర్‌లో 515 అడుగుల నీటిమట్టం నిర్వహణ.. ఆ తర్వాత ఎండీడీఎల్ దిగువన నీటి వాడకంపై చర్చిద్దామని రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఇందుకు అనుగుణంగా బోర్డు కూడా నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసింది. కానీ గురువారం బోర్డు సభ్య కార్యదర్శి రెండు రాష్ట్రాలకు కొత్త లేఖ రాశారు. బుధవారం నాటి ఉత్తర్వులను కలుపుకొని నీటి నిల్వలను లెక్కిస్తూ ఎండీడీఎల్ దిగువన నీటి వాడకంపై అభిప్రాయాలను కోరారు. ఇద్దరు ఈఎన్సీలు ఫోన్‌లో మాట్లాడుకొని.. సాగర్‌లో 500 అడుగులు, శ్రీశైలంలో 800 అడుగుల వరకు ఉన్న నీటి నిల్వల వాడకంపై చర్చించారని, ఇందులో తెలంగాణకు 45 టీఎంసీలు, ఏపీకి 30 టీఎంసీల వాటా ఉంటుందని కూడా అందులో పేర్కొన్నారు. దీనిపై ఈనెల 12లోపు అభిప్రాయాలు చెప్తే.. ఎండీడీఎల్ దిగువన నీటి వాడకాన్ని కలుపుకొని నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేస్తానని స్పష్టం చేశారు.



నాగార్జున సాగర్ (ఫైల్)

**వాటాలు సరే.. నీటి మట్టాల పరిస్థితేంటి?**

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద జోన్-1, జోన్-2కు సంబంధించి మార్చి నెలలో 12 టీఎంసీలు, ఏప్రిల్‌లో సుమారు ఆరు టీఎంసీల వరకు సాగునీరు అవసరం ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలో సాగర్‌లో నీటిమట్టం కనీసంగా 515 అడుగుల వరకైనా లేకుంటే నీటి విడుదలలో సాంకేతిక ఇబ్బందులు తప్పవు. ఎండీడీఎల్‌కు దిగువన ఎడాపెడా నీళ్లు వాడుకోవడానికి కృష్ణాబోర్డు వెసులుబాటునిస్తే పరిస్థితి దారుణంగా మారుతుంది. ఎందుకంటే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సాగర్‌లో కనీసంగా 502 అడుగుల నీటిమట్టం నిర్వహించాలంటూ నిరుడు తెలంగాణ నీటిపారుదలశాఖ పదేపదే కృష్ణాబోర్డును కోరాల్సి వచ్చింది. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం భగీరథ యత్నం చేసి హైదరాబాద్‌లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. శ్రీశైలంనుంచి ఒక టీఎంసీని వదులాలంటూ తెలంగాణ చెప్పినా, చివరకు కృష్ణాబోర్డు ఆదేశించినా అవి అమలుకాని పరిస్థితి. గత ఏడాది కృష్ణా ఇన్‌ఫ్లో కానీ, వరద కానీ అనుకున్నంత లేకపోవడంతో హైదరాబాద్, నల్లగొండ, అటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాలకు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. చివరకు ఆల్మట్టి నుంచి కనీసంగా ఒకటి రెండు టీఎంసీల నీటినైనా వదలండి.. అంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నేరుగా బెంగళూరు వెళ్లి కర్ణాటక జల వనరులశాఖ మంత్రిని కోరి ఉపశమనం కల్పించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఇప్పటినుంచే అప్రమత్తంగా వ్యవహరిస్తే గత పరిస్థితులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడొచ్చని సాగునీటిరంగ నిపుణులు సూచిస్తున్నారు. పైగా రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ దిగువన నీటి వాడకమనేది సున్నితమైన అంశం.. కేవలం అత్యవసర తాగునీటి అవసరాల కోసమే దిగువకు వెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. దీంతో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బోర్డు అడుగులు వేయాల్సిన అవసరమున్నదని సూచిస్తున్నారు.

### 12, 13 తేదీల్లో పోతిరెడ్డిపాడు టెలిమెట్రీ పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్ తరలించిన కృష్ణాజలాల లెక్కల్లో తేడాలపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిపుణులతో పరిశీలించాలని నిర్ణయించింది. పుణెలోని సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నుంచి ముగ్గురు శాస్త్రవేత్తలు నీనా ఇసాక్, పీఎస్ కుంజీర్, వీఎన్ కట్టెలు 12, 13 తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. రెండేండ్లుగా పోతిరెడ్డిపాడు నుంచి తరలించిన నీటికంటే రికార్డుల్లో ఏపీ తక్కువగా నమోదు చేస్తున్నదని ఆధారాలతో సహా బోర్డుతోపాటు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ఫిర్యాదు చేస్తున్నది. వాస్తవంగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ దిగువన 600 మీటర్ల వద్ద పరికరం ఏర్పాటుకు నిర్ణయం జరుగగా, బోర్డు మాజీ సభ్యకార్యదర్శి సమీర్‌చటర్జీ 12.265 కిలోమీటర్‌కు ఏకపక్షంగా మార్చారు. తెలంగాణ ఫిర్యాదుతో 600 మీటర్ల వద్ద మరో పరికరాన్ని ఏర్పాటు చేస్తామని హామీఇచ్చి అటకెక్కించారు. 12.265 కిలోమీటర్ వద్ద ఏర్పాటు చేసిన పరికరాన్ని ట్యాంపరింగ్ చేశారని ఆధారాలతో సహా సంబంధిత ఏజెన్సీపై కేంద్రానికి, బోర్డుకు తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు ఫిర్యాదుచేశారు. ఈ అంశం పెండింగులోనే ఉంది. తెలంగాణ ఫిర్యాదు, ఆంధ్రప్రదేశ్ బుకాయింపు దరిమిలా కృష్ణా బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నది. పోతిరెడ్డిపాడుపై ప్రస్తుత టెలిమెట్రీకి ప్రాంతం సరైనదా? పనితీరు ఎలా ఉంది? ఎక్కడ ఏర్పాటు చేస్తే కచ్చితమైన డిశ్చార్జి లెక్కలు వస్తాయనే అంశాలను తేల్చేందుకు నిపుణులతో పరిశీలన చేయించాలని నిర్ణయించింది.

## బంద్‌ను పునఃసమీక్షించుకోవాలి

- ఢిల్లీలో కొట్లాడండి.. మేమూ మీవెంట వస్తాం
- మందకృష్ణకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ వర్గీకరణపై కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 13న ఇచ్చిన రాష్ట్రబంద్ పిలుపును పునఃసమీక్షించుకోవాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తిరవి సూచించారు. గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణపై కేంద్రంతో కొట్లాడాల్సింది పోయి రాష్ట్రంలో బంద్ ఎందుకని ప్రశ్నించారు. బంద్‌ను ఉపసంహరించుకొని ఢిల్లీలో కొట్లాడాలని, దీనికి తాము కూడా మద్దతు ఇస్తామని రవి ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రజలు, పార్టీలు, ప్రజాసంఘాలు, ఏబీసీడీ వర్గీకరణకు మద్దతిచ్చాక, వారిని ఇబ్బంది పెట్టడమేంటని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వర్గీకరణ చేయకుండా రాష్ట్రబంద్‌కు మద్దతు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటిని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణ చేయకుండా ఇక్కడ బంద్‌కు మద్దతు ఇవ్వడం హాస్యాస్పదమని ఎద్దేవాచేశారు. మందకృష్ణకు దమ్ముంటే ఢిల్లీ బంద్‌కు పిలుపునివ్వాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారని, వారికి ఇబ్బంది కలిగించకుండా బంద్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బంద్‌కు మద్దతివ్వడం కాకుండా బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.




గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిడమర్తి రవి

**వృత్తినైపుణ్య శిక్షణలు వినియోగించుకోవాలి**

వృత్తినైపుణ్య శిక్షణలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిడమర్తి రవి పిలుపునిచ్చారు. బీటెక్ సివిల్, ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు మూడునెలల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా గురువారం న్యాక్‌లో సర్టిఫికెట్ల ప్రదానం చేశారు.

## సీఎం కేసీఆర్ నిర్ణయం హర్షణీయం

- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంబీసీలకు సంబంధించిన ఆర్థిక సహకార సబ్సిడీ పథకాల ఫైలుపై సీఎం కేసీఆర్ తగిన నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన కులాల ఆర్థిక, సామాజిక ప్రగతిపై ప్రత్యేక దృష్టిపెట్టడం రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని ఆయన పేర్కొన్నారు.

# దంచికొడుతున్న ఎండలు!

- ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు!
- వడగాలుల తీవ్రత ఎక్కువేనన్న వాతావరణశాఖ అధికారులు
- పంటలపైనా ఎండల ప్రభావం ఉంటుంది: వ్యవసాయ శాస్త్రవేత్తలు

**(నాగోజు సత్యనారాయణ, నమస్తే తెలంగాణ, హైదరాబాద్):** ఎండల తీవ్రత ఏటికేడాది క్రమంగా పెరుగుతున్నది. గత కొన్ని దశబ్దాలుగా పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామీకరణతో కాలుష్యం అధికమవుతున్నదని, ఈ కారణంగానే ఉష్ణోగ్రతల్లోనూ పెరుగుదల నమోదవుతున్నట్టు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం పెరుగడంతో ప్రపంచవ్యాప్తంగా 1900 నుంచి ఇప్పటివరకు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.9 డిగ్రీల నుంచి ఒక డిగ్రీ సెల్సియస్ మేర పెరిగినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. పట్టణాల్లో వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్య కారకాల్లోని కర్బనకారణాలు పెరుగడం, చెట్లను నరికేస్తుండటంతో అటవీశాతం తగ్గి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతున్నదని ఆయన వివరించారు. యూఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ స్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం ప్రకారం దశాబ్దానికి సగటున ఉష్ణోగ్రత 0.17 డిగ్రీల సెల్సియస్ పెరుగుతున్నదని తెలిపింది. నాసా లెక్కల ప్రకారం1951 నుంచి 1980 మధ్య నమోదైన సగటు ఉష్ణోగ్రతలతో పోలిస్తే 2017లో నమోదైన సగటు ఉష్ణోగ్రత 0.9 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని వెల్లడైంది. కాలుష్యాన్ని తగ్గించే చర్యలపై దృష్టి పెట్టకపోతే ఉష్ణోగ్రతలు మరింత పెరిగి ముప్పువాటిల్లే ప్రమాదాలు ఉన్నట్టు వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**ఉత్తర తెలంగాణపైనే వడగాలుల తీవ్రత అధికం**

ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి జిల్లాలు వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ పరిధిలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వాయువ్యం నుంచి వచ్చే వేడిగాలులే ఇందుకు కారణమని వారు పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలల్లో 46 డిగ్రీల సెల్సియస్‌పైనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా ఈ సారి ఎండల తీవ్రత పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**హైదరాబాద్‌లో ముదురుతున్న ఎండలు..**

ఉష్ణోగ్రతలు పెరుగడంతో హైదరాబాద్‌లో ఎండలు ముదురుతున్నాయి. గతవారంరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతుండటంతో మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉం టున్నది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం 8.30గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.


**వేసవి కార్యాచరణ ప్రణాళికతో సిద్ధమైన సర్కార్**

ఈ వేసవిలో ఎండలు, వడగాలుల తీవ్రత అధికంగా ఉండనుందన్న ముందస్తు సంకేతాలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.

**రాష్ట్రంలో ఇప్పటివరకు రికార్డుస్థాయిలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు సెల్సియస్ డిగ్రీల్లో (ఐఎండీ సమాచారం ప్రకారం)**

| వాతావరణ కేంద్రం | నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రత | తేదీ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 46.8 | 05-06-1995 |
| భద్రాచలం | 48.6 | 09-05-1973 |
| హన్మకొండ | 47.8 | 03-06-2003 |
| హైదరాబాద్ | 45.5 | 02-06-1966 |
| ఖమ్మం | 47.6 | 22-05-2015 |
| మహబూబ్‌నగర్ | 45.3 | 30-04-1973<br>22-05-2016 |
| మెదక్ | 46.3 | 18-05-2006 |
| నల్లగొండ | 47 | 22-05-2015 |
| నిజామాబాద్ | 47.3 | 22-05-2005 |
| రామగుండం | 47.3 | 24-05-1984 |

**ఈ సారి ఎండల తీవ్రత ఎక్కువే**



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయిలో 46 నుంచి 47 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే రోజుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది.

- వైకే రెడ్డి, హైదరాబాద్ వాతావరణ కేంద్రం, డైరెక్టర్


**ప్రతి గంటకు సమాచారం ఇస్తున్నాం..**



టీఎస్‌డీపీఎస్ ఆధ్వర్యంలో 855 స్టేషన్లలో ప్రతి గంటకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు చేస్తున్నాం. ఉష్ణోగ్రతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్ని శాఖల అధికారులకు అందుబాటులో ఉంచుతున్నాం.

- ఎస్కే మీరా, సీఈవో, టీఎస్‌డీపీఎస్


**నీటి తడులు ఇవ్వడం మంచిది**



ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పంటలకు సరిపడానీరు అందక దిగుబడి దెబ్బతినే పరిస్థితి ఉంటుంది. వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీటి తడులు ఇవ్వడం మంచిది.

– రాజిరెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం

**దిగుబడి తగ్గే ప్రమాదం..**



ప్రస్తుతం వరి పూత దశకు వచ్చింది. గింజ ఏర్పాటుకు ఇప్పుడు అత్యంత కీలక సమయం. ఎండలు తీవ్రం కావడంతో నీటిలభ్యత తగ్గుతున్నది. ఆరుతడి మాదిరిగా నీళ్లు ఒక మడి తడిసిన తర్వాత మరో మడికి పెట్టుకోవాలి.

- జగదీశ్వర్, వరి పరిశోధన విభాగం అధిపతి, అగ్రివర్సిటీ

# కేంద్ర మంత్రి పదవులకు టీడీపీ గుడ్‌బై

- అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి రాజీనామా
- ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖలు
- అధినేత ఆదేశం మేరకే రాజీనామా..
- ఎన్డీయేలో కొనసాగుతాం:సుజనాచౌదరి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాలుగేండ్లు బీజేపీతో మిత్రబంధాన్ని కొనసాగించి కేంద్ర మంత్రివర్గంలో చేరిన టీడీపీ గురువారం ఆ పదవులకు గుడ్‌బై చెప్పింది. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి తమ మంత్రి పదవులకు రాజీనామాలు చేశారు. నేరుగా దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి రాజీనామా పత్రాలను ఆయనకు అందించారు. ఇప్పటిదాకా అశోక్‌గజపతిరాజు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా, సుజనాచౌదరి శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా వ్యవహరించారు. మంత్రి పదవులకు రాజీనామా చేసినప్పటికీ ఎన్డీయేలో ఎంపీలుగా కొనసాగుతున్నామని ప్రకటించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని తాజా మాజీలు ప్రకటించారు. రాష్ట్రాల పునర్విభజన చట్టంలో ఉన్న వాటిని సాధించుకోవడం, పార్లమెంట్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలను సాధించుకోవడం కోసం ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి గురువారం సాయంత్రం మీడియాతో అన్నారు. ప్రత్యేక హోదా సాధించుకోవడం కోసం శాయశక్తులా కృషి చేశామని, కేంద్రం ఏపీ అభివృద్ధికి సహకరిస్తుందని ప్రభుత్వంలో చేరామని చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, ప్రత్యేక ప్యాకేజీ ద్వారా హోదా కంటే ఎక్కువ మొత్తంలో సాయం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు ప్రత్యేక ప్యాకేజీతో కూడా ఎలాంటి సాయం అందించలేదని వారన్నారు. అందుకే ఏపీలో ప్రజల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పరిస్థితి చేయిదాటి పోవడంతో అధినేత చంద్రబాబు ఆదేశం మేరకు తమ మంత్రి పదవులకు రాజీనామా చేశామని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదాపై ఉధృతపోరు చేసేందుకు సంపూర్ణ స్వేచ్ఛతో ముందుకు సాగుతామన్నారు.

**చంద్రబాబుకు మోదీ ఫోన్**

కేంద్ర మంత్రులు పదవులకు రాజీనామా చేయక ముందు ఏపీ సీఎం చంద్రబాబుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ10 నిమిషాలు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం, కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలపై పునరాలోచన చేయాలని ప్రధాని కోరినట్లు తెలిసింది. చంద్రబాబు ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని కోరినట్లు సమాచారం.

**తప్పుడు ప్రచారంతో చంద్రబాబుపై ఒత్తిడి: కేంద్ర మంత్రి అనంత్‌కుమార్**

కాంగ్రెస్, వైసీపీ తప్పుడు ప్రచారంతో ఏపీ సీఎం చంద్రబాబుపై రాజకీయంగా ఒత్తిడి చేస్తూ వచ్చిన్నానికి కారణమయ్యాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాపై తప్పుడు ప్రచారం చేయడంవల్ల చంద్రబాబు.. మంత్రుల రాజీనామాకు నిర్ణయం తీసుకున్నారని గురువారం ఢిల్లీలో మీడియాతో చెప్పారు.

**ఇంకా ఎన్డీయేలో ఎందుకు?: చంద్రబాబుకు జగన్ ప్రశ్న**

కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేసిన టీడీపీ ఇంకా ఎన్డీయేలో ఎందుకు కొనసాగుతున్నదని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. చంద్రబాబును ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమని 2016లోనే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారని, ఇప్పుడు కూడా ఆయన స్పెషల్ ప్యాకేజీపైనే మాట్లాడుతున్నారని జగన్ గురువారం మీడియాతో అన్నారు. రాష్ట్రంలో వైసీపీ, వామపక్షాలకు పెరుగుతున్న ఆదరణను చూసి ఏమి చేయాలో తెలియక చంద్రబాబుకు అయోమయంలో పడ్డారని వ్యాఖ్యానించారు. జనంలో తిరుగలేమనే కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించారని అన్నారు.

**ఏపీలో మంత్రి పదవులకు బీజేపీ రాంరాం**

**హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ:** ఏపీ ప్రభుత్వంలో బీజేపీ మంత్రుల కొనసాగింపుపై సందిగ్ధానికి గురువారంతో తెరపడింది. కేంద్రంలో ఎన్డీయే భాగస్వామ్యం నుంచి తప్పుకునే దిశగా ఏపీ సీఎం చంద్రబాబు అడుగు ముందుకు వేయడంతో బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఏపీ మంత్రివర్గం నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు, దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి పీ మాణిక్యాలరావు వైదొలిగారు. అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఇద్దరూ తమ రాజీనామా లేఖలను ఆయనకు అందజేశారు.

**వెంకయ్యను ద్రోహిగా చిత్రీకరించడం బాధాకరం**

అసెంబ్లీలో మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ.. తప్పనిసరి పరిస్థితుల్లోనే రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. విభజన బిల్లు రాజ్యసభకు వచ్చినప్పుడు పోరాడిన ఏకైక నాయకుడు వెంకయ్యనాయుడని, అలాంటి నేతని ఇప్పుడు ద్రోహిగా చిత్రీకరించడం బాధగా ఉందని పేర్కొన్నారు. శాసనసభలో మంత్రిగా రాజీనామా చేసినట్టు ప్రకటించిన కామినేని రాజకీయాల్లో మంత్రి పదవి తాత్కాలికమే అని భావించి పనిచేశానని, అందుకే ఇప్పుడు రాజీనామా చేసినా బాధపడటం లేదన్నారు.

**చిన్న నిర్ణయం.. అది కూడా ఆలస్యమే: కాంగ్రెస్**

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం వెనుకడుగువేస్తే టీడీపీ మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయడం చిన్న నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. పైగా ఇది ఎంతో ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమని ఎద్దేవా చేసింది. ఈ రాజకీయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు ఢిల్లీలో మీడియాతో అన్నారు. మంత్రి పదవులకు రాజీనామాలు చేసి ఎన్డీయేకు మద్దతు కొనసాగించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో టీడీపీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# హరితహారంలో వెదురు పెంపకం

- వాణిజ్యపరంగా పెంచేలా రైతులకు అవగాహన
- ఇతర రాష్ట్రాల్లో వెదురు పరిశ్రమను పరిశీలించనున్న అటవీశాఖ
- బ్యాంబూ సొసైటీ ఇండియా ప్రతినిధులతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం వెదురు పెంపకం, రవాణాపై ఉన్న ఆంక్షలను తొలగించడంతో చిన్న, సన్నకారు రైతులతోపాటు మేదరులకు దీనిని ఆదాయవనరుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. వెదురుపెంపకం, పరిశ్రమలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు హరితహారంలో భాగంగా వెదురు పెంచేందుకు రైతులను ప్రోత్సహించాలని, వెదురు, దాని ఉత్పత్తులకు వాణిజ్యపరంగా మార్కెట్ సాధ్యాసాధ్యాలపై అటవీశాఖ ఉన్నతాధికారులు అధ్యయనం చేస్తున్నారు. దీనిలోభాగంగా గురువారం అరణ్యభవన్‌లో బ్యాంబూ సొసైటీ ఆఫ్ ఇండియా సలహామండలి వైస్‌చైర్మన్ ఆర్‌కే మెహతాతో సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ పీకే ఝా, అదనపు అటవీ సంరక్షణాధికారి ఆర్‌ఎం డోబ్రియల్ తదితరులు సమావేశమయ్యారు. ఇతర రాష్ట్రాల్లో వెదురు పరిశ్రమ తీరుతెన్నులు, వాణిజ్యపరంగా మార్కెట్ కోసం అక్కడ జరుగుతున్న ప్రయత్నాలు, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను మెహతా వివరించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత వెదురు పెంపకానికి అనువుగా ఉంటాయని, ఆ దిశగా రైతులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు ఉంటాయని సమావేశంలో అభిప్రాయపడ్డారు. మధ్యప్రదేశ్, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల్లో వాణిజ్యపరంగా వెదురు రైతులకున్న ప్రోత్సాహకాలను రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల బృందం త్వరలో అధ్యయనం చేయనున్నది. రైతులను వెదురు పెంపకానికి ప్రోత్సహించడం, ఆ పంటను మేదర సొసైటీ ద్వారా ఉత్పత్తులుగా మార్చడం, వాటిని వివిధ ప్రభుత్వ విభాగాల్లో కొనుగోలు చేసే విధంగా అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని బ్యాంబూ సొసైటీ ప్రతినిధులు వివరించారు. అదేవిధంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఎన్‌ఐఆర్డీ, దూలపల్లి ఫారెస్ట్ అకాడమీల సహకారంతో రైతులను వెదురు పెంచేందుకు ప్రోత్సహించనున్నారు. మేదర సంఘం ప్రతినిధులతోపాటు, ఇప్పటికే వెదురును పండిస్తున్న రైతులతో అటవీశాఖ అధికారులు త్వరలో సమావేశం కానున్నారు.



గురువారం అరణ్యభవన్‌లో బ్యాంబూ సొసైటీ సలహామండలి వైస్‌చైర్మన్ ఆర్కే మెహతాతో సమావేశమైన సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ పీకే ఝా తదితరులు

## జిల్లాల్లో ఉద్యోగుల మహాసభ సదస్సులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో ఈ నెల 25న సకల ఉద్యోగుల మహాసభ నిర్వహించనున్న సందర్భంగా.. ముందస్తుగా అన్ని జిల్లాల్లో సమాయత్త సదస్సులను జరుపనున్నట్టు తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోని కాంట్రిబ్యూటరీ స్కీం ఉద్యోగులు సదస్సులకు హాజరుకావాలని కోరారు. శుక్రవారం జిల్లాలవారీగా సదస్సులను నిర్వహించే తేదీలను ప్రకటిస్తారు. పాత జిల్లా కేంద్రాల తరహాలోనే కొత్త జిల్లాకేంద్రాల్లోనూ హెచ్‌ఆర్‌ఏ సదుపాయాలను కల్పించాలని, మే నెలలో బదిలీలు చేపట్టాలని జేఏసీ నాయకులు కోరారు.

## సీజీజీకి డిగ్రీ ప్రవేశాల బాధ్యతలు

- మే లో దోస్త్ నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణ బాధ్యతను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)కి అప్పగించాలని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) అధికారులు నిర్ణయించారు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, శాతవాహన విశ్వవిద్యాలయాల పరిధిలోని ప్రైవేటు కళాశాలల అఫిలియేషన్ ప్రక్రియ ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆయావర్సిటీలకు దోస్త్ అధికారులు లేఖలు రాశారు. మే నెలలో దోస్త్-2018 నోటిఫికేషన్‌ను జారీచేసేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నామని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల విధానంలో ఈ సారి కొన్ని మార్పులు చోటుచేసుకోనున్నాయి. దోస్త్ కౌన్సెలింగ్ కేంద్రాల పెంపుతోపాటు ప్రవేశాల కోసం మొబైల్‌యాప్‌ను రూపొందించనున్నారు. ప్రవేశాల ప్రక్రియ అనంతరం మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేసుకునే వెసులుబాటుపై దోస్త్ అధికారులు త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. మూడురోజుల్లో దోస్త్ అధికారులు స్పష్టత రానున్నది. 2017-18 విద్యాసంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి 51 ప్రైవేటు కళాశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి. దీంతో 2018-19 విద్యాసంవత్సరానికి సంబంధించి దాదాపు 1.5 లక్షల సీట్లు తగ్గనున్నాయని, 2.60 లక్షల సీట్లు మాత్రమే ఈ సారి దోస్త్ కౌన్సెలింగ్ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారుల అంచనా. ఏప్రిల్ నెలాఖరులోగా సీట్ల తగ్గింపుపై తుదినిర్ణయం వచ్చే అవకాశాలున్నాయని, ఆ తర్వాత దోస్త్ నోటిఫికేషన్ విడుదలకానుంది.

## ఆధునిక సేద్యంలో నైపుణ్యం అవసరం

- వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాలకుడు డాక్టర్ టీ ప్రదీప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధునిక వ్యవసాయంలో నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ టీ ప్రదీప్ అన్నారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని నీటిసాంకేతిక పరిజ్ఞాన కేంద్రంలో 'గ్రీన్‌హౌజ్ ఆపరేటర్' పై నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హరిత గృహాల నిర్వహణపై ఇచ్చిన ఈ శిక్షణను అభ్యర్థులు ప్రాక్టికల్‌గా అమలు జరిపినప్పుడే ఈ శిక్షణకు సార్థకత ఉంటుందని చెప్పారు. నేర్చుకొన్న అంశాలతో నైపుణ్యం సాధిస్తే ఉద్యోగాలు, స్వయంఉపాధి మొదలు పెట్టి మరికొందరికి ఉపాధి చూపవచ్చన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదీప్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసకుమార్, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## రెండో కేసులో బినామీ శ్రీనివాస్‌రెడ్డి అరెస్ట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జైలులో ఉన్న హెచ్ఎండీఏ డైరెక్టర్ (సస్పెన్షన్) పురుషోత్తంరెడ్డితోపాటు అతడికి బినామీ శ్రీనివాస్‌రెడ్డిపై ఓ బిల్డర్‌ను బెదిరించి తక్కువ ధరకు ఫ్లాట్ కొనుగోలు చేసిన వ్యవహారంలో మరో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో కోర్టు అనుమతితో బుధవారం జైలులో ఉన్న పురుషోత్తంరెడ్డిని అదుపులోకి తీసుకున్న అధికారులు, కోర్టులో హాజరు పరిచి తిరిగి జైలుకు తరలించారు. అదేవిధంగా గురువారం జైలులో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని కూడా న్యాయస్థానం ముందు హాజరు పర్చి.. తిరిగి జైలుకు తరలించారు. బిల్డర్‌ను బెదిరించిన కేసులో పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను కస్టడీకి తీసుకొని విచారించేందుకు ఏసీబీ సిద్ధమవుతున్నది. వీరిద్దర్నీ విచారిస్తే ఆస్తులకు సంబంధించిన చాలా సమాచారం వస్తుందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారులు పురుషోత్తంరెడ్డి, ఆయన భార్య యాదమ్మ, బావమరిది శ్రీనివాస్‌రెడ్డిల పేర్లతో ఉన్న ఆస్తులను పరిశీలిస్తున్నారు. ఉప్పల్‌లో దాదాపు రూ.125 కోట్ల ప్రాజెక్టు చేపట్టిన యాదిరెడ్డి.. దానికి సంబంధించిన లెక్కలు చూపడంలో విఫలమైనట్టు తెలిసింది. ఆ ప్రాజెక్టుకు బ్యాంకు నుంచి కేవలం రూ.15 కోట్లు మాత్రమే ఆయన తీసుకున్నట్టు అధికారుల దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. మిగిలిన దాదాపు రూ.125 కోట్ల నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరిచ్చారు? అన్న కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

## ఏపీ బడ్జెట్ రూ.1,91,063.61 కోట్లు

- అసెంబ్లీకి సమర్పించిన ఆర్థికమంత్రి యనమల

**హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,91,063.61 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు గురువారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు సాయం అందడంలేదని, విభజనలో ఆదాయాన్ని, రాజధానిని కోల్పోయిన రాష్ట్రానికి తీరని నష్టం కలిగించిందని ఈ సందర్భంగా యనమల పేర్కొన్నారు. అసమంజసంగా జరిగిన విభజన వల్ల రాష్ట్రానికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కేంద్రం నుంచి సకాలంలో అందని సాయం సమస్యను మరింత జటిలం చేసిందన్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకుని ముందుకెళ్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్రం ఉదాసీనత కనబరచకపోతే మరింత అభివృద్ధి సాధించేవాళ్లమని అభిప్రాయపడ్డారు. హామీల అమలుకు, ఇతర రాష్ట్రాలతో సమానంగా నిలవడానికి పట్టుదలతో పోరాడుతామన్నారు. మూడేళ్లలో జాతీయ సగటు వృద్ధి 7.30 శాతంతో పోలిస్తే, రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయ బడ్జెట్‌ను గురువారం ఆయన శాసనమండలిలో ప్రవేశపెట్టారు.

**మహిళా దినోత్సవాన్ని మర్చిపోయిన చంద్రబాబు**

ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో గురువారం సీఎం చంద్రబాబునాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మర్చిపోయారు. ప్రత్యేకంగా ఈ అంశంపై మాట్లాడాలని స్పీకర్ కోడెల శివప్రసాద్ కోరగా తన సీట్లో నుంచి లేచిన ఆయన ఆ విషయం కాకుండా ఇతర విషయాలు మాట్లాడారు.

11 నెలల్లో వసూలైన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

## రూ.7.44 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ, మార్చి 8:** ప్రత్యక్ష పన్ను వసూళ్లు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి మధ్యకాలం(11 నెలల)లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 19.5 శాతం పెరిగి రూ.7.44 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. కార్పొరేట్ పన్ను వసూళ్లు భారీగా పుంజుకోవడం ఇందుకు దోహద పడిందని తెలిపింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను గత నెలలో పార్లమెంట్‌కు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో అంచనావేసిన రూ.10.05 లక్షల కోట్ల నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 74.3 శాతానికి చేరుకున్నట్లు అయింది. మొత్తం మీద గడిచిన పదకొండు నెలల్లో రూ.8.83 లక్షల కోట్ల పన్ను వసూలయ్యాయి. వీటిలో రూ.1.39 లక్షల కోట్లను రీఫండ్ కింద వసూలైనట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. కార్పొరేట్ పన్ను 19.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, వ్యక్తిగత ఆదాయ పన్నులో 18.6 శాతం చొప్పున పెరిగాయి.

ఎయిర్‌టెల్-టెలినార్ విలీనానికి

## ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

**న్యూఢిల్లీ, మార్చి 8:** భారతీ ఎయిర్‌టెల్‌లో ప్రతిపాదిత టెలినార్ ఇండియా విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గురువారం ఆమోదం తెలిపింది. గతేడాది ఫిబ్రవరిలో ఎయిర్‌టెల్, టెలినార్ విలీన ఒప్పందాన్ని కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ (తూర్పు), ఉత్తరప్రదేశ్ (పశ్చిమ), అసోం సర్కిళ్లలోని టెలినార్ ఇండియా కార్యకలాపాలు.. ఎయిర్‌టెల్ సొంతం కానున్నాయి. టెలినార్ ఇండియా ఆస్తులతోపాటు కస్టమర్లు కూడా ఎయిర్‌టెల్‌కే చెందనున్నారు. ఇప్పటికే ఈ విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), మార్కెట్ రెగ్యులేటర్ సెబీ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు అంగీకారం తెలిపాయి. అయితే టెలికం శాఖ అనుమతి రావాల్సి ఉన్నది. టెలినార్ విలీనంతో ఎయిర్‌టెల్ వినియోగదారుల సంఖ్య, స్పెక్ట్రమ్ పరిధి పెరుగనున్నాయి.

## అపోలోతో మైక్రోసాఫ్ట్ దోస్తీ

- కార్డియాలజీలో నూతన ఆవిష్కరణల కోసం భాగస్వామ్యం

**న్యూఢిల్లీ, మార్చి 8:** హెల్త్‌కేర్ దిగ్గజం, రాష్ర్టానికి చెందిన అపోలో హాస్పిటల్స్.. అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో దోస్తీ కట్టింది. కార్డియాలజీలో కృత్రిమ మేధస్సు ఆధారిత నెట్‌వర్క్ సృష్టి కోసమే అపోలో, మైక్రోసాఫ్ట్‌లు చేతులు కలిపాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా గుండె సంబంధిత వ్యాధుల్లో పేషంట్‌కున్న ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేయడానికి కావాల్సిన సరికొత్త యాంత్రిక విధానాలను అభివృద్ధి చేయడం కోసం అపోలో, మైక్రోసాఫ్ట్‌లు కలిసి పనిచేయనున్నాయి. అలాగే చికిత్సలో వైద్యులకు సహాయకారిగా నిలిచే విధానాలను ఆవిష్కరించనున్నాయి. ఈ మేరకు ఇరు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. కాగా, హృద్రోగ సమస్యలే దేశంలో మరణాలకు, ఇతర రోగాలకు ఎక్కువగా దారితీస్తున్నాయని అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

## బాంబే హైకోర్టులో ఆర్‌కామ్‌కు చుక్కెదురు

**ముంబై, మార్చి 8:** ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఆదేశానికి వ్యతిరేకంగా బాంబే హైకోర్టును ఆశ్రయించిన ఆర్‌కామ్‌కు చుక్కెదురైంది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రుణపీడిత రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఆస్తుల విక్రయంపై ట్రిబ్యునల్ ఇటీవల నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్‌కామ్ హైకోర్టుకు వెళ్లగా, గురువారం ఈ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఆర్‌కామ్ నుంచి బకాయిలు రాబట్టుకోవడానికి స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్ ప్రయత్నాలు చేసిన నేపథ్యంలో బ్యాంకుల ప్రయోజనాలు ముఖ్యమంటూ సంస్థ ఆస్తుల విక్రయంపై ట్రిబ్యునల్ ఆంక్షలు విధించింది. దీన్ని వ్యతిరేకిస్తూనే బుధవారం హైకోర్టులో ఆర్‌కామ్ పిటిషన్ దాఖలు చేసింది. గతేడాది మార్చినాటికి బ్యాంకులకు ఆర్‌కామ్ బకాయిలు రూ.45,000 కోట్లుగా ఉన్నాయి. ఆర్‌కామ్ మొబైల్ వ్యాపారం కొనుగోలుకు జియో ఒప్పందం కూడా కుదుర్చుకున్న సంగతీ విదితమే. ఈ నెలలో ఇది ముగిసే వీలున్నది.

## పీఎస్‌బీలకు 46 వేల కోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 8:** ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)కు మూలధన సాయంలో భాగంగా ఈ నెలలో పన్నెండుకుపైగా బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.46,101 కోట్లు రానున్నాయి. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీవోబీ, సెంట్రల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఓబీసీ తదితర బ్యాంకులకు ఈ నిధులు అందనుండగా, ఇందుకు బదులుగా ఈ బ్యాంకుల షేర్లు ప్రభుత్వం చేతికి రానున్నాయి. సర్కారుకు ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకుగాను ఈ నెలలో వాటాదారుల సమావేశాలకూ ఈ బ్యాంకర్లు పిలుపునిచ్చారు. ఇక ఎస్‌బీఐకి అత్యధికంగా రూ.8,800 కోట్లు, పీఎన్‌బీకి రూ.5,473 కోట్లు దక్కనున్నాయి. బాసెల్-3 నిబంధనలను అందుకోవడంలో భాగంగా ఈ నిధుల కేటాయింపులు జరుగుతున్న విషయం తెలిసిందే.

## వరంగల్‌లో ఉబర్‌మోటో సేవలు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో అందిస్తున్న ఉబర్‌మోటో సేవలను రాష్ట్రంలోని ముఖ్య నగరాలకు విస్తరించాలని ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ నిర్ణయించింది. దీనికోసం రవాణా శాఖను సంప్రదించింది. తొలుత వరంగల్‌లో ప్రారంభించి దశలవారీగా కరీంనగర్, నిజామాబాద్‌లకు విస్తరించాలని కంపెనీ ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు గురువారం జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పాండురంగనాయక్‌ను కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు.

# వెతుకుతున్నాం

**ఎయిర్ ఇండియాలో వాటా విక్రయానికి**

**పౌర విమానయాన కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే**



హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2018లో మంత్రి కేటీఆర్, పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్‌ఎన్ చౌబే

**హైదరాబాద్, మార్చి 8:** అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాలో వాటా విక్రయాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. ఈ సంస్థను కొనుగోలు చేయాలనుకునేవారిని వచ్చే కొన్ని వారాల్లో ఆహ్వానించనున్నట్లు పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ ఎన్ చౌబే తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఏరోస్పెస్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'వింగ్స్ ఇండియా 2018' విమానాల పండుగను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎయిర్ ఇండియా విక్రయంతోపాటు ఇదే సమయంలో పవన్ హన్స్‌లో వాటాను విక్రయించనున్నట్లు ప్రకటించారు. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసే సంస్థ కోసం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు, అత్యంత వేగవంతంగా ఈ పనిని పూర్తి చేయాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రుణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సంస్థను ప్రైవేటీకరించడానికి గతేడాది జూన్‌లో కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. గడిచిన మూడేండ్లకాలంలో భారత్‌లో విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య 20 శాతం చొప్పున పెరుగుతున్నప్పటికీ.. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతో ఈ ఏడాది వృద్ధి 17.5 శాతానికి పరిమితం కానున్నదని ఆయన పేర్కొన్నారు. బ్యారెల్ ఇంధన ధర 80 డాలర్ల కంటే తక్కువగా ఉంటే వచ్చే 20 ఏండ్లకాలంలో యేటా విమానయాన రంగం 15 శాతం వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రాంతీయంగా విమాన సేవలు అందించే ఉద్దేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉడాన్ స్కీంను ప్రవేశపెట్టిందన్న ఆయన.. ఈ స్కీం కింద గడిచిన రెండేండ్లలో 56 నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే 6-8 నెలల్లో మరిన్ని విమానాశ్రయాలు అందుబాటులోకి రావొచ్చన్నారు.

**స్టార్టప్‌లతో ఎయిర్‌బస్ ఒప్పందం**

భారత్‌కు చెందిన రెండు స్టార్టప్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూరప్‌కు చెందిన విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ ప్రకటించింది. టెక్నాలజీ రంగంలో ఎదురైతున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో నీవీ, ఈఫ్లైట్ స్టార్టప్‌లతో జతకట్టినట్లు ఎయిర్‌బస్ బిజ్‌ల్యాబ్ హెడ్ బ్రూనో తెలిపారు. తొమ్మిది దేశాల నుంచి 137 దరఖాస్తులు రాగా, వీటిలో ఐదింటిని గతేడాది ఎంపిక చేసింది. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లో రెండింటితో ఒప్పందం కుదుర్చుకున్నది.

**విస్తరణబాట పట్టిన విస్తారా**

దేశీయ రూట్లలో విమాన సేవలు అందిస్తున్న విస్తారా..ఇకపై అంతర్జాతీయ రూట్లపై దృష్టి సారించింది. ప్రస్తుత సంవత్సరం రెండో అర్ధభాగం నుంచి ఆగ్నేయాసియా దేశాలకు సర్వీసులను నడుపనున్నట్లు కంపెనీ సీఈవో లెస్లీ థంగ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా 2018' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం 19 విమానాలతో సేవలు అందిస్తుంగా, ఈ నెల చివరి నాటికి మరో ఎయిర్‌క్రాఫ్ట్ అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. టాటా, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లు కలిసి ఈ విమానయాన సంస్థను ఏర్పాటు చేశాయి. మరో రెండు ఏ320 నియో విమానాలను లీజ్‌కు తీసుకోవడం జరిగిందని, మే లేదా జూన్ నాటికి వచ్చే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ విస్తరణలో భాగంగా వచ్చే రెండేండ్లలో అమెరికాకు కూడా విమానాలు నడుపాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**జెట్‌లోకి 75 చిన్న విమానాలు**

జెట్ ఎయిర్‌వేస్ మరిన్ని చిన్న విమానాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నెల చివరిలోగా 75 చిన్న తరహా విమానాలను ఆర్డర్ చేయనున్నట్లు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినయ్ దూబే తెలిపారు. ఈ నెల 31లోగా ఖరారుకానున్న ఈ ఒప్పందంపై విమానయాన తయారీ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు.

### నాలుగేండ్లలో రూ.18 వేల కోట్ల పెట్టుబడులు: ఏఏఐ

ప్రభుత్వరంగ సంస్థ ఎయిర్‌పోర్ట్ ఆథార్టీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే నాలుగేండ్ల కాలంలో వ్యాపారాన్ని భారీగా విస్తరించడానికి, విమానాశ్రయాలను ఆధునీకరించడానికి రూ.18 వేల కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు చౌబే ప్రకటించారు. ఏఏఐ సవరణ బిల్లుపై సర్వత్ర ఆందోళన వ్యక్తమవుతున్నదని, ఈ బిల్లు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలు లేదా ఆ తర్వాత జరిగే సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఈ సవరణ బిల్లు మోక్షం లభించాలంటే కనీసం ఆరు నెలల పట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఉడాన్ స్కీం కింద రాష్ట్ర ప్రభుత్వాలకు రాయితీలు ఇచ్చే అవకాశాలు లేవని చౌబే స్పష్టంచేశారు. ఇటీవల కాలంలో చిన్న స్థాయి నగరాలకు సైతం విమాన సేవలు అందించడానికి కేంద్రం రాయితీలు ఇస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన ఈ విధంగా స్పందించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిధులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మార్గనిర్దేశం మాత్రమే చేయనున్నామని, తుది నిర్ణయం మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాంతీయంగా చౌక ధరకే విమాన సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ ఉడాన్ స్కీంను ప్రవేశపెట్టిందని, అలాగే అంతర్జాతీయ రూట్లలో సేవలు అందించడానికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చుకోవాలని, లేకపోతే రుణాల రూపంలో సమకూర్చనున్నట్లు చెప్పారు. దీనిని 'ఉడాన్ ఇంటర్నేషనల్'గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. భారత్‌లో విమానయాన రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, దీంతో వచ్చే ఐదు నుంచి ఆరేండ్లకాలంలో 8 వేల నుంచి 10 వేల మంది విమాన చోదకులు అవసరమవుతారని ఆయన పేర్కొన్నారు.

## లాభాలొచ్చాయ్

- వాణిజ్య యుద్ధ భయాలు తొలుగుతున్న సంకేతాలు
- వరుస నష్టాల నుంచి కోలుకున్న సూచీలు
- సెన్సెక్స్ 318, నిఫ్టీ 88 పాయింట్లు వృద్ధి



**ముంబై, మార్చి 8:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చాయి. వరుస నష్టాల నుంచి కోలుకున్న సూచీలు.. గురువారం ట్రేడింగ్‌లో ఆకర్షణీయ స్థాయిలో పరుగులు పెట్టాయి. అంతర్జాతీయ విపణిలో అమెరికా సృష్టించిన వాణిజ్య యుద్ధ భయాలు తొలిగిపోతున్న సంకేతాలు రావడంతో మదుపరులు మళ్లీ పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 318.48 పాయింట్లు పుంజుకుని 33,351.57 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 88.45 పాయింట్లు అందిపుచ్చుకుని 10,242.65 వద్ద నిలిచింది. వరుసగా ఆరు రోజులపాటు స్టాక్ మార్కెట్లు నష్టాలకే పరిమితమైన విషయం తెలిసిందే. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచుతామని డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం, పీఎన్‌బీ కుంభకోణం మధ్య మదుపరులు కొనుగోళ్లకు దూరంగానే ఉండిపోయారు. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలూ తోడవడంతో స్టాక్ మార్కెట్లకు లాభాలే కరువయ్యాయి. అయితే వివాదాస్పద మెటల్ టారీఫ్‌ల విషయంలో వైట్‌హౌజ్ వర్గాలు వెనుకకు తగ్గుతున్న అవకాశాలు కనిపిస్తుండడంతో మదుపరులు తిరిగి కొనుగోళ్లకు ముందుకొచ్చారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు లాభాల్లో కదలాడటం కూడా కలిసొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉక్కు, అల్యూమినియం సంస్థల షేర్లకు పెద్ద ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించింది. నాల్కో, హిందుస్థాన్ జింక్ షేర్ల విలువ 1.83 శాతం, 1.15 శాతం మేర ఎగిసింది. జిందాల్ స్టీల్, ఎన్ఎండీసీ, సెయిల్, జెఎస్ డబ్ల్యు స్టీల్ షేర్ల విలువ కూడా 0.84 శాతం వరకు పెరిగింది. మరోవైపు భూషణ్ స్టీల్ షేర్ విలువ 16.26 శాతం ఎగబాకగా, పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఈ సంస్థను టాటా స్టీల్ దక్కించుకునే అవకాశాలు కనిపిస్తుండటంతోనే భారీ లాభాలొచ్చాయి. అయితే ఇదే కారణంతో టాటా స్టీల్ షేర్ల విలువ 1.98 శాతం పడిపోవడం గమనార్హం. ఇక ఎస్‌బీఐ షేర్ విలువ సైతం 4.09 శాతం పెరుగగా, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మహీంద్రా, ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఏషియన్ పెయింట్స్, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, మారుతి సుజుకీ, పవర్ గ్రిడ్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో షేర్ల విలువ కూడా 2.13 శాతం పెరిగాయి.

### 15న బంధన్ బ్యాంక్ ఐపీవో

కోల్‌కతాకు చెందిన ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ బంధన్ బ్యాంక్.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 15న ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)ను తీసుకువస్తున్నది. రూ.4,430-4,473 కోట్ల వరకు నిధుల సమీకరణ లక్ష్యంతో వస్తున్న ఈ ఐపీవోలో షేర్ల ధరల శ్రేణి రూ.370-375గా ఉన్నది. ఐదు రోజులపాటు కొనసాగే ఈ ఐపీవో ఈ నెల 19న ముగుస్తుంది. ఐపీవో అనంతరం బ్యాంక్‌లో యాజమాన్యం వాటా దాదాపు 89 శాతం నుంచి సుమారు 82 శాతానికి పడిపోనున్నది. కొటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌మన్ సాచ్స్, జేఎం ఫైనాన్షియల్, జేపీ మోర్గాన్‌లు ఈ ఐపీవోకు మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరించనున్నాయి.

ఆరోగ్యం బాగాలేదు..

## భారత్‌కు రాలేను

**సీబీఐకి గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ ఈ-మెయిల్**

**ఇక్కడ తనకు కార్పొరేట్ వైద్యం అందదన్న భయం**

**అయినా పాస్‌పోర్టు రద్దు చేశాక ఎలా రాగలనంటూ ఎదురుప్రశ్న**



**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 8:** అనారోగ్య కారణాల వల్ల భారత్‌కు తిరిగి రాలేకపోతున్నానని గీతాంజలి జెమ్స్ చైర్మన్ మెహుల్ చోక్సీ అన్నాడు. ఒకవేళ వస్తే అక్కడ తనకు కార్పొరేట్ వైద్యం అందబోదంటూ ఓ ఈ-మెయిల్‌లో పేర్కొన్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో నీరవ్ మోదీతోపాటు చోక్సీ పాస్‌పోర్టులనూ గత నెల 24న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జనవరిలోనే నీరవ్, చోక్సీలు దేశం విడిచిపోయిన సంగతీ విదితమే. ఈ క్రమంలో సీబీఐకి పంపిన ఈ-మెయిల్‌లో భారత్‌కు రాలేనంటూ చెప్పడమేగాక తన పాస్‌పోర్టును దేని ఆధారంగా రద్దు చేశారో చెప్పాలంటూ ముంబై ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని అడిగాడు. 'ప్రస్తుత నా అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా నేను ప్రయాణాలు చేసే స్థితిలో లేను. నాకు హృద్రోగ సమస్య ఉన్నది. కనీసం నాలుగు నుంచి ఆరు నెలల వరకైనా నేను ఎక్కడికీ కదల్లేని పరిస్థితి' అని ఈ-మెయిల్ చేశాడు. 'ఒకవేళ తాను అరెస్టయితే, ప్రైవేట్ ఆస్పత్రికి బదులు ప్రభుత్వాసుపత్రిలోనే చేర్పిస్తారు. అప్పుడు నాకు సరైన చికిత్స అందదు' అన్నాడు. ఇకపోతే అధికార, ప్రతిపక్షాల వాదులాటలు, మీడియా ప్రసారాలు.. మళ్లీ తను భారత్‌కు రావడాన్ని కష్టతరం చేశాయన్నాడు. ఈ క్రమంలోనే అయినా నా పాస్‌పోర్టు రద్దైతే నేనెలా రాగలనని ప్రశ్నించాడు.

**జీజేఈపీసీ వేటు?**

మరోవైపు నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీలపై రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) వేటు వేసేందుకు సిద్ధమవుతున్నది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో తాము పంపిన నోటీసులకు వీరిరువురు బదులివ్వకపోవడంతో శుక్రవారం వరకు డెడ్‌లైన్ విధిస్తున్నట్లు పీటీఐకి జీజేఈపీసీ వైస్ చైర్మన్ కొలిన్ షా తెలిపారు. గడువు దాటాక క్రమశిక్షణ కమిటీ వద్దకు వెళ్తామని, మండలి నుంచి ఆ ఇద్దరినీ తొలగించే ప్రయత్నాలు చేస్తామన్నారు.

**స్కాం విలువ పెరుగకపోవచ్చు: గార్గ్**

పీఎన్‌బీ స్కాం విలువ ఇంకా పెరుగకపోవచ్చన్న అభిప్రాయాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ గురువారం వ్యక్తం చేశారు. తొలుత రూ.11,400 కోట్లుగా అంచనా వేసినప్పటికీ.. మరిన్ని ఎల్‌వోయూలు బయటపడటంతో రూ.12,700 కోట్లకు చేరుకున్న విషయం తెలిసిందే.

### యూబీపై హైనెకేన్ కన్ను

యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ)లో మెజారిటీ వాటాను దక్కించుకునేందుకు అంతర్జాతీయ బీర్ల తయారీదారైన హైనెకేన్ ప్రయత్నిస్తున్నది. బ్యాంకుల్లో కుదువపెట్టని విజయ్ మాల్యా షేర్లను కొంటామని ఈడీకి ఆ సంస్థ ప్రతిపాదనలు పంపింది. ఈ లావాదేవీ కోసం జేఎం ఫైనాన్షియల్‌ను ఇప్పటికే హైనెకేన్ సలహాదారుగా కూడా నియమించుకొన్నది. బ్యాంకు రుణాల ఎగవేత కేసులో భాగంగా మాల్యా షేర్లను ఈడీ స్వాధీనం చేసుకోగా, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం వీటి విలువ రూ.4,331 కోట్లుగా ఉంటుందని అంచనా.

## బీఎస్ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 289.45(293.95)10030
Ace Software Exports 22.45(24.9)2716
Aci Infocom 3.96(4.16)551105
Aditya Ispat 5.85(5.81)15000
Agro Tech Foods 625.0(632.0)1826
Aishwarya Telcom Ltd 5.51(5.4)5087
Alphageo 773.95(779.3)3262
Alufluoride 108.85(108.45)9637
Amara Raja 794.45(773.0)33135
Andhra Bank 39.5(39.35)957115
Andhra Cements 10.25(10.27)44020
Andhra Petroch 54.95(52.35)236045
Andhra Sugars 454.45(450.3)5884
Anjani Portl 181.35(182.0)2226
Astra Micro 85.85(87.3)46374
Aurobindo Phar 588.95(592.75)120068
Avantel 529.55(528.2)3579
Avanti Feeds 2329.55(2369.3)11764
Avon Organics 9.6(10.05)6376
B N Rathi Securities 39.5(38.2)777
Balaji Amines 597.5(591.5)11154
Bambino Agro 242.7(235.45)1238
Baron Infotech 0.32(0.33)600
Bartronics India 12.03(12.49)21503
Bgr Energy Systems 109.1(110.3)12031
Bhagiradha Chem 284.75(287.25)1091
Bhagyaind 48.9(50.8)107471
Bhagyanagar W. 25.7(24.5)200
Bnr Udyog 28.7(28.7)1057
Brilliant Secur 9.16(9.62)117886
Cambridge Tech74.6(75.35)3747
Ccl Products 293.9(294.45)4238
Celestial Labs 14.85(15.75)28603
Cil Securities 26.55(26.65)651
Color Chips 36.5(37.2)8242
Combat Drugs 27.0(27.4)92489
Coromandel Fert 521.95(536.65)9300
Country Club 13.45(13.36)47867
Cubex Tubings 24.95(25.5)39
Cybermate Inf. 2.84(2.85)41095
Danlaw Tech. 69.85(69.55)10722
Deccan Cements 540.35(547.35)20399
Deccan Polypacks 3.05(3.01)100
Denisons Hyd 970.0(988.0)230
Dhan Roto Sp 50.4(52.95)957
Diamond Power Infra12.27(12.87)54502
Divi's Lab 1001.2(991.05)20295
Divyashakti Gr 92.0(90.1)766
Dolphin Med 1.13(1.12)3114
Dr Reddy`s 2145.5(2148.45)14730
Empee Sugars 3.91(4.11)7923
Everest Org 140.15(138.45)18176
Facor Alloys 2.77(2.81)91355
Firstobj 15.85(16.1)328
Fortune Info 72.3(73.65)20177
Four Soft 71.65(74.5)4431
Gati 100.95(102.35)71218
Gayatri 9.64(9.64)54183
Gayatri Projects 206.55(204.7)25431
Gennex 3.86(3.86)227504
Gmr Infra 17.35(17.35)2502340
Godavari Drugs 34.35(33.55)5568
Goldinfra 197.5(197.0)26523
Goldstone Tech 13.47(13.43)5300
Granules Ind 108.15(108.05)149267
Gss America Infotech 55.05(57.6)216140
Gulf Oil Corp 530.95(531.95)1995
Gvk Pwr 14.0(14.25)2282415
Hbl Power 51.15(51.7)77428
Heritage Food 686.05(670.95)987
Hind Fluro 10.5(10.9)16025
Hyderabad Ind 1641.7(1639.65)1042
I V R Cons 4.1(3.96)329830
I.c.s.a. 3.1(3.1)7820
Ikf Technologies 0.63(0.64)77722
Incap 81.3(85.2)1867
Infotech Ent 620.9(626.0)5421
Invinex Lab 120.0(120.0)1
Ivrcl Infrastruc 4.1(3.96)329830
K C P 116.85(116.2)12546
Kabsons Ind 7.8(7.43)1195
Kakatiya Cement 263.3(271.25)3643
Kakatiya Texs 2.4(2.5)200
Kallam Spinning 31.25(31.05)53951
Karan Woosin 1.91(1.9)500
Kaveri Seed 474.55(460.0)46233
Kernex Mic. 38.35(39.1)1900
Knr Const 296.45(291.85)7352
Krebsbio 199.65(190.15)3340
Lanco Ind 323.95(316.7)58806
Lanco Infratech 1.1(1.14)1007076
Livewell Home Fin 68.65(62.0)109
Lokesh Mach 61.0(60.95)14053
Lotus Chocolate 51.45(50.0)1940
Madhucon Projects 24.95(25.65)15822
Maytas Infra 36.8(38.5)57494
Mhril 293.85(291.2)5898
Mic Electronics 5.97(6.23)90204
Moldtek 54.85(57.05)100844
Moschip Semi 29.35(30.15)36761
Msr India Ltd 49.75(49.0)7002
N C L Ind 207.1(204.9)48896
Nagarjuna Agri 38.3(38.9)40771
Nagarjuna Con 120.1(118.6)481185
Natco Pharma 717.15(722.65)65301
National Min 124.35(123.4)223665
Nbventure 144.45(146.25)31659
Neha International 6.88(6.72)10056
Neha Inter6.88(6.72)10056
Neocure Thera 3.43(3.61)3200
Nettlinx 73.3(74.15)178763
Neuland Lab 698.25(695.4)766
Niharinf 12.6(13.25)50
Nile 734.0(767.7)7704
Oil Country 38.7(39.1)7017
P.m. Telelinnks 2.23(2.13)2025
Padmalaya Tel 3.99(4.2)5440
Panyam Cem 42.6(41.5)42327
Pennar Ind 54.0(54.6)70561
Pflinfotc 8.4(8.01)64614
Phaarmasia 39.05(39.8)80
Phyto Chem 61.8(61.5)1576
Pitti Lamin 88.1(87.65)12029
Pokarna 198.9(196.35)4591
Prajay Eng 12.62(12.04)60407
Premier Expl 365.1(365.9)4299
Prism Cement 119.65(115.75)98153
Ragsan Petrochem 62.0(62.5)500
Rain 381.9(367.3)511742
Raj Packaging 35.0(33.95)1522
Ram Informatics 40.35(39.0)2842
Regency Ceramic 5.65(5.42)779
Restile Ceramics 6.57(6.97)900
Roopa Industries 14.9(14.94)339
Rubra Medicaments 4.27(4.49)750
S S Organics 8.4(8.0)200
Sagar Cements 921.25(937.05)450
Samkrg Pistons 284.25(289.85)8127
Sampre Nutritions 55.0(54.5)1454
Sanghi Ind 112.3(109.35)38030
Sanjeevni Industries 21.85(22.85)84303
Sark Sys 49.65(51.85)47806
Sathavahana Ispat 20.75(21.95)11503
Saven Tech 26.0(25.55)19997
Sks Micro1033.5(1035.5)62064
Sms Pharma77.8(80.9)8407
Softsol India 33.35(35.0)35
Southern Magn & Chem24.0(23.75)100
Southern Online Bio Tech2.82(2.92)1160
Sr Ray Alkalies 52.75(52.2)194886
Sree Rayalaseema 155.45(157.1)1637
Srinivasa Shipp 60.7(60.0)456
Srivajra 2.47(2.57)3200
Steel Exch25.65(26.8)31034
Sujana 0.85(0.89)12251
Sujana Towers 3.73(3.74)13339
Sujanametal 1.35(1.35)23035
Surana Telecom 5.0(5.09)18387
Suryaamba 71.9(71.8)205
Suryachakra Power Cor0.9(0.89)31586
Suryalak Cott 73.5(75.5)4629
Suryalata Spin 138.85(135.15)455
Suryavanshi Spin 6.35(6.09)162
Suvarna Cem 130.8(127.95)2183
Suven 174.45(177.25)53996
Taj Gvk 153.4(157.15)65150
Tanla Solutions 33.95(34.6)141038
Tci Fin 27.05(26.9)8867
Transcorp Inter 31.85(31.5)16106
Transgene Biotek 2.47(2.59)2200
Transport Co 270.9(269.95)5812
Tyche 100.45(100.45)11279
Unisocks 3.05(3.24)2145
Usher 5.57(5.75)7001
V B C Ferro 37.35(39.0)260
V S T Ind 2926.4(2942.2)118
Vamshi Rubber 49.9(48.8)415
Viceroy Hotels 14.25(14.45)20416
Vijay Textiles 47.65(49.9)4377
Vimta Labs 198.35(195.85)2786
Virat Crane 55.75(55.2)13927
Virnichiq 108.25(109.85)59041
Visaka Ind 657.95(662.3)14895
Vista Pharma 44.1(43.7)22996
Vivmed Labs 70.5(69.35)156375
Vivo Bio Tech 61.0(62.65)5228
Vmf Softech 112.05(113.25)9120
Waterbase 275.0(276.75)223800
Xl Energy Ltd 2.53(2.45)5952
Ybrant Digital 5.08(5.1)123782
Zen Tech121.0(122.35)43854
Zenotech 38.75(40.5)63514





ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులు. (ఇన్‌సెట్‌లో) తల్లి

## ఒకే కాన్పులో ముగ్గురు

**సంగారెడ్డి మున్సిపాలిటీ:** సంగారెడ్డి జిల్లా కేంద్ర వైద్యశాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఆశారాణి ఒకేకాన్పులో ముగ్గురికి జన్మనిచ్చింది. ఇందులో ఒక మగ, ఇద్దరు ఆడ శిశువులుండగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.



పగిడిద్దరాజు ఆలయానికి సమ్మక్కను తీసుకొస్తున్న ఆరెం వంశీయులు

## ఘనంగా పగిడిద్దరాజు జాతర

**గుండాల:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపలగడ్డలో పగిడిద్దరాజు జాతరకు భక్తులు పోటెత్తారు. గురువారం వనదేవత సమక్క గద్దెపైకి రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజు యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం వంశీయులు కావడంతో యేటా జాతరను ఘనంగా జరుపుతారు. మొదటి రోజు పగిడిద్దరాజు బర్ల గుట్ట నుంచి గుడికి రాగా, రెండో రోజు గురువారం వనదేత సమ్మక్కను గుడిలో ప్రతిష్ఠించారు.



సిరిసిల్లలో కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీఆర్‌ఎస్వీ నాయకులు

## కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మ దహనం

**సిరిసిల్ల టౌన్:** బస్సుయాత్రలో భాగంగా కాంగ్రెస్ నేతలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ టీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, అంబేద్కర్ చౌక్‌లో దహనం చేశారు. ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ నేతలు బస్సు యాత్ర పేరిట ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ, ఇకనైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేదంటే ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.





గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, గడా ఓఎస్డీ హన్మంతరావు

## గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం గురువారం ఉదయం జరిగింది. గజ్వేల్ పట్టణం ముట్రాజ్‌పల్లి రోడ్డుపై సువిశాల స్థలంలో జీ+1 భవనాన్ని నిర్మించారు. ఉదయం 7:55 గంటలకు వేద పండితులు గృహప్రవేశ పూజ చేశారు. గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ముందుగా వాస్తు పూజ, పుణ్యాహవచనం, గణపతి, అమ్మవారి పూజలు చేసి పాలు పొంగించారు. ఈ పూజల్లో గడా ఓఎస్డీ హన్మంతరావు, ప్రముఖ వా స్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, స్థానిక ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన యజ్ఞంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ యాదవరెడ్డి, దుంబాల అరుణభూపాల్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పాలించిన పాలకులు నియోజకవర్గాల్లో శాసనసభ్యులకు అడ్రస్ లేకుండా చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఈ పరిస్థితిని గుర్తించి ఎమ్మెల్యేలు ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ వారికి జవాబుదారీగా మారడానికి క్యాంపు కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలు విన్నవించడానికి ప్రభుత్వ సౌకర్యాలు ప్రజలకు అందించడానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు వేదికలుగా పనిచేస్తాయన్నారు.

# జాతీయ రాజకీయాల్లో మార్పు అవసరం

- అంతర్రాష్ట్ర సమస్యలను జటిలం చేస్తున్న కేంద్రం
- కాంగ్రెస్, బీజేపీలతో పెరిగిన పన్నుల భారం
- సీఎం కేసీఆర్‌కు బాసటగా నిలుస్తున్న ప్రజలు, మేధావులు, రాజకీయ వర్గాలు
- రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:**

కాంగ్రెస్, బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను తొక్కిపెడుతూ రాష్ట్రాలపై పెత్తనం చెలాయించడంతో అభివృద్ధి, సంక్షేమంతో పాటు పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నదన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గురువారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా, వాటి పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం సరైన విధంగా స్పందించడం లేదన్నారు. ఇరుపొరుగు రాష్ట్రాల మధ్య తలెత్తిన సమస్యలను పరిష్కరించాల్సింది పోయి మరింత జటిలం చేస్తున్నట్టు దుయ్యబట్టారు. ముఖ్యంగా దేశంలో 60 నుంచి 70శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉండగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు, వివిధ వర్గాల ప్రజలు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిని ఆహ్వానిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో కీలకం కావాలన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు బాసటగా నిలువడమే గాకుండా మేధావులు, రాజకీయ వర్గాలు స్వాగతిస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మేధావులు, రాజకీయ వర్గాలు సమైక్య పోరుకు సీఎం కేసీఆర్ వెంట నడువడానికి సిద్ధమవుతున్నట్టు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని చూసి దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కేసీఆర్ వల్లే అగ్రరాజ్యాల సరసన భారతదేశం నిలుస్తుందని విశ్వసిస్తున్నారన్నారు.



గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి

**కాంగ్రెస్ బస్సు యాత్ర తుస్సు..**

కాంగ్రెస్ బస్సు యాత్రకు జనాధారణ కరువైందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కొద్దో గొప్ప జనాధారణ ఉందనుకున్న ప్రాంతం నుంచే ప్రజల స్పందన కరువు కావడంతో రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళనకు గురై అధికార పార్టీపై అనవసర ఆరోపణలకు పదును పెడుతున్నదన్నారు. కేసీఆర్ అందించిన అభివృద్ధి ఫలాలు ఇంటింటికి చేరడంతో ప్రజలు కాంగ్రెస్‌ను పక్కకు పెట్టినట్టు స్పష్టమవుతున్నదన్నారు. మూడేండ్లుగా గుర్తుకు రాని ప్రజలు.. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ నాయకులు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## కేసీఆర్‌ను దేశం కోరుకుంటున్నది

### డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి

**అచ్చంపేట, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించినట్టుగానే దేశాన్ని కూడా ఆ మేరకు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నదని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. అనతి కాలంలోనే తెలంగాణలో జరిగిన అభివృద్ధిని చూసిన దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. దేశ రాజకీయాల్లో ప్రక్షాళన అవసరమని భావించి థర్డ్ ఫ్రంట్ కోసం సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని మధురానగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. అనంతరం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గస్థాయి మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలచే ఏర్పాటు చేసిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యమంలో పాల్గొని మహిళా శక్తి నిరూపించామని, అభివృద్ధిలోనూ భాగస్వామ్యం అవుతున్నామన్నారు.



రాష్ట్ర ప్రతినిధుల సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్

## డప్పు, చెప్పు కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి

### రాష్ట్ర ప్రతినిధుల సభ పోస్టర్ ఆవిష్కరణలో వంగపల్లి

**ముషీరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని డప్పు, చెప్పు కళాకారులకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. అడుగకుండానే వివిధ వర్గాలకు అన్నీ ఇస్తున్న సీఎం కేసీఆర్ మాదిగ, మాదిగ ఉపకులాల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు ఈ అసెంబ్లీ సమావేశాల్లో డప్పు, చెప్పు కళాకారులకు పెన్షన్ చెల్లింపు కోసం ప్రత్యేక తీర్మానం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కారంలో ఒక అడుగు ముందున్న సీఎం కేసీఆర్, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని విజ్ఞప్తిచేశారు. ఈనెల 11న మాదిగ, మాదిగ ఉపకులాల ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ హాల్‌లో ఈ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. బేడబుడగ జంగాల హక్కుల వేదిక నాయకుడు టీ హన్మంతు మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల సంక్షేమానికి ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్, జిల్లాకో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రమేశ్, శ్యామ్‌రావు, వెంకట్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేడ్-1 మున్సిపాలిటీగా సిరిసిల్ల

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సిరిసిల్ల మున్సిపాలిటీని గ్రేడ్-1 స్థాయికి పెంచుతూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ద్వితీయ శ్రేణి నుంచి ప్రథమ శ్రేణి స్థాయికి తీసుకురావడానికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపగా, సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

# కందూరు జాతరలో అపశ్రుతి

### కోనేరులో మునిగి ముగ్గురు అన్నదమ్ముల మృతి

**అడ్డాకుల:** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి జాతరలో అపశ్రుతి చోటు చేసుకున్నది. కోనేరులో స్నానం చేస్తుండగా ఈత రాక ప్రమాదవశాత్తూ నీట మునిగి ముగ్గురు అన్నదమ్ములు మృతి చెందారు. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కామాజీపురం గ్రామానికి చెందిన ఉప్పరి చంద్రమ్మ, కేశవ్ దంపతులకు ముగ్గురు కొడుకులు రవికుమార్(28), పవన్‌కుమార్(27), ఆంజనేయులు(19). వీరు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో నివసిస్తున్నారు. రవికుమార్ ఆటో నడుపుతుండగా, పవన్ ప్రైవేటు దవాఖానలో సెక్యూరిటీ గార్డుగా, ఆంజనేయులు హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం వీరి కుటుంబం కందూరు జాతరకు వెళ్లింది. అక్కడ కోనేరులో స్నానం చేసేందుకు నీటిలోకి దిగారు. రవికుమార్, పవన్‌కుమార్, ఆంజనేయులు ముగ్గురు కలిసి చేతులు పట్టుకొని కొంతదూరం వెళ్లగా లోతు ఎక్కువగా ఉండటం.. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు, పవన్‌కు గతేడాది వివాహం జరిగింది.



రవికుమార్, పవన్ కుమార్, ఆంజనేయులు(ఫైల్)



సూర్యాపేట జిల్లా చిన్ననెమిలలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో మంత్రి పోచారం సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

## టీఆర్‌ఎస్‌లో చేరికల జోష్

**నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు వందమంది టీఆర్‌ఎస్‌లో చేరగా, భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని మంత్రి నివాసంలో నస్రుల్లాబాద్ మండలం సంగెం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకు చెందిన వందమంది నాయకులు పోచారం శ్రీనివాస్ సమక్షంలో, నిజామాబాద్‌లో మంత్రి పోచారం, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ ఆర్మూర్ పట్టణ మాజీ అధ్యక్షుడు సునిల్ టీఆర్‌ఎస్‌లో చేరారు. వనపర్తి జిల్లాలోని రేవల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో, సూర్యాపేట జిల్లా చిన్ననెమిల గ్రామ ఎంపీటీసీ లింగన్నతోపాటు మరో 40మంది తుంగతుర్తి ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ముస్లిం మైనార్టీ యువకులు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

## బాలికపై సామూహిక లైంగికదాడి

### ఆలస్యంగా వెలుగులోకి..

**కాచిగూడ:** ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న వ్యక్తి ఆమె కూతురిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మరో ముగ్గురితో లైంగిక దాడి చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాచిగూడ రైల్వే డీఎస్పీ రాజేంద్రప్రసాద్ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ భర్త గతంలోనే మరణించాడు. ఆమెకు కూతురు ఉండగా, కొన్నేండ్లుగా హైదరాబాద్‌లోని ఐడీపీఎల్ బాలానగర్‌లో నివాసముంటున్నది. ఆమె బెల్లంపల్లికి చెందిన దుర్గం మల్లేశ్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నది. ఈ క్రమంలో మల్లేశ్ ఆమె 17 ఏండ్ల కూతురిపై కన్నేశాడు. బాలికను చదివిస్తానని నమ్మబలికి రెండేండ్ల క్రితం బెల్లంపల్లికి తీసుకెళ్లాడు. కొన్ని రోజుల తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా బెల్లంపల్లికి చెందిన మరో ముగ్గురు ఆటో డ్రైవర్లతోనూ లైంగికదాడి చేయించాడు. ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా మల్లేశ్ కట్టుకథ అల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బాలికపై ముగ్గురు ఆటో డ్రైవర్లు లైంగిక దాడి చేసినట్లు గతేడాది జూన్‌లో బెల్లంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ కేసును అక్కడి పోలీసులు కాచిగూడకు బదిలీ చేశారు. ఈ కేసును కాచిగూడ పోలీసులు అక్టోబర్‌లో రైల్వే పోలీసులకు అప్పగించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ విజయ్‌లాల్ కేసు దర్యాప్తు చేసి, బాలికను గత నెల 14న మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మల్లేశ్ అనే వ్యక్తి తనకు మద్యం తాగించి నోటినిండా గుడ్డలు కుక్కి లైంగిక దాడికి పాల్పడినట్టు బాధితురాలు మెజిస్ట్రేట్ ఎదుట వెల్లడించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ కేసును బెల్లంపల్లి ఠాణాకు బదిలీ చేసినట్టు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న జైపూర్ ఏసీపీ సీతారాములు

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

**చెన్నూర్, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట వద్ద నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని, వెంకటేశ్వర్‌రావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జైపూర్ ఏసీపీ సీతారాములు తెలిపారు. చెన్నూర్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. కిష్టంపేట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కారులో 100 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను తరలిస్తూ వెంకటేశ్వర్‌రావు పట్టుపడ్డాడని చెప్పారు. ఒక్కొక్క ప్యాకెట్లో 450 గ్రాముల విత్తనాలు ఉన్నాయని తెలిపారు. గుంటూర్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావు పదేండ్లుగా చెన్నూర్‌లో ఉంటూ చుట్టూ పక్క గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు.

## చిన్నారితో కలిసి తల్లి ఆత్మహత్య

**కరీంనగర్ క్రైం:** కుటుంబ కలహాల కారణంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగుల మల్యాల గ్రామానికి చెందిన ఈగల మాధవి(26) ఏడాదిన్నర వయస్సున్న కూతురితో కలిసి బావిలో దూకి ప్రాణాలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగుల మల్యాల గ్రామానికి చెందిన ఈగల రాజు-మాధవికి నాలుగేండ్ల క్రితం పెండ్లి కాగా, ఏడాదిన్నర వయస్సున్న కూతురు యశస్వి ఉంది. భర్త, అత్త, మామల నుంచి మాధవికి వేధింపులు ప్రారంభం కాగా, తరుచూ గొడువలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మాధవి తన కూతురిని తీసుకొని వేములవాడలోని బంధువుల దగ్గరికి వెళ్తున్నట్టు చెప్పి ఈనెల 1న ఇంటినుంచి బయలుదేరింది. రెండు రోజులైనా ఆమె వేములవాడకు చేరకపోవడంతో అనుమానం వచ్చిన భర్త ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం కొత్తపల్లి మండలం బావుపేట శివారులోని వ్యవసాయ బావిలో మాధవి, యశస్వి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అత్తింటి వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మాధవి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కూతురు యశస్వితో మాధవి(ఫైల్)

## ఛత్తీస్‌గఢ్‌లో 29మంది మావోయిస్టుల లొంగుబాటు

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్‌లో గురువారం 29మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇటీవల కస్తూర్‌పాడ్-పూజారీకాంకేడ్-తడపాల సమీప అటవీ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. దీంతో కొంత క్యాడర్‌ను కోల్పోయిన ఆ ప్రాంత మావోయిస్టు దళ సభ్యులు ఆందోళనకు గురవుతున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో గురువారం సుక్మా జిల్లాలో ఒకేసారి 29 మంది మావోయిస్టులు ఆ జిల్లా ఎస్పీ సంత్‌కుమార్ సిన్హా ఎదుట లొంగిపోయారు. వీరిలో 11 మంది మహిళలు ఉన్నారు. శుక్రవారం మావోయిస్టులు దండకారణ్యంలోని ఏజెన్సీ ప్రాంతాల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆంధ్రా-తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. ఏక్షణానైనా మావోయిస్టులు విధ్వంసాలకు పాల్పడే అవకాశం ఉన్నట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం అందడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్‌లు, రహదారులు, కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రా పోలీసులు ఒక మావోయిస్టు సహా ఇద్దరు కొరియర్లను అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పాలోడు గ్రామానికి చెందిన డీఏకేఎంఎస్ దళ సభ్యుడు మడివి రాముతోపాటు కొరియర్లు మెలిమూరి శ్రీనివాసరావు, పాయం జోగారావులను మంగళవారం రాత్రి ఎటపాక వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ విశాల్‌బున్నీ గురువారం వెల్లడించారు.

## సంపులో పడి విద్యార్థి మృతి

**మఠంపల్లి:** సంపులో పడి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎండీ కాశీం, జైనాబి దంపతుల కుమారుడు బాబా హస్సన్(18) హైదరాబాద్‌లో చదువుతున్నాడు. కొద్దిరోజుల నుంచి హస్సన్ స్థానికంగా ఇంటి వద్ద ఉండి పరీక్షల కోసం సన్నద్ధమవుతున్నాడు. తల్లిదండ్రులు హుజూర్‌నగర్ వెళ్లి వచ్చే సరికి హస్సన్ నీటి సంపులో పడి ఉన్నాడు. అందులో నుంచి తీయగా అప్పటికే మృతిచెందాడు. సంపు రెండు అడుగులు మాత్రమే ఉండగా.. హస్సన్ మృతిపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు కాలేదు.



బాబా హస్సన్ మృతదేహం

నమస్తే తెలంగాణ
ఆట
[ హైదరాబాద్ ]
శుక్రవారం 9 మార్చి 2018

## వివేక్, శేష్‌నారాయణపై సస్పెన్షన్

**హైదరాబాద్:** ఏకకాలంలో రెండు పదవుల్లో కొనసాగుతున్నారని హెచ్‌సీఏ ప్రెసిడెంట్ వివేకానంద, ఏసీబీ కేసులు నమోదవడంతో కార్యదర్శి శేష్‌నారాయణపై అనర్హత వేటు వేస్తున్నట్టు గురువారంఅంబుడ్స్‌మన్ నర్సింహారెడ్డి ప్రకటించారు. హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడు..తాత్కాలిక కార్యదర్శిగా కోశాధికారి వ్యవహరించనున్నారు. మరోవైపు ఈ విషయమై ఉన్నత న్యాయస్థానానికి వెళతానని శేష్‌నారాయణ తెలిపారు.




# ఇదే ముద్దు.. ఆట వద్దు!

### ఇదీ కొందరు ఆటగాళ్ల తంతు

### వివాహేతర సంబంధాలతో కెరీర్ ఖల్లాస్

### జెంటిల్‌మెన్ గేమ్‌లో 'బ్యాడ్ బాయ్స్'

**క్రికెట్ అంటేనే అదొక మాయా ప్రపంచం..అక్కడ ఆట ఒక్కటే కాదు, అంతకు మించి అన్నీ ఉంటాయి..పైకి కనిపించే ఆట వేరు..తెర వెనుకాల జరిగే తతంగాలు వేరు.. క్రికెటర్లుగా కాస్త గుర్తింపు పొందారంటే చాలు కొందరు మస్తీ మజాలో తేలిపోతారు..పరుగుల కంటే ఎక్కువగా అమ్మాయిల ఫోన్ నంబర్లే ఉంటాయి.. మైదానంలో ఆటకు నై..హోటల్ గదుల్లో సయ్యాటకు సై అనే క్రికెటర్లు ఎంతో మంది ఉన్నారు.. అసలే సెలబ్రిటీ హోదా, హీరోలకు సైతం దక్కని ఫ్యాన్ ఫాలోయింగ్.. ఎక్కడికెళ్లినా వీవీఐపీ ట్రీట్‌మెంట్.. ఆటోగ్రాఫ్‌ల కోసం వెంటపడే అమ్మాయిలు.. చూపు మరల్చి దారి తప్పారా అంతే సంగతులు..**


ఆటగాళ్లు తమ ఆటతీరుతో కాకుండా శృంగార వివాదాలతో వార్తల్లోకెక్కడం ఫుట్‌బాల్ క్రీడలో ఎక్కువగా కనిపిస్తుంది. అయితే రాను రాను క్రికెట్‌లో కూడా అటువంటి వివాదాలు మామూలైపోయాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్థాన్ క్రికెటర్లు కొందరు అనుచిత కార్యకలాపాలతో వార్తల్లో నిలిచిన వారే. వీరిలో ప్రముఖ క్రికెటర్లూ ఉన్నారు. వార్న్ బ్యాడ్ బాయ్‌గా పేరు తెచ్చుకున్నందుకే కెప్టెన్ కావాల్సినోడు..సాధారణ ఆటగాడిగా మిగిలాడు..ఆటను కొత్త పుంతలు తొక్కించిన పీటర్సన్..ఆ మోజులో పడి కెరీర్‌నే ఆగం చేసుకున్నాడు.. బ్యాటింగ్‌లో కీర్తి సంపాదించిన మైక్ గ్యాటింగ్ బార్‌లో కక్కుర్తిపడి అపకీర్తి మూటగట్టుకున్నాడు. షమీ విషయానికొస్తే భార్యకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయి భవిష్యత్‌ను ప్రశ్నార్థకంలో పడేసుకున్నాడు. గతంలోనూ ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొన్న క్రికెటర్లపై ప్రత్యేక కథనం..



**వార్నీ ఎన్ని లీలలో..**

ఆస్ట్రేలియా క్రికెటర్ షేన్‌వార్న్ స్పిన్నర్‌గా ఎంత విజయవంతమయ్యాడో.. ప్లే బాయ్‌గా అంతకు మించి పేరు తెచ్చుకున్నాడు. మైదానం బయట అతగాడి చేష్టలకు హద్దూ అదుపూ ఉండకపోయేది. 2000 సంవత్సరంలో కౌంటీ మ్యాచ్ ఆడిన సందర్భంలో వార్న్.. బ్రిటీష్ నర్స్ డొన్న రైట్‌కు అసభ్యకర సందేశాలు పంపి, ఫోన్ కాల్స్‌తో విసిగించాడు. ఫలితంగా అతడి వైస్ కెప్టెన్సీ ఊడింది. ఆ తర్వాత కూడా మారలేదు. 2006లో ఒక దేశవాళీ మ్యాచ్ సందర్భంగా 25 ఏండ్ల మోడల్‌తో కామక్రీడల్లో పాల్గొని మీడియా కంటపడ్డాడు. వార్న్ మా మతి పోగొట్టాడు..అతడు చాలా ఫిట్‌గా ఉన్నాడు..అంటూ ఆ అమ్మాయిలు బాహాటంగానే వ్యాఖ్యానించడంతో అందరూ ఖంగు తిన్నారు. యమ్ టీవీ యాంకర్ కొరాలీ అయితే మరో అడుగు ముందుకేసి వార్న్ చాలా ఫిట్‌గా ఉన్నాడంటూ చెప్పడం అప్పట్లో దుమారమే రేపింది. ఈ ఘటనతో విసిగిన వార్న్ భార్య సిమోన్ అతడికి విడాకులు ఇచ్చింది. దీంతో కెప్టెన్ కావాల్సినోడు ఆటగాడిగానే సరిపెట్టుకున్నాడు. 2010లోనూ లిజ్ హ్యార్లీ అనే పోర్న్ స్టార్‌తోనూ ఎఫైర్ నడిపాడు. ఆమె భారత్‌కు చెందిన అరున్ నాయర్‌తో తెగతెంపులు చేసుకుని మరీ వార్న్‌తో జతకట్టింది. 2014 వాలెంటైన్స్ డే సందర్భంగా ఒక మోడల్‌తో హోటల్ గదిలో రాసలీలు సాగించి ఆ తర్వాత తన ప్రేయసిని కలుసుకున్నాడంటూ అక్కడి సన్ పత్రిక కథనం వెలువరించింది. 2015లోనూ 45 ఏండ్ల మహిళతో అక్రమ సంబంధం నడిపి వార్తలకెక్కాడు.

**గ్యాటింగ్, పీటర్సన్**



షేన్ వార్న్ బాల్ ఆఫ్ ద సెంచరీకి అవుటై రికార్డులకెక్కిన ఇంగ్లండ్ క్రికెటర్ మైక్ గ్యాటింగ్ కూడా వివాహేతర ఆరోపణలు ఎదుర్కొన్నాడు. వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా అతడు బార్‌లో పనిచేసే మహిళతో రాసలీలు సాగించాడంటూ అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డ్ వెంటనే అతడిని డిస్మిస్ చేసింది.

కెవిన్ పీటర్సన్ తన ప్రతిభతో అందరి ప్రశంసలు పొందినా, ఎక్కువగా వివాదాలతోనే గడిపాడు. కేపీ దక్షిణాఫ్రికా యువతి వానెసా నిమ్మోతో కొంతకాలం ఎఫైర్ నడిపాడు. ఆర్చరీలో రెండు సార్లు చాంపియన్‌గా నిలిచిన నిమ్మో..ఆ తర్వాత బిగ్‌బాస్ వంటి రియాల్టీ షోలో మెరిసింది. ఆ క్రమంలో కేపీతో లింకు కుదిరింది. అయితే ఒకే ఒక్క మెసేజ్ కారణంగా కేపీ ఆమెతో తెగతెంపులు చేసుకున్నాడు. "కేపీ ఎంతో చేస్తాడనుకుంటే వేధించాడే తప్ప సిక్సర్లు కొట్టలేకపోయాడు" అంటూ రోతపుట్టించే రీతిలో నిమ్మో కామెంట్లు చేసింది. ఇటువంటి ఎఫైర్లతో పాటు తెంపరితనంతో కేపీ తన కెరీర్‌ను నాశనం చేసుకున్నాడు.

**అఫ్రిదీ అలాంటోడే..**



పాకిస్థాన్ దిగ్గజ క్రికెటర్ షాహిద్ అఫ్రిదీ కూడా స్త్రీలోలుడే. ఈ విషయం 2000 సంవత్సరం సింగపూర్‌లో వెలుగులోకి వచ్చింది. చాంపియన్స్ టోర్నీకి ముందు అఫ్రిదీ, అతిఖ్, హసన్‌రజా కరాచీ హోటల్ గదుల్లో అమ్మాయిలతో కనిపించి అడ్డంగా బుక్కయ్యారు. అయితే ఆ అమ్మాయిలు ఆటోగ్రాఫ్స్ కోసం వచ్చారంటూ ఆటగాళ్లు బుకాయించినప్పటికీ పాక్ క్రికెట్ బోర్డ్ వీరిపై మ్యాచ్ నిషేధం విధించి, ప్రాక్టీస్‌కు అనుమతించలేదు. 1998లో సక్లైన్ ముస్తాక్, మహ్మద్ అక్రమ్ వికృత చేష్టలకు పాల్పడి జనంతో దెబ్బలు కూడా తిన్నారు.

**మనోళ్లు కూడా..**

1980వ దశకంలో టీమ్‌ఇండియా ఆటగాళ్లు రవి శాస్త్రి, అజరుద్దీన్, వినోద్ కాంబ్లీ ఎఫైర్లు నడిపారంటూ అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. తర్వాతి జనరేషన్‌లో యువీ ప్లే బాయ్ అవతారమెత్తాడు. 2010లోనూ శ్రీలంక పర్యటన సందర్భంగా భారత క్రికెటర్లలో ఇద్దరు హోటల్ గదుల్లో అమ్మాయిలతో గడిపినట్టు వార్తలు రాగా, దీనిపై లంక బోర్డు విచారణ కూడా జరిపించింది.

**కరేబియన్లకు కామనే**



వెస్టిండీస్ క్రికెటర్లు ఆటలో కంటే అతి చేయడంలోనే రాటుదేలారు. 2005లో ఆస్ట్రేలియాతో జరిగిన వీబీ సిరీస్‌లో విండీస్ ఆరింట ఐదు మ్యాచ్‌ల్లో ఓడి చెత్త రికార్డు మూటగట్టుకున్నది. ఓటమికి కారణమేంటని ఆరా తీస్తే జట్టులోని ఆటగాళ్లంతా హోటల్ గదుల్లో అమ్మాయిలతో గడిపేవారని, రాత్రి ఒంటిగంట తర్వాత వీరి రూమ్స్ నుంచి అమ్మాయిల శబ్దాలు వినిపించేవని డిజిసెల్ ప్రతినిధి రిచర్డ్ నోవెల్ అసలు గుట్టు విప్పాడు. వివ్ రిచర్డ్స్ బాలీవుడ్ హీరోయిన్ నేనా గుప్తాతో ఎఫైర్ నడిపాడు. వీరికి మసబా గుప్తా అనే అమ్మాయి కూడా ఉంది. ప్రస్తుతం ఆమె మోడలింగ్ చేస్తున్నది. ఇక క్రిస్‌గేల్ బస చేసిన హోటల్ గది నుంచి లెక్కకు మించిన అమ్మాయిలు పలు సందర్భాల్లో కనిపించి వార్తల్లో నిలిచారు.

# బంగ్లాను బాదేశారు!



ధవన్ (55)

### రెండో టీ20లో భారత్ గెలుపు

### చెలరేగిన ధవన్, రైనా

### ముక్కోణపు టోర్నమెంట్

**మొన్న విఫలమైన బౌలర్లు.. నిన్న సత్తా చాటారు.. లంకేయులను నిలువరించలేకపోయిన పేసర్లు.. సంచలనాలకు మారుపేరైనా బంగ్లా బ్యాట్స్‌మెన్ పనిపట్టారు.. అనుభవం పెద్దగా లేకపోయినా.. వచ్చిన అవకాశాలను అద్భుతంగా సద్వినియోగం చేసుకుంటూ అంచనాలను అందుకున్నారు. ఇక ప్రత్యర్థులు నిర్దేశించిన లక్ష్యం కూడా చిన్నదే కావడంతో మన బ్యాట్స్‌మన్ అలవోకగా ఛేదించేశారు. ఓవరాల్‌గా ఉనాద్కట్ బౌలింగ్ మెరుపులకు తోడుగా ధవన్ అర్ధసెంచరీతో చెలరేగడంతో రెండో టీ20లో ఘన విజయం సాధించిన భారత్ ముక్కోణపు టోర్నమెంట్‌లో బోణీ చేసింది.**

**కొలంబో:** తొలి మ్యాచ్ ఓటమి నుంచి భారత్ తొందరగానే తేరుకుంది. ఆల్‌రౌండ్ షోతో అదురగొడుతూ.. తమకంటే తక్కువ స్థాయి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యాన్ని చూపెట్టింది. ఫలితంగా ముక్కోణపు టోర్నీలో భాగంగా గురువారం ప్రేమదాస స్టేడియంలో జరిగిన రెండో టీ20లో భారత్ 6 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. దీంతో టీమ్‌ఇండియా ఖాతాలో రెండు పాయింట్లు జమ చేసుకుంది. బంగ్లా నిర్దేశించిన 140 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శిఖర్ ధవన్ (43 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) మరోసారి మెరువగా రైనా (27 బంతుల్లో 28; 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. అంతకుముందు బంగ్లా 20 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులు చేసింది. లిట్టన్ దాస్ (30 బంతుల్లో 34; 3 ఫోర్లు) టాప్ స్కోరర్. షబ్బీర్ (26 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. విజయ్ శంకర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.



ఉనాద్కట్ (3/38)



విజయ్ శంకర్ (2/32)

**రాణించిన లిట్టన్, షబ్బీర్**

టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్న రోహిత్ నిర్ణయానికి బౌలర్లు అండగా నిలిచారు. పిచ్ మీద ఉండే తేమను సద్వినియోగం చేసుకుంటూ మూడు, ఐదో ఓవర్‌లో ఓపెనర్లు సౌమ్య సర్కార్ (14), తమీమ్ ఇక్బాల్ (15)లను ఔట్ చేసి షాకిచ్చారు. ఈ ఇద్దరు 4 ఫోర్లు, ఓ సిక్స్ బాదడం, ఆ వెంటనే ముష్ఫికర్ (18) మరో రెండు బౌండరీలు సాధించడంతో పవర్‌ప్లేలో బంగ్లా 44/2 స్కోరు చేసింది. అయితే శంకర్ వేసిన ఏడో ఓవర్‌లో లిట్టన్ దాస్ మూడు బంతుల తేడాలో రెండుసార్లు క్యాచ్ ఔట్‌ల నుంచి బయటపడ్డాడు. లాంగాన్‌లో రైనా, ఫైన్ లెగ్‌లో సుందర్ ఈ క్యాచ్‌లను జారవిడిచారు. అతను ఓ ఎండ్‌లో నిలకడగా ఆడినా.. 9, 11వ ఓవర్‌లో విజయ్ శంకర్ (2/32) బంగ్లాకు డబుల్ ఝలక్ ఇచ్చాడు. భారీ సిక్సర్ కొట్టి టచ్‌లోకి వచ్చిన ముష్ఫికర్‌ను, క్రీజులో ఇబ్బందులుపడుతున్న మహ్మదుల్లా (1)ను పెవిలియన్ చేర్చడంతో బంగ్లా 72 పరుగులకు 4 వికెట్లు చేజార్చుకుంది. ముష్ఫికర్‌తో మూడో వికెట్‌కు 31 పరుగులు జోడించిన లిట్టన్ ఇన్నింగ్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఇతనికి షబ్బీర్ అండగా నిలిచాడు. భారీ షాట్లకు పోకున్నా స్ట్రయిక్ రొటేషన్‌తో సిక్స్ రన్‌రేట్ తగ్గకుండా చూశారు. 16వ ఓవర్‌లో లిట్టన్‌ను.. చాహల్ (1/19) ఔట్ చేయడంతో ఐదో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక ఇక్కడి నుంచి ఉనాద్కట్ (3/38) చెలరేగడంతో బంగ్లా లోయర్ ఆర్డర్ పరుగులు చేయలేకపోయింది. ఓవరాల్‌గా తొలి 10 ఓవర్లలో 69 పరుగులు చేసిన బంగ్లా చివరి 10 ఓవర్లలో 70 పరుగులు మాత్రమే రాబట్టకుంది.

**మళ్లీ ధవనే..**

లక్ష్య ఛేదనలో కెప్టెన్ రోహిత్ (17) మరోసారి నిరాశపర్చాడు. చకచకా మూడు బౌండరీలు బాదినా.. ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. బంగ్లా సంచలన బౌలర్ ముస్తాఫిజుర్ వేసిన నాలుగో ఓవర్ మూడో బంతిని లేట్ కట్ చేయబోయి రోహిత్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ధవన్ మాత్రం తన ఫామ్‌ను కొనసాగించగా.. వన్‌డౌన్‌లో రిషబ్ పంత్ (7) మళ్లీ విఫలమయ్యాడు. ఔట్‌సైడ్ ఆఫ్ బంతిని వికెట్ల మీదకు ఆడాడు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 47/2 స్కోరు చేసింది. రైనా వచ్చిన వెంబడే క్యాచ్ ఇచ్చాడు. కానీ లెగ్ గల్లీలో హసన్ వదిలిపెట్టడంతో ఊపిరి పీల్చుకున్నా తర్వాతి ఓవర్‌లో తన ట్రేడ్ మార్క్ షాట్ భారీ సిక్సర్‌ను కొట్టి కుదురుకున్నాడు. 8వ ఓవర్‌లో ధవన్ 6, 4తో 13 పరుగులు రాబట్టడంతో తొలి 10 ఓవర్లు ముగిసేసరికి రోహిత్‌సేన స్కోరు 81/2కు చేరింది. ఈ ఇద్దరు సమయోచితంగా ఆడుతూ రన్‌రేట్ తగ్గకుండా చూశారు. ఈ క్రమంలో ధవన్ 35 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇక 36 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన దశలో రైనా ఔటయ్యాడు. ఈ ఇద్దరి మధ్య మూడో వికెట్‌కు 68 పరుగులు జతయ్యాయి. ఈ దశలో వచ్చిన మనీష్ పాండే (19 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) నిలకడగా ఆడినా ధవన్ భారీ షాట్‌కు ప్రయత్నించి 17వ ఓవర్‌లో వెనుదిరిగాడు. అప్పటికే విజయ లక్ష్యం చిన్నదిగా ఉండటంతో కార్తీక్ (2), పాండే లాంఛనం ముగించారు.

**స్కోరు బోర్డు**

**బంగ్లాదేశ్:** తమీమ్ ఇక్బాల్ (సి) ఉనాద్కట్ (బి) శార్దూల్ 15, సౌమ్య సర్కార్ (సి) చాహల్ (బి) ఉనాద్కట్ 14, లిట్టన్ దాస్ (సి) రైనా (బి) చాహల్ 34, ముష్ఫికర్ రహీమ్ (సి) కార్తీక్ (బి) శంకర్ 18, మహ్మదుల్లా (సి) శార్దూల్ (బి) శంకర్ 1, షబ్బీర్ (సి) కార్తీక్ (బి) ఉనాద్కట్ 30, మెహిది హసన్ (సి) పాండే (బి) ఉనాద్కట్ 3, టస్కిన్ నాటౌట్ 8, రూబెల్ హుస్సేన్ రనౌట్ 0, ముస్తాఫిజుర్ నాటౌట్ 1, **ఎక్స్‌ట్రాలు:** 15, **మొత్తం:** 20 ఓవర్లలో 139/8. **వికెట్లపతనం:** 1–20, 2–35, 3–66, 4–72, 5–107, 6–118, 7–134, 8–135. **బౌలింగ్:** ఉనాద్కట్ 4–0–38–3, సుందర్ 4–0–23–0, శార్దూల్ 4–0–25–1, చాహల్ 4–0–19–1, శంకర్ 4–0–32–2.

**భారత్:** రోహిత్ (సి) ముస్తాఫిజుర్ 17, ధవన్ (సి) లిట్టన్ దాస్ (బి) టస్కిన్ 55, రిషబ్ (బి) రూబెల్ హుస్సేన్ 7, రైనా (సి) మెహిది హసన్ (బి) రూబెల్ హుస్సేన్ 28, మనీష్ పాండే నాటౌట్ 27, కార్తీక్ నాటౌట్ 2, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 18.4 ఓవర్లలో 140/4. **వికెట్లపతనం:** 1–28, 2–40, 3–108, 4–123. **బౌలింగ్:** ముస్తాఫిజుర్ 4–0–31–1, టస్కిన్ 3–0–28–1, రూబెల్ 3.4–0–24–2, హసన్ 4–0–21–0, సౌమ్య 1–0–8–0, మహ్మదుల్లా 1–0–11–0, ఇస్లామ్ 2–0–15–0.



కర్ణాటకతో జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో విజయం సాధించి దేవధర్ ట్రోఫీని గెలుచుకున్న భారత్-బీ జట్టు.

## సింగరేణి విజయం

### కోల్ ఇండియా టీ-20 క్రికెట్ టోర్నీ

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** సింగరేణి సంస్థ రామగుండం–1 డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోల్ ఇండియా టీ–20 క్రికెట్ టోర్నీ లీగ్‌దశ పోరులో రెండో రోజూ సింగరేణి జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం ఎంసీఎల్ జట్టుపై సింగరేణి 9 వికెట్ల తేడాతో గెలుపు సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎంసీఎల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన సింగరేణి జట్టు15.1 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 135 పరుగులు చేసి విజయాన్నందుకుంది.




సింగరేణి జట్టుతో జీఎం విజయపాల్‌రెడ్డి

# కోహ్లీని తీసుకుందామంటే ధోనీ వద్దన్నాడు!

### శ్రీనివాసన్ నా పదవి పీకేశారు

### మాజీ చీఫ్ సెలెక్టర్ వెంగ్‌సర్కార్ సంచలన వ్యాఖ్యలు



**ముంబై:** పదేండ్ల కిందట విరాట్ కోహ్లీని భారత్ జట్టులోకి ఎంపిక చేయడం వెనుక దాగి ఉన్న పరిణామాలను మాజీ చీఫ్ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ బహిర్గతం చేశాడు. ఈ విషయంలో బీసీసీఐ మాజీ బాస్ ఎన్. శ్రీనివాసన్, మాజీ సారథి ఎంఎస్ ధోనీపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశాడు. విరాట్‌ను జట్టులోకి తీసుకోవడం వల్లే శ్రీని.. తనను చీఫ్ సెలెక్టర్ పదవి నుంచి పీకేశాడని విమర్శించాడు. '2008 విరాట్ నేతృత్వంలోని కుర్రాళ్లు అండర్–19 ప్రపంచకప్‌ను గెలిచారు. దీంతో వాళ్లకు జాతీయ జట్టులో చోటు కల్పించాలని నిర్ణయించాం. అదే సమయంలో టీమ్‌ఇండియా లంక పర్యటనకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో కోహ్లీని జట్టులోకి తీసుకుందామని నేను ప్రతిపాదించా. దీనికి మిగతా సెలెక్టర్లు కూడా ఓకే చెప్పారు. ఎందుకంటే భారత్–ఎ తరఫున బ్రిస్బేన్‌లో జరిగిన ఓ మ్యాచ్‌లో విరాట్ 123 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కానీ ఆ సమయంలో కెప్టెన్ ధోనీ, చీఫ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ ఈ ఎంపికను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎందుకంటే విరాట్‌ను తీసుకుంటే తమిళనాడు ఆటగాడు బద్రీనాథ్‌పై వేటు పడుతుందని వాళ్ల భయం' అని వెంగ్‌సర్కార్ పేర్కొన్నాడు.

**నా నిర్ణయం నచ్చలేదు..**

అప్పట్లో తాను తీసుకున్న ఈ నిర్ణయం బీసీసీఐ కోశాధికారిగా పని చేస్తున్న శ్రీనివాసన్‌కు ఏమాత్రం నచ్చలేదని వెంగీ తెలిపాడు. 'చెన్నై సూపర్‌కింగ్స్ శ్రీని జట్టు. దానికి బద్రీనాథ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దీంతో బద్రీని ఎందుకు తప్పిస్తున్నావని శ్రీనివాసన్ నేరుగా నన్ను అడిగాడు. విరాట్ ప్రదర్శన నచ్చడం వల్లే అతనికి అవకాశం ఇచ్చామని చెప్పా. కానీ ఇది అతనికి నచ్చలేదు. వెంటనే దేశవాళీ సీజన్‌లో బద్రీ 800 పరుగులు చేశాడు కదా. మరి దానిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు అంటూ కాస్త ఆగ్రహంతో అడిగాడు. అప్పుడు నేను తర్వాత అవకాశం ఇస్తాం అనగానే.. బద్రీకి ఇప్పటికే 29 ఏండ్లు వచ్చాయి అంటూ వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. మరుసటి రోజు చీఫ్ సెలెక్టర్‌గా నా పదవీకాలం ముగిసిందని, నా స్థానంలో శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు' అని ఈ ముంబైకర్ వివరించాడు.

## నా భార్యను తిట్టినందుకే..



**సిడ్నీ:** తన భార్యపై అసభ్య పదజాలాన్ని వాడినందుకే తాను డికాక్‌తో గొడవపడాల్సి వచ్చిందని వార్నర్ ఆసీస్ మీడియాతో పేర్కొన్నాడు. తొలి టెస్టు నాలుగో రోజు ఆటలో స్లెడ్జింగ్ చేసిన వార్నర్.. డికాక్ కుటుంబాన్ని 'బుష్ పిగ్' అని హేళన చేశాడు. ఆ తర్వాత టీ విరామానికి వస్తూ మెట్లపై ఇద్దరూ తీవ్రంగా గొడవపడినట్లు సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డైంది. కానీ అంతకంటే ముందే డ్రెస్సింగ్ రూమ్‌కు వస్తున్న క్రమంలో వార్నర్–డికాక్ మధ్య మైదానంలోనే తీవ్రస్థాయిలో వాదనలు జరిగినట్లు మరో ఫుటేజ్‌లో బయటపడింది. వార్నర్ భార్యను ఉద్దేశిస్తూ డికాక్ 'ఫ..సుక్' అంటూ వ్యాఖ్యానించడంతో నిగ్రహం కోల్పోయిన ఆసీస్ బ్యాట్స్‌మన్ అతన్ని కొట్టేందుకు వెళ్లాడు. 'ముందు రోజు నేను కాస్త ఆవేశానికి లోనయ్యానని ఫుటేజ్‌లో చూసి తెలుసుకున్నా. దానికి చాలా పశ్చాత్తపం చెందా. కానీ తర్వాత డికాక్ నా కుటుంబం జోలికి వచ్చాడు. నా భార్య గురించి తప్పుగా మాట్లాడటంతో నేను అదుపు తప్పాను. ఆడవాళ్లు, జాతి వివక్షపై వ్యాఖ్యలు చేయకూడదు. ఆ జోన్‌ను ఎవరూ టచ్ చేయకూడదు' అని వార్నర్ చెప్పాడు.

## భారత మహిళలకు తొలి ఓటమి



**సియోల్:** భారత మహిళల హాకీ జట్టు వరుస విజయాలకు బ్రేక్ పడింది. గురువారం జరిగిన మూడో మ్యాచ్‌లో 1–2 గోల్స్ తేడాతో దక్షిణ కొరియా జట్టు విజయం సాధించింది. తొలి క్వార్టర్ 12వ నిమిషంలో సెయుల్ కీ చియోన్, 14వ నిమిషంలో యురిమ్ లీ వెంటవెంటనే గోల్స్ కొట్టడంతో కొరియా జట్టు 2–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత ఫార్వర్డ్ లాల్‌రెమిసియామి భారత్ తరఫున ఏకైక గోల్‌ను మ్యాచ్ 16వ నిమిషంలోనే అందించింది.

## పేసర్ షమీపై కేసు నమోదు



**కోల్‌కతా:** వివాహేతర సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా.. తనను తీవ్రంగా వేధిస్తున్నాడని భారత పేసర్ మహ్మద్ షమీపై ఆరోపణలు చేసిన అతని భార్య హసిన్ జహ గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోల్‌కతా నగరంలోని లాల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో పరస్త్రీలతో వివాహేతర సంబంధాలు, తనపై గృహహింసకు పాల్పడుతున్నట్లు షమీపై.. హసిన్ కేసుపెట్టింది.




# శృంగార తారతో సంబంధాన్ని తోసిపుచ్చిన ట్రంప్


స్టెఫనీ క్లిఫర్డ్

**వాషింగ్టన్, మార్చి 8:** శృంగార తారతో లైంగిక సంబంధాలున్నట్టు వచ్చిన ఆరోపణలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించారు. ఈ విషయమై చాలా రోజులుగా వివిధ రూపాల్లో కథనాలు వెలువడుతుండగా, అమెరికా అధ్యక్ష కార్యాలయం తొలిసారిగా గురువారం స్పందించింది. ట్రంప్‌తో తనకు లైంగిక సంబంధం ఉండేదని, దానిని బయట పెట్టకుండా ఉండేందుకు ట్రంప్ న్యాయవాది మైఖేల్ కోహెన్ 1.30 లక్షల డాలర్లు ఇచ్చి కొన్ని పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నాడని, ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ పోర్న్ స్టార్ స్టెఫనీ క్లిఫర్డ్ కాలిఫోర్నియా రాష్ట్ర కోర్టులో దావా వేశారు. దీనిపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి శారా సాండర్స్ మాట్లాడుతూ, ట్రంప్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారని, ఈ కేసు ఇప్పటికే మధ్యవర్తి సహాయంతో పరిష్కారమైందని గుర్తు చేశారు.

# శ్రీలంక ప్రధాని నుంచి హోంశాఖ తొలిగింపు!

### అల్లర్ల నేపథ్యంలో అధ్యక్షుడి నిర్ణయం

**కొలంబో, మార్చి 8:** ఎమర్జెన్సీ విధించినప్పటికీ శ్రీలంకలోని క్యాండీ జిల్లాలో సింహళ బౌద్ధులు, ముస్లింలకు మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ప్రధానమంత్రి రణిల్ విక్రమసింఘే వద్ద ఉన్న హోంశాఖను తొలిగించి కొత్త వారికి అప్పగించారు. గురువారం ఉదయం ప్రధాని విక్రమ సింఘేకు చెందిన యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ) నాయకుడు రంజిత్ మద్దుమ భండారా శ్రీలంక హోంశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని విక్రమ సింఘే 11 రోజులపాటు హోంశాఖ మంత్రిగా కొనసాగినప్పటికీ క్యాండీ జిల్లాలో అల్లర్లు అదుపులోకి రాలేదు. ముస్లిం వర్గాలకు సంబంధించిన వ్యాపారాలు, ప్రార్థనా స్థలాలపై దాడులు జరుగుతుండటంతో ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది.

# కర్ణాటకకు ప్రత్యేక జెండా

### ఆవిష్కరించిన సీఎం సిద్దరామయ్య


కర్ణాటక రాష్ట్ర పతాకం నాడధ్వజను ఆవిష్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

**బెంగళూరు:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ముందు 'కన్నడిగుల ఆత్మగౌరవ' అంశాన్ని లేవనెత్తుతూ సీఎం సిద్దరామయ్య ఓ ప్రత్యేక 'రాష్ట్ర పతాకాన్ని (నాడ ధ్వజ)' ఆవిష్కరించారు. పసుపు, తెలుపు, ఎరుపు రంగులో ఉన్న ఆ జెండా మధ్యలో రాష్ట్ర చిహ్నం 'గండభేరుండ (రెండు తలల పక్షి)'ని ఉంచారు. గతేడాది ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓ కమిటీ కర్ణాటకకు ప్రత్యేక జెండా ఉండాలని సిఫారసు చేసింది. సీఎం సిద్దరామయ్య గురువారం వివిధ కన్నడ సంస్థలు, సాహితీవేత్తలతో సమావేశమయ్యారు. వారంతా ఏకగ్రీవంగా డిజైన్ ఆమోదించిన తర్వాత ఆ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ పతాకం 'కన్నడిగుల ఆత్మగౌరవ చిహ్నం' అని, ఇది చరిత్రాత్మక నిర్ణయమని సిద్ద రామయ్య అన్నారు. ఈ జెండాను ఆమోదం కోసం కేంద్రానికి పంపుతామని చెప్పారు. కేంద్రం ఆమోదం లేకుండా రాష్ట్రం సొంతంగా జెండాను కలిగి ఉండరాదన్నారు. రాష్ట్రాలకు పతాకాలు ఉండరాదని రాజ్యాంగంలో లేదన్నారు.

# రెండున్నరకే శానిటరీ న్యాప్‌కిన్

### మహిళ దినోత్సవం సందర్భంగా 'సువిధ'ను ప్రారంభించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కేవలం రూ. 2.50కే బయోడిగ్రేడబుల్ (సహజసిద్ధంగా భూమిలో కలిసిపోయే) శానిటరీ న్యాప్‌కిన్‌లను అందించే కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. 'సువిధ' పేరుతో అందించే ఈ న్యాప్‌కిన్లు దేశంలోని 3,200 ప్రధానమంత్రి భారతీయ జనౌషధి ప్రయోజన (పీఎంబీజేపీ) కేంద్రాల్లో మే 28 నుంచి అందుబాటులో ఉంటాయని కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ గురువారం తెలిపారు.



# ఎయిమ్స్‌లో 1343 ఉద్యోగాలు

## విద్య, ఉద్యోగ సమాచారం

- **బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు సదవకాశం**
- **రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక**
- **మంచి జీతభత్యాలు, ఉద్యోగ భద్రత**
- **దరఖాస్తులకు చివరితేదీ: 2018 మార్చి 12**



**ఉత్తరాఖండ్ రిషికేష్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్స్ (గ్రేడ్ -2 ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**వివరాలు:**

**ఎయిమ్స్ రిషికేష్ దేశంలోని ఏడు అత్యున్నత ఆరోగ్య ఇన్‌స్టిట్యూట్‌ల్లో ఒకటి. దీన్ని 2012 సెప్టెంబర్ 20న స్థాపించారు.**

- మొత్తం పోస్టుల సంఖ్య- 1126 పోస్టులు (జనరల్-570, ఓబీసీ-304, ఎస్సీ-168, ఎస్టీ-84)
- **పోస్టు పేరు:** స్టాఫ్‌నర్స్ (గ్రేడ్ -2)
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బీఎస్సీ ఆనర్స్/నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్), బీఎస్సీ నర్సింగ్ (పోస్టు బేసిక్) లేదా జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీలో డిప్లొమాలో ఉత్తీర్ణత. 50 పడకల హాస్పిటల్/హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్‌గా రెండేండ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలి. నర్స్ అండ్ మిడ్ వైఫరీలో సెంట్రల్/స్టేట్ లేదా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేదా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 9,300-34,800 + గ్రేడ్ పే రూ. 4,600/-
- **వయస్సు:** 21 ఏండ్ల నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ప్రొబేషనరీ పీరియడ్ :** రెండేండ్లు
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/ రాతపరీక్ష
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.3000/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. పూర్తి వివరాలతో పాటు, వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. నిర్ణీత ఫార్మాట్‌లోనే ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 12

## టీచింగ్ పోస్టులు

**మొత్తం పోస్టుల సంఖ్య: 217 పోస్టులు (ప్రొఫెసర్-31, అసోసియేట్ ప్రొఫెసర్-72, అసిస్టెంట్ ప్రొఫెసర్-78, అడిషనల్ ప్రొఫెసర్-36)**

- **అర్హతలు:** మెడికల్, డెంటల్ అభ్యర్థులకు సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/బీడీఎస్‌తోపాటు పీజీ (ఎంటీ, ఎంఎస్, ఎండీఎస్, ఎంసీహెచ్, డీఎం) లేదా సంబంధిత విభాగంలో పీజీ లేదా ఎండీ/ఎంఎస్ లేదా స్పెషలైజేషన్ విభాగంలో పీజీతో పాటు పీహెచ్‌డీ. నాన్ మెడికల్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీ/పీజీలో ఉత్తీర్ణత. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో సభ్యత్వం, సంబంధిత టీచింగ్/రిసెర్చ్ రంగంలో అనుభవం ఉండాలి.

**పే అండ్ అలవెన్సులు:**

- ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) : రూ.37,400-67,000+అకడమిక్ గ్రేడ్ పే రూ. 10,500
- అడిషనల్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) : రూ.37,400-67,000+అకడమిక్ గ్రేడ్ పే రూ. 9,500
- అసోసియేట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 4) : రూ.37,400-67,000+అకడమిక్ గ్రేడ్ పే రూ. 9,000/-
- అసిస్టెంట్ ప్రొఫెసర్ (పే బ్యాండ్ 3) : రూ.15,600-39,100+అకడమిక్ గ్రేడ్ పే రూ. 8,000
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో

- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 17
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

# కర్టాటక బ్యాంక్‌లో ఆఫీసర్లు

**కర్ణాటక బ్యాంక్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఆఫీసు/బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న స్కేల్ -1 ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **పోస్టు పేరు:** ఆఫీసర్ (స్కేల్ -1 )

**అర్హతలు:**

- **అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్:** అగ్రికల్చరల్ సైన్స్, హార్టికల్చర్ అండ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ/పీజీలో ఉత్తీర్ణత.
- **చార్టెడ్ అకౌంటెంట్:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతోపాటు సీఏ ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ సీఏ కోర్సు చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **లా ఆఫీసర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమశ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఆఫ్ లా ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో మూడేండ్ల అనుభవం ఉండాలి.
- **రిలేషన్‌షిప్ మేనేజర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమశ్రేణిలో డిగ్రీతోపాటు ఎంబీఏ (మార్కెటింగ్)లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 26 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది
- **పే స్కేల్:** రూ. 7.75 లక్షలు (ఏడాదికి)
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా



- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. నిర్ణిత నమూనాలో దరఖాస్తులను నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** www.karnatakabank.com

**చిరునామా:**Deputy General Manager (HR & IR), Karnataka Bank Limited, Head Office, Mahaveera Circle, Kanakanady, Mangalore-575002

# ఎన్‌సీఈఆర్‌టీలో

**న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ & ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**



**వివరాలు:**

- ఎడిటర్ - 2 (ఇంగ్లిష్ - 1, హిందీ - 1)
- **అర్హతలు:** డిగ్రీ, పీజీ డిప్లొమా ఇన్ బుక్ పబ్లిషింగ్/మాస్ కమ్యూనికేషన్ లేదా జర్నలిజం. వీటిలో ఎడిటింగ్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఎడిటింగ్‌లో కనీసం 8 ఏండ్ల అనుభవం ఉండాలి.
- అసిస్టెంట్ ఎడిటర్ (ఉర్దూ) - 1
- **అర్హతలు:** డిగ్రీ, బుక్ పబ్లిషింగ్‌లో పీజీ డిప్లొమా లేదా ఎంసీజే/జర్నలిజం. ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- గ్రేడ్ - 1 ఆర్టిస్ట్ - 1
- మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ - 1 పోస్టు
- సీనియర్ ప్రూఫ్ రీడర్ - 1
- గ్రేడ్ - 1 స్టోర్ కీపర్ - 1 పోస్టు
- గ్రేడ్ - 2 స్టోర్ కీపర్ - 5 పోస్టులు
- **అర్హతలు:** ఇంటర్ ఉత్తీర్ణత. స్టోర్ కీపింగ్ అండ్ పర్చేజింగ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 3
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ. 500/-, ఓబీసీలకు రూ. 250/-
- **వెబ్‌సైట్:** http://www.ncert.nic.in

# ఎన్ఐడబ్ల్యూఈలో ఖాళీలు

**చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- మొత్తం పోస్టుల సంఖ్య: 13
- విభాగాలవారీగా ఖాళీలు: ప్రాజెక్టు ఇంజినీర్-9, ప్రాజెక్టు ఆఫీసర్ (అకౌంట్స్)-1, జూనియర్ ఇంజినీర్-2, జూనియర్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ (స్టెనో టైపిస్ట్)-1




- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ/బోర్డు నుంచి బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్ లేదా ఎంటెక్/ఎంఈ, ఎమ్మెస్సీ, డిప్లొమా, ఇంటర్‌లో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** టెస్ట్/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:**ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:**www.niwe.res.in

# 'స్పీచ్ & హియరింగ్' స్పెషల్ కోర్సులు

**మైసూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ & హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్)లో 2018- 19 విద్యాసంవత్సరానికి పీజీ, పీహెచ్‌డీ బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**

**ఏఐఐఎస్‌హెచ్ అనేది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ.**

**జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పించే కోర్సులు:**

- బీ.ఏఎస్ఎల్‌పీ (బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజి అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజి)
- సీట్ల సంఖ్య - 62
- కోర్సు కాలవ్యవధి - నాలుగేండ్లు
- ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ: మే 26
- ఎమ్మెస్సీ (ఆడియాలజి) - 36 సీట్లు - 2 ఏండ్లు
- ఎమ్మెస్సీ (స్పీచ్ - లాంగ్వేజ్ పాథాలజి) - 36 సీట్లు - 2 ఏండ్లు
- ఎంఈడీ. స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపేర్‌మెంట్)-20 సీట్లు-2 ఏండ్లు (ఈ కోర్సుకు మైసూర్ క్యాంపస్‌లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తారు)
- ఎంట్రెన్స్ తేదీ: మే 26

**యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ నిర్వహించే ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశాలు కల్పించే కోర్సులు:**

- పీహెచ్‌డీ (ఆడియాలజి) (జేఆర్ఎఫ్) - 4 సీట్లు - మూడేండ్లు
- పీహెచ్‌డీ (స్పీచ్ - లాంగ్వేజ్ పాథాలజి) (జేఆర్ఎఫ్) - 4 సీట్లు - మూడేండ్లు
- పీహెచ్‌డీ (స్పీచ్ & హియరింగ్)

**ఎంట్రెన్స్ లేకుండా ప్రవేశాలు కల్పించే కోర్సులు:**

- బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపేర్‌మెంట్) - 20 సీట్లు - 2 ఏండ్లు
- డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ హియర్ మౌల్డ్ టెక్నాలజీ - 25 సీట్లు - ఏడాది కోర్సు
- డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ) - 25 సీట్లు - ఏడాది కోర్సు
- డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్ అండ్ స్పీచ్ - 25 (ప్రతి సెంటర్లో)- ఏడాది కోర్సు
- పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ లింగ్విస్టిక్స్ ఫర్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజి - 10 సీట్లు - ఏడాది కోర్సు
- పీజీ డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్ & టెక్నాలజీ - 10 సీట్లు - ఏడాది కోర్సు



- పీజీ డిప్లొమా ఇన్ అగుమెంటివ్ & ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్ - 20 సీట్లు - ఏడాది కోర్సు
- పీజీ డిప్లొమా ఇన్ న్యూరో - ఆడియాలజీ - 10 సీట్లు - ఏడాది కోర్సు
- పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ (పీడీఎఫ్) - 2 ఏండ్లు - రెండేండ్లు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంట్రెన్స్ బేస్డ్/ నాన్ ఎంట్రెన్స్ బేస్డ్ ప్రోగ్రామ్స్‌కు మే 2
- **వెబ్‌సైట్:** www.aiishmysore.in
- పూర్తి వివరాల కోసం 0821-2502162/2502163లో సంప్రతించవచ్చు.